మన సమగ్ర
ప్రజావాణి
తెలుగు డైలీ
RNI NO:TGTEL/25/A5443
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

Wanted Reporters
తెలుగు రాష్ట్రాలలో దిగ్విజయంగా నడుపబడుతున్న
ప్రజావాణి దిన పత్రిక మరియు మన ప్రజావాణి NEWS TV చానల్
నందు పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా
విలేఖరులు కావలెను
(కొత్తవారికి అవకాశం, అనుభవం కల వారికి ప్రాధాన్యత)
Ph: 9440032006

రాజన్న సిరిసిల్ల	ఆదివారం	22.11.2026	సంపుటి : 01	సంచిక : 321	పేజీలు : 12	వెల : 2/-
RAJANNA SIRICILLA	SUNDAY	22.11.2026	Volume : 01	Issue :321	Pages : 12	Cost : 2/-

విదేశాల్లో ఏఐ కేంద్రాలు నిర్మిస్తే
జరిమానాలు
● అమెరికా సంస్థలకు ట్రంప్ హెచ్చరిక.. ● స్వదేశంలోనే డేటా కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశం



కాళోజీ కళాక్షేత్రం సాంస్కృతిక వైభవానికి వేదిక కావాలి
ప్రభుత్వ కార్యాలయాల తరలింపునకు సీఎం అడ్డుకట్ట..
కళా, సాహిత్య కార్యక్రమాల నిర్వహణకే వినియోగించాలని ఆదేశం



ఏఐ గుర్తింపు సాఫ్ట్‌వేర్‌నే ఆధారంగా శిక్షించొద్దు
తప్పుడు ఫలితాలతో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకూడదు.. సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించాలి: సీజేఐ జస్టిస్ సూర్యకాంత్





తెలంగాణకు రూ.4 వేల కోట్ల
సఫ్రాన్ పెట్టుబడులు!
ఫ్రాన్స్ విమాన ఇంజిన్ల తయారీ సంస్థతో భట్టి విక్రమార్క చర్చలు..
డిసెంబరులో ఒప్పందంపై ఆశలు

హైదరాబాద్,నవంబర్ 21 : తెలంగాణలో విమానయాన, రక్షణ రంగాల తయారీ పరిశ్రమలను మరింత విస్తరించేందుకు ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ సంస్థ సఫ్రాన్ ఏకంగా రూ.4 వేల కోట్ల పెట్టుబడులు పెట్టే అవకాశముంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సంస్థ ప్రతినిధులతో చర్చలు జరుపుతోంది. ఫ్రాన్స్ మిగతా2లో...



ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి
- విద్యార్థులకు ప్రధాని మోదీ పిలుపు..
- ఐఐటీ ఖరగ్‌పూర్ వజ్రోత్సవాల్లో ప్రసంగం

ఖరగ్‌పూర్,నవంబర్ 21 : జీవితంలో కొత్త శిఖరాలను అధిరోహించాలంటే ముందుగా మనకు మనమే విధించుకున్న పరిమితులను అధిగమించాలని, ఆశయాలు, ఆకాంక్షలను మరింత విస్తరించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్వతంత్ర భారతదేశంలో తొలి ఐఐటీగా గుర్తింపు పొందిన ఐఐటీ ఖరగ్‌పూర్ 75 ఏళ్ల ప్రస్థానాన్ని మిగతా2లో...

చంద్రబాబుతో బీజేపీ నేతల భేటీ
కడప జడ్పీ చైర్మన్ పదవి కేటాయింపుపై ఆదినారాయణరెడ్డి అసంతృప్తి



అమరావతి,నవంబర్ 21 : జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే సి. ఆది నారాయణరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సమావేశమయ్యారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి సీఎంను కలిశారు. తన సోదరుల కుమారులు చదిపిరాళ్ల రాజేశ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డిలు కూడా వెంట ఉన్నారు.కడప జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని బీజేపీకి కేటాయించకపోవడంపై ఆదినారాయణరెడ్డి అసంతృప్తితో ఉన్న నేపథ్యంలో ఈ భేటీ మిగతా2లో...

రాష్ట్రంలో కాంగ్రెస్
పనైపోయింది
రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం..
ఖైరతాబాద్ ఉప ఎన్నికకు సిద్ధం కావాలి
తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ నాయకుల చేరిక.. హరీశ్‌రావు వ్యాఖ్యలు



హైదరాబాద్,నవంబర్ 21 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ప్రవీణ్, శ్రీనాథ్ తదితరులకు హరీశ్‌రావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పాలనపై పలు విమర్శలు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహారశైలితో హైదరాబాద్ నగర ప్రతిష్ఠ దెబ్బతింటోందని హరీశ్‌రావు ఆరోపించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన హైదరాబాద్ నగర అభివృద్ధి, మౌలిక వసతుల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో జరుగుతున్న పార్టీ చేరికలు బీఆర్ఎస్ పట్ల నాయకులు, కార్యకర్తల్లో మిగతా2లో...

కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతిపై
విచారణ చేస్తాం
- బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజాధనం తిరిగి వసూలు చేస్తాం: రాంచందర్‌రావు



హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం
మత్తు పదార్థాల తయారీకి మూతపడిన కంపెనీలు అడ్డాలు..
ఇళ్ల మేడలపై గంజాయి సాగు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్,నవంబర్ 21 : హైదరాబాద్‌లో డ్రగ్స్ చలామణి విచ్చలవిడిగా పెరుగుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని కొన్ని మూతపడిన కంపెనీలను మత్తు పదార్థాల తయారీకి అడ్డాలుగా ఉపయోగిస్తున్నారని, ఇళ్ల మేడలపైనా గంజాయి మొక్కలు పెంచుతున్నారని పేర్కొన్నారు. శనివారం శ్రీ సత్యసాయి నిగమాగమంలో నిర్వహించిన 'సిటీ కన్వెన్షన్ ఆన్ డ్రగ్ ఫ్రీ ఇండియా' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.భారతదేశానికి యువతే అతిపెద్ద ఆస్తి అని, అలాంటి యువత మత్తు పదార్థాలకు బానిసలవడం దేశ భవిష్యత్తుకు మిగతా2లో...

గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు
వివరాలు 2లో

హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం

(మొదటి పేజీ తరువాయి)

నుంచి ఐటీ కారిడార్ల వరకు యువతను మత్తు పదార్థాలు ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు.డ్రగ్స్ నియంత్రణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజిక సంస్థలు, యువత, ఐటీ నిపుణులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో ప్రభావం చూపగల వ్యక్తులు యువతలో అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని సూచించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా యువతకు మార్గనిర్దేశం చేయాలని కోరారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశాన్ని 2029 నాటికి డ్రగ్స్ రహితంగా మార్చాలనే లక్ష్యంతో కేంద్రం పనిచేస్తోందని తెలిపారు. 'నషా ముక్త్ భారత్' ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పలువురు ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు, యువత పాల్గొన్నారు. నవంబర్ 25 నుంచి 27 వరకు అంబర్‌పేట నుంచి జూబ్లీహిల్స్ వరకు మూడు రోజుల పాదయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

కాళోజీ కళాక్షేత్రం సాంస్కృతిక వైభవానికి వేదిక కావాలి

హైదరాబాద్,నవంబర్ 21 : ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఆశయాలకు అనుగుణంగా నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని కళా, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కళాక్షేత్రంలో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నారనే వార్తలపై స్పందించిన ఆయన, ఎలాంటి ప్రభుత్వ కార్యాలయాలను అక్కడికి తరలించవద్దని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను ఆదేశించారు.తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక రంగాలకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచేలా ఈ కళాక్షేత్రాన్ని వినియోగించాలని సీఎం సూచిం చారు. కవులు, రచయితలు, కళాకారులు తమ ప్రతిభ ను ప్రదర్శించేందుకు ఇది ప్రధాన వేదికగా నిలవాలని పేర్కొన్నారు. కళాక్షేత్రంలో నిర్వహించాల్సిన కార్యక్ర మాలపై కాళోజీ ఫౌండేషన్ సభ్యులతో చర్చించి కార్యా చరణ రూపొందించాలని కలెక్టర్‌కు సూచించారు. కాళోజీ సాహిత్య వారసత్వాన్ని భావితరాలకు పరిచ యం చేసేలా సాహిత్య సమ్మేళనాలు, కవిసమ్మేళనాలు, కళా ప్రదర్శనలు, సాంస్కృతిక వేడుకలు నిర్వహించేం దుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజాకవి కాళోజీ పేరుతో నిర్మించిన ఈ కళాక్షేత్రం తె లంగాణ కళా, సాహిత్య రంగాల అభివృద్ధికి కేంద్రంగా నిలవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు.

తెలంగాణకు రూ.4 వేల కోట్ల సఫ్రాన్ పెట్టుబడులు!

(మొదటి పేజీ తరువాయి)

పర్యటనలో భాగంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పారిస్ సమీపంలోని ఎవ్రీ-కోర్బాయిల్‌లో ఉన్న సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ తయారీ కేంద్రాన్ని సందర్శించి సంస్థ ఉన్నతాధికారులతో సమావేశమ య్యారు.తెలంగాణలో ఇప్పటికే కొనసాగుతున్న సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించడం, కొత్త తయారీ కేంద్రాల ఏర్పాటుపై ఈ సందర్భంగా చర్చించారు. రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు, మెరుగైన మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు అనుకూలమైన విధానాలు ఉన్నాయని భట్టి విక్రమార్క సంస్థ ప్రతినిధులకు వివరించారు. తెలంగాణలో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని కోరారు. **హైదరాబాద్‌లో ఇప్పటికే కార్యకలాపాలు**సఫ్రాన్ సంస్థకు హైదరాబా ద్‌లో ఇప్పటికే గణనీయమైన ఉనికి ఉంది. లీప్ విమా న ఇంజిన్లకు అవసరమైన కీలక విడిభాగాల తయారీ కేంద్రంతో పాటు సఫ్రాన్ ఎలక్ట్రికల్ అండ్ పవర్ పరిశ్రమ, విమాన ఇంజిన్ల నిర్వహణ, మరమ్మతులు, పునరుద్ధరణ సేవల కేంద్రం ఇక్కడ పనిచేస్తున్నాయి. ఈ కార్యకలాపాలను మరింత విస్తరించడం ద్వారా తెలంగాణను అంతర్జాతీయ విమానయాన పరిశ్రమల తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. **డిసెంబరులో ఒప్పందం పై ఆశలు**ప్రతిపాదిత రూ.4 వేల కోట్ల పెట్టుబడికి సంబంధించి డిసెంబరులో నిర్వహించను న్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'లో అవగాహన ఒప్పందం కుదిరే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు భావిస్తు న్నాయి. ఈ సదస్సుకు సఫ్రాన్ సంస్థ ప్రతినిధుల బృందాన్ని ఆహ్వానించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. పరిశ్రమలు, వాణిజ్య శాఖ అధికారులు సంస్థతో తదుపరి చర్చలు జరిపి పెట్టుబడి ప్రతిపాదనను ఖరారు చేయనున్నారు. ఈ పెట్టుబడి కార్యరూపం దాలిస్తే రాష్ట్రంలో విమానయాన విడిభాగాల తయారీ రంగానికి మరింత ఊతం లభించడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది.

రాష్ట్రంలో కాంగ్రెస్ పనైపోయింది

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న ఆసక్తిని తెలియజేస్తున్నాయని అన్నారు.రాష్ట్రంలో తాగునీటి సమస్యపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రోజుకు 80 వేల వాటర్ ట్యాంకర్లను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ప్రజలకు తాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మరోవైపు తెలంగాణ రైజింగ్ పేరుతో ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులకు పొంతన లేదని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రానికి ఎన్ని పరిశ్రమలు వచ్చాయి? ఎంతమందికి ఉపాధి లభించింది? అనే వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. పరిశ్రమల ఏర్పాటుపై పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, అర్హులైన పేదలకు పింఛన్లు అందించడం వంటి అంశాల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వి. శ్రీనివాస్‌గౌడ్ తదితర బీఆర్ఎస్ నాయకులు, ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు

12 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం.. రూ.3,723 కోట్లతో అభివృద్ధి పనులు

అమరావతి,నవంబర్ 21 : 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు వేగవంతం చేసింది. పుష్కరాలకు 10 నుంచి 12 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్న నేపథ్యంలో, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు.పుష్కరాల ఏర్పాట్ల కోసం 22 ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో రూ.3,723.69 కోట్లతో 4,862 పనులను ప్రతిపాదించారు. వీటిలో రూ.2,051.70 కోట్ల విలువైన 2,260 పనులకు ఇప్పటికే పరిపాలనా అనుమతులు లభించాయి. పనులన్నీ 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని సీఎం గడువు విధించారు. **440 ఘాట్లలో సౌకర్యాలు** గోదావరి తీరంలోని 440 ఘాట్లను అభివృద్ధి చేసి, భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, పారిశుధ్యం, భద్రతా ఏర్పాట్లు కల్పించనున్నారు. రూ.300 కోట్లతో 78 రహదారుల పనులు చేపట్టి 2027 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. **రవాణా, వైద్య సేవలకు ప్రాధాన్యం** భక్తుల రాకపోకల కోసం 4 వేల ప్రత్యేక బస్సులు, 649 గ్రీన్ బస్సులు నడపాలని ప్రణాళిక రూపొందించారు. 1,560 ప్రత్యేక రైళ్ల ఏర్పాట్లపైనా దృష్టి సారించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో అదనంగా 100 పడకలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఘాట్ల వద్ద వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. **135 భాషల్లో ఏఐ సేవలు** దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులకు సమాచారం అందించేందుకు 135 భాషల్లో పనిచేసే ఏఐ చాట్‌బాట్‌ను ఏర్పాటు చేయనున్నారు. డిజిటల్ తెరలు, వర్చువల్ రియాలిటీ సదుపాయాలతో పాటు రద్దీని పర్యవేక్షించేందుకు కమాండ్ కంట్రోల్ వ్యవస్థను వినియోగించనున్నారు.గోదావరి నది కలుషితం కాకుండా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, పారిశు ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. నదీ హారతి, సామూహిక కూచిపూడి నృత్య ప్రదర్శన, యోగా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పుష్కరాల నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు.



విదేశాల్లో ఏఐ కేంద్రాలు నిర్మిస్తే జరిమానాలు

వాషింగ్టన్,నవంబర్ 21

విదేశాల్లో కృత్రిమ మేధ (ఏఐ) డేటా కేంద్రాలను ఏర్పాటు చేసే అమెరికా సాంకేతిక సంస్థలపై భారీ జరిమానాలు, పన్నులు విధిస్తామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అమెరికా కంపెనీలు తమ పెట్టుబడులను ఇతర దేశాలకు తరలించకుండా, స్వదేశంలోనే డేటా కేంద్రాలను నిర్మించాలని స్పష్టం చేశారు.విదేశాల్లో ఏర్పాటు చేసే డేటా కేంద్రాల ద్వారా కీలక సాంకేతిక పరిజ్ఞానం ఇతర దేశాల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో సెమీకండక్టర్ చిప్స్ తయారీ వంటి రంగాల్లో అమెరికా అనుసరించిన విధా నాల వల్ల నష్టపోయామని పేర్కొన్నారు. గూగుల్, మెటా వంటి దిగ్గజ సంస్థలు అమెరికాలోనే పెట్టు బడులు పెట్టాలని సూచించారు.అయితే, ఏఐ డేటా కేంద్రాల ఏర్పాటుతో విద్యుత్ వినియోగం పెరిగి, ప్రజలపై అదనపు భారం పడుతుందనే ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్య ంలో ట్రంప్ తాజా హెచ్చరికలు అంతర్జాతీయ సాంకేతిక రంగంలో చర్చనీయాంశంగా మారాయి.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

(మొదటి పేజీ తరువాయి)

పురస్కరించుకుని నిర్వహించిన ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సంస్థ 75 ఏళ్ల ప్రస్థానానికి గుర్తుగా ప్రత్యేక స్మారక నాణేన్ని ఆవిష్కరించారు.మన ఆలోచనలు, కలలు, ఆశయాలు, ప్రతిభకు మనమే హద్దులు విధించుకుంటూ ఉంటామని మోదీ పేర్కొన్నారు. కొన్ని నమ్మకాలు, భయాల కారణంగా ఉన్న అవకాశాలను కూడా అందిపుచ్చుకోలేక ప్రయత్నాలను మధ్యలోనే వదిలేస్తామని అన్నారు. అయితే స్వయంగా ఏర్పరచుకున్న ఈ పరిమితులను ఛేదించినప్పుడే మనలోని పూర్తి సామర్థ్యాన్ని వెలికితీయగలమని, కొత్త అవకాశాలకు మార్గం సుగమం అవుతుందని వివరించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను చిన్నవిగా నిర్దేశించుకోకుండా, ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలని సూచించారు.దేశానికి తొలి ప్రాధాన్యత ఇచ్చే ఆలోచనా విధానాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకుంటే అభివృద్ధికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయని ప్రధాని అన్నారు. తన పాలనలోనూ గతంలో అసాధ్యమని భావించిన అనేక లక్ష్యాలను సాధించామని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశ నిర్మాణంలో ఐఐటీ ఖరగ్‌పూర్ కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్య సాధనలో ఈ విద్యాసంస్థ మరింత కీలకంగా నిలవాలని ఆకాంక్షించారు.ప్రపంచ బ్యాంకు నివేదికను ప్రస్తావిస్తూ గత 1213 ఏళ్లలో దేశంలో దాదాపు 50 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని మోదీ పేర్కొన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యాన్ని సాధించడంలో ఐఐటీ ఖరగ్‌పూర్ తనవంతు పాత్ర పోషించాలని అన్నారు.ఈ సందర్భంగా ఐఐటీ ఖరగ్‌పూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుమన్ చక్రవర్తి మాట్లాడుతూ, తమ సంస్థ పూర్వ విద్యార్థి, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అనువర్తిత కృత్రిమ మేధస్సు పరిశోధనల కోసం 50 లక్షల డాలర్ల విరాళం అందించారని వెల్లడించారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్.రవి, ముఖ్యమంత్రి సువేందు అధికారి, ఉన్నత విద్యాశాఖ మంత్రి జగన్నాథ్ చటోపాధ్యాయ తదితరులు వేడుకలకు హాజరయ్యారు. అనంతరం బీహార్‌లో నితీశ్ సేతు వంతెనను మోదీ ప్రారంభించారు.

చంద్రబాబుతో బీజేపీ నేతల భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రాధాన్యం సంతరించుకుంది. సీట్ల సర్దుబాటులో భాగంగా కడప జడ్పీని బీజేపీకి కేటాయించలేకపోయామని చంద్రబాబు ఆయనకు వివరించినట్లు సమాచారం.అంతకుముందు ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసినప్పటికీ, తన సేవలను గుర్తించకుండా జడ్పీ చైర్మన్ పదవి విషయంలో వ్యవహరించిన తీరు బాధించిందని పేర్కొన్నారు. పులివెందులలోనూ కూటమి విజయానికి పనిచేశానని తెలిపారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతిపై విచారణ చేస్తాం

హైదరాబాద్, నవంబర్ 21:

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు తెలిపారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారి నుంచి ప్రతి పైసా తిరిగి వసూలు చేస్తామని స్పష్టం చేశారు. శనివారం పలువురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, మేధావులు, విద్యావేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు బీజేపీలో చేరిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో బీజేపీ బలపడుతుండటంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌లో మెటా సంస్థ కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి ఘటనల వల్ల అంతర్జాతీయ పెట్టుబడిదారుల్లో ఆందోళన ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఒకవైపు పెట్టుబడులను ఆహ్వానిస్తూ సదస్సులు నిర్వహిస్తున్న ప్రభుత్వం, మరోవైపు బహుళజాతి సంస్థల కార్యాలయాలపై దాడులు జరుగుతుంటే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే న్యాయపరంగా పరిష్కరించుకోవాలే తప్ప దాడులకు పాల్పడటం సరికాదన్నారు.రాష్ట్ర అప్పులు దాదాపు రూ.10 లక్షల కోట్లకు చేరాయని, ప్రభుత్వ భూములను విక్రయిస్తూ పాలన సాగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు మద్దతు ధర కంటే తక్కువకు పంట విక్రయించాల్సి వస్తోందని ఆరోపించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఏఐ సదస్సు సందర్భంగా యువజన కాంగ్రెస్ చేపట్టిన నిరసన దేశ ప్రతిష్ఠను దెబ్బతీసిందని అన్నారు.బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అవినీతికి పాల్పడిన వారెవరినీ వదిలిపెట్టబోమని, సమగ్ర విచారణ ద్వారా ప్రజాధనానికి సంబంధించిన ప్రతి పైసాకు లెక్కలు తేలుస్తామని రాంచందర్‌రావు స్పష్టం చేశారు.

ఏఐ గుర్తింపు సాఫ్ట్‌వేర్‌నే ఆధారంగా శిక్షించొద్దు

- తప్పుడు ఫలితాలతో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకూడదు.. సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించాలి: సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

హైదరాబాద్,నవంబర్ 21 :

కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా రూపొందించిన రచనలను గుర్తించే సాఫ్ట్‌వేర్ ఫలితాలనే ఆధారంగా చేసుకుని విద్యార్థులను అక్రమాలకు పాల్పడినవారిగా నిర్ధారించకూడదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఏఐ గుర్తింపు సాధనాలు తప్పు ఫలితాలు ఇచ్చే అవకాశం ఉందని, వాటి కారణంగా నిజాయితీగా పనిచేసిన విద్యార్థులు నష్టపోకూడదని అన్నారు.హైదరాబాద్‌లో జరిగిన కామన్వెల్త్ న్యాయ విద్యా సంఘం అంతర్జాతీయ సదస్సు ప్రారంభ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఆంగ్లాన్ని మాతృభాషగా మాట్లాడని విద్యార్థులు రాసిన వ్యాసాల్లో 60 శాతానికి పైగా రచనలను ఏఐతో రూపొందించినవిగా కొన్ని గుర్తింపు సాధనాలు తప్పుగా పేర్కొన్న అధ్యయనాన్ని ఆయన ప్రస్తావించారు. కేవలం యంత్రం ఇచ్చిన ఫలితం ఆధారంగా విద్యార్థిపై చర్యలు తీసుకోవడం సరికాదన్నారు.ఏఐ సాధనాలను పూర్తిగా నిషేధించడం ఆచరణ సాధ్యం కాదని, వాటి వినియోగంపై స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని సూచించారు. విద్యార్థులు ఏఐ సహాయం తీసుకున్నప్పుడు ఆ విషయాన్ని వెల్లడించే విధానం ఉండాలన్నారు. రాత పరీక్షలతోపాటు మౌఖిక వివరణలు, న్యాయపరమైన ఆధారాలపై చర్చలు నిర్వహించాలని సూచించారు.

ఉపాధి హామీ పనుల్లో విషాదం.....

- గుండెపోటుతో మహిళ మృతి...!
- మృతురాలి కుటుంబానికి అండగా.....
- మాజీ వైస్ ఎంపీపీ. దొంతుమంగేశ్వరరావు...!



మన ప్రజావాణి ప్రతినిధి!!నవంబర్ 21...! ఎటపాక మండలం! ఎటపాక మండలం గన్నవరం గ్రామానికి చెందిన. పిడియాల వెంకట నర్సు (55) శనివారం ఉదయం. ఉపాధి హామీ పనులకు వెళ్లి గుండెపోటుతో మృతి చెందారు... ఆమె ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.. విషయం తెలుసుకున్న ఎటపాక మాజీ వైస్ ఎంపీపీ తెలుగుదేశం పార్టీ నాయకులు. దొంతుమంగేశ్వరరావు.. గన్నవరం లోని మృతురాలి నివాసానికి చేరుకొని ఆమె భౌతిక కా యానికి. నివాళులర్పించారు. వెంకట నర్స్. మృతిఅత్యంత బాధాకరమని. కుటుంబానికి తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు బాధిత కుటుంబానికి ?2,000 ఆర్థిక సాయం చేశారు అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు. పాల్గొన్నారు

పలాస రూరల్ వినియోగదారులకు విజ్ఞప్తి విద్యుత్

- సోమవారము ఉదయము తొమ్మిది గంటల నుంచి రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా లో అంతరాయము కలుగుతుంది.
- విద్యుత్ పనులు జరుగుతున్నందున సరఫరాకు అంతరాయం కలుగుతుంది.
- విద్యుత్ ఉన్నత అధికారి జి. విజ్జేశ్వర రావు





పలాసన్యూస్ ఈ నెల 23 సోమ వారశీ ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 02:00 గంటల వరకు 33/11 కేవీ బ్రాహ్మణతర్ల సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహించనున్న నిర్వహణ ఆర్డీఎస్ పనులు కారణంగా, ఆ సబ్‌స్టేషన్‌కు చెందిన 11 కేవీ గొప్పిలి ఫీడర్లలో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయబడుతుందనీ విద్యుత్ ఉన్నత అధికారి జి . జ్ఞానేశ్వర్ రావు తెలిపారు.దీనివలదీని వలన క్రింది గ్రామాలు/ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందినీ. గుర్తు చేశారు- బెక్కలిపట్న ము,- గోపీవల్లభపురం- పెద్దనారాయణపురం,- నీలిభద్ర - కేసుపురం,- బంటుకోత్తూరు- కేదారపురం- కంబిరిగాం- ఇదురపల్లి - గంగువాడ- చినంచల ,- కేదారిపురము,- పెదంచల ,- సవర గోవిందపురము ,- మహాదేవపురం,- పొత్రియ ,- గట్టుమీద ఊరూ, - కైజోల ,- కోటరింగి తాళభద్ర, - మరదరాజాపురం, గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగును కనుక వినియోగదారులు గమనించి, విద్యుత్ శాఖకు సహకరించాలని
జి. యజ్ఞేశ్వరరావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్)తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పలాస డివిజన్ వారు కోరారు.

బుచ్చంపేటలో రైతులకు ఎఫ్‌పీఓపై అవగాహన

- ఎఫ్‌పీఓ స భ్యత్వంతో రైతులకు అదనపు ప్రయోజనాలు -- సహకార సంఘం సీఈఓ అల్లి గౌరమ్మ



మంగపేట, నవంబర్ 21 (ప్రజావాణి):ములుగు జిల్లా మంగపేట మండలం బుచ్చంపేట గ్రామంలో రైతులకు ఎఫ్‌పీఓ (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్)పై రైతు సేవా సహకార సంఘం సీఈఓ అల్లి గౌరమ్మ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు ఎఫ్‌పీఓ సభ్యత్వాలను నమోదు చేయించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సహకార సంఘం బుచ్చంపేట డైరెక్టర్లు చిట్టిమల్ల రజిత, చిట్టిమల్ల సమ్మయ్య హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రైతులు రూ.2,000 చెల్లించి ఎఫ్‌పీఓలో సభ్యత్వం పొందితే, నాబార్డు ద్వారా అదనంగా రూ.2,000 లభిస్తుందని, దీంతో రైతు వాటా మూలధనం రూ.4,000 అవుతుందని వివరించారు.రైతులు తాము పండించిన పంటలను రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా కొనుగోలు, అమ్మకాలు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే సహకార సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై పొందవచ్చని పేర్కొన్నారు. రైతులందరూ ఎఫ్‌పీఓ సభ్యత్వం తీసుకొని అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రైతులు బూర్గుల వెంకటమల్లు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, తక్కలపల్లి రవీందర్, పల్లె లక్ష్మయ్య, నాగుల సతీష్, గడ్డం పరమేశ, ధర్మారం సాయిలు, పల్లె చిన్న రాములు, మద్దెల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: కొండగట్టు అంజన్న నిజరూప దర్శనం అదృష్టం: స్పీకర్



60 ఏళ్లకు ఒకసారి మూలవిరాట్ చందనాన్ని తొలగించే సందర్భంలో నిజరూప దర్శనం ఎంతో అదృష్టమని స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. ఈ భాగ్యం కల్పించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న కరువు నుండి బయటపడాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే శక్తిని సీఎం రేవంత్ రెడ్డికి ప్రసాదించాలని స్వామిని వేడుకున్నారు

బాధిత కుటుంబానికి రెడ్ క్రాస్ సొసైటీ జుక్కల్ శాఖ చేయూత...



మన ప్రజావాణి జుక్కల్ ఆర్ సి ప్రతినిధి నవంబర్ 21 కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని పెద్ద ఏడ్గీ తాండలో ఇటీవల ఆకస్మాత్తుగా అగ్ని ప్రమాదం జరగడంతో ఈ విషయం తెలుసుకొని ఆ కుటుంబానికి రెడ్ క్రాస్ సొసైటీ జుక్కల్ శాఖ ఆధ్వర్యంలో వంట పాత్రలు, నిత్యవసర వస్తువులు, 30 కేజీల జొన్నలు, బాధిత కుటుంబానికి జుక్కల్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఉమాకాంత్ పటేల్ ఆధ్వర్యంలో అందించడం జరిగింది... ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు దస్థిరం జ మాట్లాడుతూ..... సర్వం కోల్పోయిన నా కుటుంబానికి తన వంతు సహకారాన్ని అందించామని ఆయన అన్నారు.. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు విక్రమ్, ఆనంద్ కుమార్, గంగాధర్,షేరు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ బహిరంగ క్షేమాపణ చెప్పాలి

- మద్దూరు మండల కాంగ్రెస్ సర్పంచుల డిమాండ్



మద్దూరు నవంబర్21, ప్రజా వాణి,భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సిద్ధిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ కడవెర్గు రాజనర్సు బహిరంగ క్షేమాపణ చెప్పాలని మద్దూర్ మండల కాంగ్రెస్ సర్పంచులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిపై పరుష పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసి ఆరోపణలు ఎదుర్కొంటున్న సిద్ధిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని మద్దూర్ మండల కాంగ్రెస్ పార్టీ సర్పంచులు సుందరగిరి సత్యనారాయణ గౌడ్, ఇట్టబోయిన కనకచంద్రం డిమాండ్ చేస్తున్నారు.ప్రజాప్రతినిధుల పట్ల గౌరవంగా వ్యవహరించడం ప్రతి ఒక్కరి బాధ్యత. రాజకీయ విమర్శలు విధానాలు, ప్రజా సమస్యలకే పరిమితం కావాలి.వ్యక్తిగత దూషణలు, పరుష పదజాలం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు మెప్పు పొందాలంటే, అతని మోచేతి నీళ్లు తాగడం కోసం మా ఎంపీ గారిని తిట్టడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్య సంఘాల ముసుగులో దందా...?

- విద్యాసంస్థలపై ఒత్తిళ్లు..
- సొంత లాభాల కోసమే.. విద్యాసంఘాల పనితీరు..?
- పేరుకే సంఘాలు.. తెరవెనుక.. వసూళ్ల వ్యవహారాలా..?
- పాఠశాలల యాజ మాన్యాల బెంబేలు.. న్యాయం జరిగేదెప్పుడు...?
- ఈ వ్యవహారం వెనుక జిల్లా విద్యాశాఖ అధికారి ఉన్నారనే అను మానాలు..?

హాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి నవంబర్ 20
హక్కుల పరిరక్షణ , విద్యారంగ సమస్యల పరిష్కారం , పాఠశాలల్లో మెరుగైన విద్యా ప్రమాణాల సాధన..ఇవే లక్ష్యాలుగా ఏర్పడు తున్న కొన్ని సంఘాల పని తీరు పై ఇప్పుడు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు, విద్యా వ్యవస్థలోని లోపాలు , పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై పోరాడాల్సిన కొన్ని సంఘాలు వ్యక్తిగత ప్రయోజనాల కోసం పని చేస్తున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సంఘాల పేరుతో విద్యా సంస్థల పై ఒత్తిళ్లు తీసుకు రావడం , వివిధ కారణాలు చూపుతూ డబ్బులు డిమాండ్ చేయడం వంటి వ్యవహారాలు పాఠశాలల యాజమాన్యాలను అందోళనకు గురి చేస్తున్నాయి. దీంతో విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఏర్పడిన సంఘాలే కొత్త సమస్యలకు కారణమవు తున్నాయనే చర్చ మొదలైంది.
సంఘాల పేరుతో ఒత్తిళ్లు...!
విద్యార్థుల సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత పాఠశాల యాజమాన్యాలను ప్రశ్నించడం , తప్పులు జరిగితే అధికారుల దృష్టికి తీసుకెళ్లడం , బాధిత విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడటం సంఘాల బాధ్యత. అయితే కొందరు వ్యక్తులు సంఘాల పేర్లను అడ్డం పెట్టుకొని పాఠశాలల వద్దకు వెళ్లి వివిధ అంశాలను లేవనెత్తు తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చిన్నచిన్న విషయాలను కూడా పెద్ద సమస్యలుగా చిత్రీకరించి యాజమాన్యాల పై ఒత్తిడి తీసుకొస్తున్నారనే విమ ర్శలు విని పిస్తున్నాయి. సమస్య పరిష్కారానికి సహకరించాల్సింది పోయి,యాజమాన్యాలను ఇబ్బందులకు గురిచేసేలా వ్యవహరిస్తున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది.
సాకులు చూపి డబ్బుల డిమాండ్లు...?
పాఠశాలల్లో ఫీజులు , మౌలిక వసతులు , విద్యా ర్థుల సౌకర్యాలు , ఇతర అంశాలను ప్రస్తావిస్తూ కొందరు వ్యక్తులు యాజమాన్యాలను నిల దీస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ



అంశాల పరిష్కారం పేరుతో ఆర్థిక డిమాండ్లు చేస్తున్నారనే ఫిర్యాదులు కూడా వినిపిస్తున్నాయి. తమకు అనుకూలంగా వ్యవహరించకపోతే సమస్యలను బయట పెడతామనే రీతిలో ఒత్తిడి తీసుకొస్తున్నారనే ఆరోపణలు పాఠశాల వర్గాల్లో చర్చనీయాంశం గా మారాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి వ్యక్తులు , సంఘాల వారీగా ఆధారాలతో కూడిన విచారణ జరగాల్సిన అవసరం ఉంది.
పాఠశాల యాజ మాన్యాల పరిస్థితి ఏమిటి...?
ఒకవైపు పెరుగుతున్న నిర్వహణ ఖర్చులు , ఉపాధ్యాయుల వేత నాలు , అద్దెలు , విద్యుత్ బిల్లులు , మరోవైపు విద్యా శాఖ నిబంధనలు.. ఇలా పలు సవాళ్ల మధ్య ప్రైవేటు పాఠశాలలు కొన సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సంఘాల పేరుతో అదనపు ఒత్తిళ్లు ఎదురవుతున్నాయనే ఆరోపణలు యాజ మాన్యాలను మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఏదైనా సమస్య తలెత్తితే దాన్ని అధికారికంగా పరిష్కరించు కోవాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ , వివాదాలు పెద్దవవుతాయనే భయంతో కొందరు యజ మాన్యాలు మౌనంగా ఉంటున్నట్లు తెలుస్తోంది. తమపై ఎలాంటి ఆరోపణలు వస్తాయో , ఏ రూపంలో ఇబ్బందులు ఎదురవుతాయోననే ఆందోళన వ్యక్త మవుతోంది.
జిల్లా విద్యాశాఖ అధికారి హస్తం ఉందా...?
పాఠశాలపై తీవ్రస్థాయిలో వర్ధిల్లు తెస్తున్న నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి హస్తం ఏమైనా ఉందా..? ఉంటే అది ఎలాంటిది..? ప్రతి ప్రైవేటు పాఠశాలల నుండి ముడుపులు అందుతున్నాయా..? అందుకే జిల్లా విద్యాశాఖ అధికారి మౌనంగా ఉన్నారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇంత వ్యవహారం జరుగుతున్న విద్యాశాఖ అధికారి ఏం చేస్తున్నట్లు..? ఆయన మౌనం వెనుక ఆంతర్యం ఏమిటి..? ఎందుకు విద్య సంఘాలను ప్రశ్నించడం లేదు..? విద్యాసంఘాల తో విద్యాశాఖ అధికారి మమేకమై పాఠశాలల దోపిడీకి పాల్పడుతున్నాడా..? అనే అనుమానాలు యాదాద్రి భువనగిరి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ప్రజా సంఘాలకు సపోర్టుగా ఉంటున్నారా..అందుకే ఇలా వ్యవహరిస్తున్నారా.



ప్రశ్నార్థకంగా సంఘాల బాధ్యత...!
నిజంగా విద్యార్థుల సమస్యలపై పోరాడే సంఘాలు కూడా ఉన్నాయి. అధిక ఫీజుల వసూళ్లు , పాఠశాలల్లో కనీస సౌకర్యాల లేమి , ఉపాధ్యాయుల సమస్యలు , విద్యార్థులపై వేధింపులు వంటి అంశాల పై కొన్ని సంఘాలు నిరంతరం పోరాటాలు చేస్తున్నాయి. అయితే అలాంటి సంఘాల మధ్య కొందరు వ్యక్తుల వ్యవహార శైలి కారణంగా మొత్తం సంఘాల వ్యవస్థ పైనే విమర్శలు వస్తున్నాయి. విద్యార్థుల సంక్షేమం కోసం పనిచేయాల్సిన వారు వ్యక్తిగత ప్రయోజనాల కోసం వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు అందోళన కలిగిస్తున్నాయి. దీంతో అసలు సమస్యలపై పోరాడే సంఘాల విశ్వస నీయత కూడా దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతోంది.
అధికారులకు తెలిసే జరుగుతుందా...?
విద్యా సంస్థలపై ఒత్తిళ్లు, అక్రమ డిమాండ్లు జరుగు తున్నాయనే ఫిర్యాదులు వస్తున్నప్పుడు విద్యాశాఖ అధికారులు , పోలీసు యంత్రాంగం స్పందించాల్సిన అవసరం ఉంది. సంఘాల గుర్తింపు , వాటి కార్యకలాపాలు , పాఠశాలల వద్దకు వెళ్లి ప్రశ్నించే వ్యక్తుల అర్హత, ఫిర్యాదుల వెనుక ఉన్న వాస్తవాలను పరిశీ లించాలి. అదే సమయం లో పాఠశాల యాజమాన్యాలు కూడా విద్యార్థుల హక్కులకు భంగం కలిగించకుండా, ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. ఒకరి తప్పులను మరొకరు కప్పి పుచ్చుకునే పరిస్థితి ఉండకూడదు.
మరి న్యాయం జరిగేదెప్పుడు...?
విద్యా సంస్థలు తప్పులు చేస్తే ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. విద్యార్థు లకు అన్యాయం జరిగితే వారి తరఫున నిలబడటం బాధ్యత కూడా. కానీ ఆ హక్కును వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం , బెది రింపులకు పాల్పడటం , డబ్బులు డిమాండ్ చేయడం వంటి చర్యలకు ఎలాంటి అవకాశం ఉండ కూడదు. అలాగే సంఘాల పై ఆరోపణలు వచ్చాయని వాటి ప్రతి కార్యక్రమాన్ని తప్పు బట్టడం కూడా సరి కాదు. ఫిర్యాదు చేసిన వారెవరు..? వారి వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటి..? ఆరోపణల్లో వాస్తవం ఎంత..? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాలి.

హోంగార్డు పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్...

యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి నవంబర్ 21
తెలంగాణ పోలీస్ అపార్ట్మెంట్ లో హోం గార్డుల నియమానికి ఏర్పాట్లు జరుగు తున్నాయి , 2 వేల పోస్టులకు సంబంధించిన నోటిఫికేషన్ పై డిజిపి సీవీ ఆనంద్ , కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుత భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా పోలీస్ శాఖను తీర్చిదిద్దడం సిబ్బంది సంక్షేమం శిక్షణ నియమకాలు పోలీస్ వ్యవస్థ ఆధునీకరణ పై మినీ స్టాఫ్ అధికారులతో శుక్రవారం రోజు సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ , ఇతర వివరాల పై అధికారులు చర్చిం చారు. అయితే నోటిఫికేషన్ విడుదల తేదీ , అర్హతలు , వయో పరిమితి , దరఖాస్తుల ప్రక్రియ వంటి వివరాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అలాగే పెరుగుతు న్న అవసరాలకు అను గుణంగా పోలీస్ శాఖలో ప్రస్తుతం మంజూరైన సిబ్బంది సంఖ్యను



పునఃసమీక్షించాలని నిర్ణయించారు. మారు తున్న పరిస్థితులు , పోలీస్ శాఖ అవసరాలకు అనుగుణంగా నూతన తెలంగాణ పోలీస్ మాన్యువల్ ను రూపొందించి త్వరగా పూర్తి చేసి విడుదల చేసే అంశంపైనా చర్చించారు. పోలీసు సిబ్బంది నై పుణ్యాలను పెంపొందించేందుకు వార్షిక శిక్షణ క్యాలెండర్‌ను సిద్ధం చేయాలని నిర్ణయించారు.అలాగే పోలీస్ బ్రాస్,పైప్ బ్యాండ్లను పునరుద్ధరించే అంశాన్ని కూడా పరిశీ లించారు. వచ్చే నెలలో నిర్వహించనున్న పోలీస్ రిట్రీట్‌తో పాటు మహిళా పోలీస్ అధికారుల సదస్సు ఏర్పాట్లపై డీజీపీ సీవీ ఆనంద్ సమీక్ష చేశారు. రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ , ఆల్ ఇండియా పోలీస్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహ ణకు సంబంధించిన అంశాలను కూడా చర్చించారు. ఈ కార్య క్రమాలను విజయవంతం గా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు.

ఉప సర్పంచులు ఉత్సవ విగ్రహాలు కాదు

- సర్వసభ్య సమావేశాలకు తప్పనిసరిగా ఆహ్వానించాలి
- ఉప సర్పంచ్‌ల ఫోరం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మంతుర్తి అన్వేష్ యాదవ్

చెన్నారావుపేట నవంబర్ 21ప్రజావాణి ఉప సర్పంచులు ఉత్సవ విగ్రహాలు కాదని, గ్రామాభివృద్ధిలో వారు కీలక భాగస్వాములని ఉప్పరపల్లి ఉప సర్పంచ్, ఉప సర్పంచ్‌ల ఫోరం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మంతుర్తి అన్వేష్ యాదవ్ అన్నారు. మండలంలో కోరం లేక ప్రత్యేక సర్వసభ్య సమావేశం వాయిదా పడిన నేపథ్యంలో శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సర్పంచులతో పాటు ఉప సర్పంచులకు కూడా జాయింట్ చెక్ పవర్ ఉందని



గుర్తు చేశారు. ఆర్థిక అధికారాలలో సమాన భాగస్వామ్యం ఉన్నప్పుడు, గ్రామ పాలనలోనూ సమాన హోదా ఉండనే విషయాన్ని అధికారులు గ్రహించాలన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలపై జరిగే సర్వసభ్య, ప్రత్యేక సమావేశాలకు సర్పంచులతో పాటు ఉప సర్పంచులను కూడా ముందస్తు సమాచారంతో అధికారికంగా ఆహ్వానించాలని కోరారు. దీనివల్ల సమగ్ర చర్చ జరిగి, అభివృద్ధి పనుల్లో పారదర్శకత పెరుగుతుందన్నారు.ఉప సర్పంచుల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు నర్సంపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల ఉప సర్పంచ్‌ల ఫోరం నేతలు తక్షణమే స్పందించాలని అన్వేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ విషయంపై కలెక్టర్, ఆర్డీవో, ఎంపీడీవోలను కలిసి వినతి పత్రాలు అందజేసేందుకు అందరూ ఐక్యంగా ముందుకు రావాలని కోరారు.

కాంగ్రెస్‌లో భగ్గుమన్న అంతర్గత విభేదాలు...?

- సొంతపార్టీలోనే అసమ్మతి స్వరం.?
- రాజకీయ దుమారం రేపిన ఎమ్మెల్యే వ్యాఖ్యలు..?
- రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలతో దుమారం..?
- కాంగ్రెస్‌లో అసమ్మతి జ్వాలలు నష్ట నివారణ చర్యల కోసం రంగంలోకి సీనియర్లు..?
- క్షేత్రస్థాయిలో ప్రజా ప్రతినిధులు ఎలా మెలుగుతున్నారు..?
- ఎమ్మెల్యేల పనితీరుపై కాంగ్రెస్ సీక్రెట్ సర్వే..?



యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి నవంబర్ 21

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ప్రభుత్వ పనితీరు , పార్టీ నాయకత్వం తీరుపై సొంత పార్టీ నేతలే బహిరంగంగా విమర్శలు చేయడం చర్చ నీయాంశమైంది.

తెలంగాణ కాంగ్రెస్?లో భగ్గుమన్న విభేదాలు...

తెలంగాణ కాంగ్రెస్‌లో అసమ్మతి స్వరాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ప్రభుత్వ పని తీరు,నిధుల కేటాయింపు, అధికారుల వ్యవహారశైలి, పార్టీ నాయకత్వం తీరుపై సొంత పార్టీ నేతలే బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. పార్టీలో ఒకరిద్దరు నేతలతో మొదలైన అసంతృప్తి క్రమంగా విస్తరిస్తోంది. ముఖ్యమంత్రి పైనే నేరుగా విమర్శలు చేస్తున్న ఎమ్మెల్యేలు కొందరైతే , ప్రభుత్వ అధికారుల అవినీతిని ఎండగడు తున్నవారు మరికొందరు ఉన్నారు. ప్రభుత్వ పథకాల గురించి ఎంపీ చేసిన వ్యాఖ్యలు కూడా విమర్శలకు దారి తీస్తున్నాయి. ఇలా వరుస వివాదాలతో కాంగ్రెస్ పార్టీ ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటోందన్న వాదన పార్టీ వర్గాల్లో వ్యక్త మవుతోంది.

కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు...

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు ఇప్పటికిప్పుడు మొద లైనవి కావు. నివురు గప్పిన నిప్పులా ఉండి , అప్పుడప్పుడు భగ్గు మంటుంటాయి. కొంత కాలంగా నియోజకవర్గాల అభివృద్ధి , నిధుల విడు దల , పార్టీ పదవుల కేటాయింపు , నేతల మధ్య ఆధిపత్యపోరు లాంటి అంశాలపై నాయకుల్లో అసంతృప్తి వ్యక్తమవుతూనే ఉంది.

పలు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు , కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులో జాప్యం , పార్టీ పదవుల భర్తీపై నేతల మధ్య అసంతృప్తి బయట పడుతోంది. ముఖ్యంగా మునుగోడు అభివృద్ధి పనుల విషయంలో నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి విమర్శలు చేశారు. మరో వైపు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ , మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వర్గాల మధ్య కూడా రాజకీయ విభేదాలు కొనసాగు తున్నాయి. తాజాగా ఈ విభేదాలు మరింత తీవ్ర మయ్యాయి. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ , జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మధ్య దిల్లీలో చోటు చేసుకున్న రచ్చ ఏఐసీసీ వరకు వెళ్లింది. ఈ విషయం పై ఆరా తీసేందుకు గాంధీభవన్ రావాలని స్వయానా పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆదేశించినా ఆ ఇద్దరు నాయకులు రాలేదు. ఇదే అంశం పై ఆయన ఏఐసీసీకి నివేదిక ఇచ్చారు. ఒకవైపు పార్టీ గీత దాటి వ్యవహరిస్తూ బహిరంగంగా మాట్లాడుతున్న నేతల వివరాలను రాష్ట్ర నాయకత్వం సేకరిస్తుండగా , మరొక వైపు విమర్శలు చేసే నాయకుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

రాజకీయ దుమారం రేపిన ఎమ్మెల్యే వ్యాఖ్యలు...

పార్టీలో అంతర్గత విభేదాలు కొనసాగు తుండగానే జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్?రెడ్డి అధి కారులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు మరోసారి రాజకీయంగా దుమారం రేపాయి. తన నియోజక వర్గంలో ప్రభుత్వ అధి కారులు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుల కంటే ప్రభుత్వ అధికారులే ఎక్కువ అవినీతికి పాల్పడుతున్నారంటూ వ్యాఖ్యానించారు. ఓ వ్యక్తికి వారసత్వ ఆస్తి బదిలీకి సంబంధించి అంశంలో తాను సూచనలు చేసినా పని చేయలేదని , అదే వ్యక్తి రూ. 15 వేల లంచం ఇవ్వడంతో వెంటనే పని పూర్తిచేశారని ఎమ్మెల్యే ఆరోపించారు. కాంట్రాక్టర్ల బిల్లులు క్లియర్ చేయాలన్నా 10 నుంచి 20 శాతం వరకు కమీషన్లు అడుగుతున్నారని ఏకంగా అధికార పార్టీ ఎమ్మెల్యే మాట్లాడడం పార్టీకి , ప్రభుత్వానికి ఇరుకున పెట్టినట్లు అయ్యింది.

రాజగోపాల్? రెడ్డి వ్యాఖ్యలతో దూమరం...

మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో అసమ్మతి రాజకీయాలను మరోసారి తారాస్థాయికి తీసుకెళ్లాయి. ఈసారి ఆయన విమర్శలు ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసు కున్నాయి. మునుగోడు నియోజకవర్గంలో అభి వృద్ధి పనులకు నిధులు కేటాయించడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ అంటే కేవలం కొడంగల్ , మధిర , హుజూర్ నగర్ నియోజక వర్గాలేనా అని ప్రశ్నించారు. అదృష్టం కొద్దీ సీఎం అయ్యారని , మరో రెండేళ్లు పదవిలో ఉంటా రంటూ వ్యాఖ్యానించారు. తన నియోజకవర్గానికి నిధులు కేటాయించకపోతే మరో కురుక్షేత్రం తప్పదని హెచ్చరించారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి మూడేళ్ల పాలన పూర్తి అవుతున్న తరుణంలో సొంత పార్టీ నేతల నుంచే విమర్శలు రావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించు కుంది. ఈ అసమ్మతి స్వరాలను కాంగ్రెస్ అధిష్ఠానం ఎలా కట్టడి చేస్తుందో వేచి చూడాల్సి ఉంది.

నడికూడ మండలంలో గ్రామగ్రామాన బెల్ట్ షాపుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి

- అధిక ధరలకు మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాలి -- మహిళా సంఘాలు, యువజన నాయకుల డిమాండ్





నడికూడ: నడికూడ మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్ షాపుల మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు, మహిళా సంఘాలు, యువజన నాయకులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. గ్రామగ్రామాన అనధికారికంగా మద్యం విక్రయాలు కొనసాగుతుండటంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల్లో మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తూ ప్రజల జేబులకు చిల్లు పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కూలీలు, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు సంపాదించిన డబ్బులో అధిక భాగం మద్యానికి ఖర్చు చేస్తుండటంతో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మద్యం వ్యసనం కారణంగా అనేక కుటుంబాల్లో గొడవలు, ఆర్థిక సమస్యలు, మహిళలు, పిల్లలపై ఇబ్బందులు పెరుగుతున్నాయని మహిళా సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలపై అధికారులు సరైన పర్యవేక్షణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న బెల్ట్ షాపులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అధిక ధరలకు మద్యం విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యం, కుటుంబాల ఆర్థిక పరిస్థితులు, గ్రామాల సామాజిక వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టాలని ప్రజలు, మహిళా సంఘాలు, యువజన నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతి ఇంటా వెలుగులు నింపేందుకే 'ఇందిరమ్మ జీవిత బీమా'

- కష్టకాలంలో పేద కుటుంబాలకు రూ. 5 లక్షల కొండంత అండ
- ఖాదర్‌పేటలో పథకాన్ని ప్రారంభించిన మండల స్పెషల్ ఆఫీసర్ బాలాజీ





చెన్నారావుపేట నవంబర్ 21 ప్రజావాణి

అనుకోని ఆపద వచ్చి కుటుంబ పెద్దను కోల్పోయినప్పుడు, ఆ కుటుంబం రోడ్డున పడకుండా ఆదుకోవడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మండల స్పెషల్ ఆఫీసర్ బాలాజీ అన్నారు. ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'కార్యక్రమాన్ని శనివారం మండల కేంద్రంలోని ఖాదర్‌పేట గ్రామపంచాయతీలో ఎంపీడీవో వెంకట శివానంద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకట శివానంద్ పథకం విధివిధానాలను గ్రామస్థులకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు.ఆహార భద్రత (రేషన్) కార్డు కలిగి ఉండి, 18 నుండి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న కుటుంబంలోని ఒక వ్యక్తికి ఈ జీవిత బీమా రక్షణ లభిస్తుంది.బీమా చేయించుకున్న వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించినా లేదా సాధారణ మరణం పొందినా, వారి కుటుంబ నామినీ సభ్యులకు ప్రభుత్వం తరఫున రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందుతుంది. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకంలో భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి అబిద్ అలీ, ఎంపీఓ జగదీష్, మిషన్ భగీరథ ఏఈ రణధీర్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆర్ఐ రషీద్,పంచాయతీ కార్యదర్శి భరత్, సర్పంచ్ గూడ సంధ్య, ఉపసర్పంచ్ చాపల మధుకర్, వార్డు సభ్యులు వడ్డే లత, పెళ్లి అయిలయ్య, అరిగేల అరుణ, కేశపాక కొమ్మాలు, ఫీల్డ్ అసిస్టెంట్ నర్రా నాగరాజు, గ్రామ కారోబార్ రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భువనగిరిలో గ్రామ గ్రామాన బెల్ట్ షాపులు...

- అధిక ధరలకు మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాలి.
- అడుకట్ట వేసే అప్కారి శాఖ అండదండలు మెండు..?
- ఆప్కారి శాఖ మౌనం వెనుక ఆ ంతర్యం ఏమిటి..?
- బెల్ట్ షాపుల ముడుపుల..అధికారం పార్టీ సర్పంచుల బెదిరింపుల...?
- మహిళా సంఘాలు వినతులు కాగితాలకే పరిమితము.



యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి నవంబర్ 21

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్ షాపుల మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు , మహిళా సంఘాలు , యువజన నాయకులు సంబంధిత అధికారులను కోరుతూ పలుమార్లు వినతి పత్రాలు సమర్పించిన..చర్యలు తీసుకునే నాధుడే కరువయ్యాడని గ్రామ మహిళలు ఆరో పిస్తున్నారు. గ్రామగ్రామాన అనధికారికంగా మద్యం విక్రయాలు కొనసాగు తుండటంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల్లో మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తూ ప్రజల జేబులకు చిల్లు పెడుతున్నారని ఆరో పిస్తున్నారు. ముఖ్యంగా కూలీలు , పేద , మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు సంపాదించిన డబ్బులో అధిక భాగం మద్యానికి ఖర్చు చేస్తుండటంతో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకు పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మద్యం వ్యసనం కారణంగా అనేక కుటుంబాల్లో గొడవలు , ఆర్థిక సమస్యలు , మహి ళలు , పిల్లల పై ఇబ్బందులు పెరుగు తున్నాయని మహిళా సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాల పై అధికారులు సరైన పర్యవేక్షణ చేపట్టి , నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న బెల్ట్ షాపులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి , అధిక ధరలకు మద్యం విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని భువనగిరి మండల ప్రజలు కోరు తున్నారు. ప్రజల ఆరోగ్యం , కుటుంబాల ఆర్థిక పరిస్థితులు , గ్రామాల సామాజిక వాతా వరణాన్ని దృష్టిలో ఉంచు కొని అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టాలని ప్రజలు , మహిళా సంఘాలు, యువజన నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వేసంగి వరి సాగుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

- నీళ్లు, కరెంటు ఇవ్వలేకపోతే ఎకరాకు రూ.30 వేల పరిహారం చెల్లించాలి
- రైతులను గందరగోళంలోకి నెట్టొద్దు.. ప్రభుత్వానికి సీపీఐ హెచ్చరిక



గరిడేపల్లి, నవంబర్ 21 (ప్రజావాణి):వేసంగి వరి సాగు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం 535 అడుగుల నీరు ఉన్న నేపథ్యంలో సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలోని రైతుల పంటలను కాపాడేందుకు వెంటనే నీటిని విడుదల చేయాలని కోరింది. సాగుకు నీరు అందించలేని పరిస్థితి ఉంటే కనీసం రోజుకు 12 గంటలైనా వ్యవసాయ విద్యుత్ సరఫరా చేయాలని, అదీ సాధ్యం కాకపోతే ముందుగానే క్రాప్ హాలిడే ప్రకటించి రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీపీఐ గరిడేపల్లి మండల సమితి ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్ స్రవంతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పోకల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకోవడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని విమర్శించారు. వేసంగి వరి సాగుపై ఇంతవరకు స్పష్టమైన విధానం ప్రకటించకపోవడంతో సాగర్ ఆయకట్టు రైతులు అయోమయానికి గురవుతున్నారని అన్నారు.

నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో వరి తప్ప ఇతర ఆరుతడి పంటలు సాగు చేయడం సాధ్యం కాని పరిస్థితులు ఉన్నాయని, దీంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో వరి సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే పలుచోట్ల రైతులు ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారని, సాగు చేసిన పంటలను మధ్యలో వదిలేయలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెడుతున్న సమయంలో నీటి విడుదలపై ప్రభుత్వం తాత్సారం చేయడం ఆందోళనకరమన్నారు.

సాగర్ ప్రాజెక్టులో 535 అడుగుల నీటి నిల్వ ఉన్నందున ఎడమ కాలువకు వారబందీ పద్ధతిలోనైనా నీటిని విడుదల చేస్తామని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 24 గంటల వ్యవసాయ విద్యుత్ హామీని అమలు చేయలేకపోయినా కనీసం రోజుకు 12 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించాలని కోరారు.

రైతుకు వ్యవసాయం లేకపోతే కుటుంబానికి జీవనాధారం ఉండదు. వ్యవసాయమే లక్షలాది రైతు కుటుంబాల జీవనోపాధి అని, సాగు నిలిచిపోతే రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వెంకటేశ్వర్లు అన్నారు. నీరు, విద్యుత్ అందించలేని పరిస్థితి ఉంటే చివరి నిమిషంలో రైతులను నష్టాల్లోకి నెట్టకుండా ముందుగానే క్రాప్ హాలిడే ప్రకటించాలని సూచించారు. పంట సాగు చేయకుండా ఉండాలని కోరుతున్న ప్రభుత్వం, రైతుల కుటుంబాల జీవనభృతికి ఎకరాకు కనీసం రూ.30 వేల పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, సాగర్ ఆయకట్టు రైతులకు నీటి విడుదల, వ్యవసాయ విద్యుత్, ప్రత్యామ్నాయ ఆర్థిక సహాయంపై స్పష్టమైన ప్రకటన చేయాలని సీపీఐ నాయకులు కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి త్రిపురం సుధాకర్ రెడ్డి, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు కుందూరు వెంకటరెడ్డి, యడ్ల అంజిరెడ్డి, పంగ గోవిందు, ప్రతాని సైదులు, జొన్నలగడ్డ తిరుపయ్య తదితరులు పాల్గొన్నారు.

మైత్రి ఆటో యూనియన్ అధ్యక్షుని సన్మానించిన ఆటో డ్రైవర్ లు.



మన ప్రజావాణి. మంథని ప్రతినిధి. మంథనిలోని మైత్రి ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎండి ఎజాదు ను ఆటో డ్రైవర్లు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు గాజులపల్లి అడ్డ(మంథని) ఆటోలకుపార్కింగ్ లేకపోవడం వలన ఇక్కడ ఐదు అడ్డాలు కలిసిన డ్రైవర్లు మాకు పార్కింగ్ ప్లేస్ కావాలని ఎజాదును అడగగా అప్పుడు ఎజాదు మాజీ మున్సిపల్ చైర్మన్ గా ఉన్న పెండ్రు రమాదేవిని ఆటోలకు పార్కింగ్ కోసం మాట్లాడగా వెంటనే స్పందించి అక్కడున్న చెట్లను చెత్తను తీసివేయించి ఆటో పార్కింగ్ ను చేయడం జరిగింది దానికి ఈరోజు ఎజాదును ఆటో డ్రైవర్లు అందరూ సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో తాటి వెంకటేష్ గౌడ్ గడ్డం రాజేశం నల్లాలనందం మంథని సదానందం తదితరులు డ్రైవర్లు పాల్గొన్నారు

పద్మశాలీలను విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



సిద్ధిపేట ప్రతినిధి, నవంబర్ 21 (ప్రజావాణి) పద్మశాలీలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోందని దుబ్బాక చేనేత సహకార సంఘం అధ్యక్షుడు అంకం మధు ,మిరుదొడ్డి పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ మండిపడ్డారు. శనివారం మిరు దొడ్డి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అర్హులైన చేనేత కార్మికులకు పెన్షన్లు ఊసే లేదని విమర్శించారు. చేనేత కార్మికులకు పెన్షన్లు అందించడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా చేనేత కార్మికులకు పూర్తిస్థాయిలో అన్యాయం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో మారు క్షేత్రస్థాయిలో అర్హులైన చేనేత కార్మికులను గుర్తించి పింఛన్లు అందజేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుబ్బాక చేనేత సహకార సంఘం కోశాధికారి చరణ్, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు పుట్ట, ప్రధాన కార్యదర్శులు గడ్డం ఆంజనేయులు సుతారి ఆంజనేయులు, ఉపాధ్యక్షులు సుతారి రమేష్, ముఖ్య సలహాదారులు గడ్డం విట్టల్, న్యా లపల్లి చంద్ర మౌళి, గడ్డం మధు, ఆడెపు కుమార్, రాజేశం, నర్సింలు, లక్ష్మీనారాయణ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

5వ వార్డులో ఇందిరమ్మ కుటుంబ భరోసా పథకంపై ప్రత్యేక క్యాంపు

- అర్హులైన లబ్ధిదారులు ఆన్‌లైన్ నమోదు చేసుకొని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి



మంథని నియోజకవర్గ ప్రతినిధి, నవంబర్ 21, ప్రజావాణి: మంథని మున్సిపాలిటీ పరిధిలోని కూచిరాజ్‌పల్లి 5వ వార్డులో శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా భరోసా పథకానికి సంబంధించి ప్రత్యేక క్యాంపు నిర్వహించారు.స్థానిక కౌన్సిలర్ మరియు మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ ముస్కుల సహేందర్ రెడ్డి అధికారులతో కలిసి క్యాంపులో పాల్గొని, పథకానికి అర్హులైన లబ్ధిదారుల వివరాలను పరిశీలించి ఆన్‌లైన్ నమోదు చేయించారు.ఈ సందర్భంగా వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ భరోసా పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో మంథని పట్టణములో అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు అవుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్పీ లక్ష్మీదేవి, స్థానిక నాయకులు జానీ, పద్మ తదితరులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● పిఎసిఎస్ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్



చెన్నారావుపేట నవంబర్ 21 ప్రజావాణి రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని చెన్నారావుపేట పిఎసిఎస్ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్ అన్నారు.శనివారం మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో, అలాగే అక్కల్ చెడ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు సబ్ సెంటర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం క్వింటాల్ ధాన్యానికి రూ.2,460/-మద్దతు ధరను కేటాయించి కొనుగోలు చేస్తోందని, దీనికి అదనంగా రూ. 500/-బోనస్ కూడా అందిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్, ఉప సర్పంచులు కక్కెర్ల రజిత శ్రీను, దొంతి శ్రీను, ఏవో గోపాల్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ కోరే కుమార స్వామి, సిఈవో చిట్టే రవి, సొసైటీ డైరెక్టర్లు ఆవుల రాములు, వట్టే స్వరూప తిరుపతి రెడ్డి, జున్నుతుల మహేందర్ రెడ్డి, బూస నర్సింహారావు, కందిక విజయ,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు పులిశేరు రాజేందర్, మాజీ సర్పంచ్ తూటి పావని రమేష్, మాజీ ఉప సర్పంచ్ బానోత్ వీరన్న నాయక్, నాయకులు బాధవత్ వీరు నాయక్, భూక్య రాజేందర్, పూల్ సింగ్, వార్డు సభ్యులు పద్మబీమా, తేజవత్ శివ, రాంచంద్రు, మల్లు బద్రు, సొసైటీ సిబ్బంది కట్టరెడ్డి శ్రీను, రమేష్, సలీం, ప్రదీప్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ మహిళా సాధికారతలో లక్పతి దీదీ పథకం కీలకం





రాయికల్ :నవంబర్ 21(ప్రజావాణి)గ్రామీణ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి సాధికారత వైపు నడిపించడంలో లక్పతి దీదీ పథకం కీలక పాత్ర పోషించనుందని జగిత్యాల జిల్లా శిక్షకులు మహమ్మద్ హుస్సేన్, పి. అశోక్ లు పేర్కొన్నారు. రాయికల్ మండల కేంద్రంలోని పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో కొత్తగా వచ్చిన సంఖ్యా ఆజీవిక నమోదు పుస్తకంపై నవంబర్ 20, 21 తేదీల్లో వివోఏ లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో శిక్షకులు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోని మహిళా సమాఖ్య స్వయం సహాయక సంఘ సభ్యులను సంవత్సర కాలంలో కనీసం లక్ష రూపాయలకు మించి ఆదాయం పొందే లబ్ధిదారులుగా తీర్చిదిద్దడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామీణ మహిళలు కేవలం సంఘ సభ్యులుగానే కాకుండా సొంత ఆదాయంతో నిలబడే సాధికార మహిళలుగా ఎదగాలన్నదే దీని వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యమన్నారు.దీని కోసం మహిళలకు వివిధ ఆదాయాభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎనిమిది సమూహాల్లో వారి మొత్తం ఆదాయ వివరాలను సేకరించి, ప్రతి సమూహానికి ఎంత ఆదాయం వచ్చిందో అంతర్జాల సంఖ్యా ఆజీవిక నమోదు పుస్తకంలో నమోదు చేయనున్నారు.ఇలా నిరంతర పర్యవేక్షణ చేయడం వల్ల ఏ మహిళ ఎంత సంపాదిస్తోంది, ఎవరికి ఇంకా సహాయం అవసరం అనేది స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. గ్రామీణ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి కుటుంబాన్ని, గ్రామాన్ని ముందుకు నడిపించే శక్తిగా మారడానికి ఈ పథకం బలమైన పునాది వేయనుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వయం సహాయక సంఘాల మహిళల అభివృద్ధికై నిరంతరం కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపిఎం పోతు నరహరి, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, 40 వివోఏలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● అర్హులైన ప్రతి ఒక్కరూ బీమా నమోదు చేసుకోవాలి -- కాంగ్రెస్ మండల కోశాధికారి ఆర్వం పరమయ్య



ఆత్మకూరు: అర్హులైన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల కోశాధికారి ఆర్వం పరమయ్య పిలుపునిచ్చారు. ఆత్మకూరు మండలంలోని నీరుకుళ్ల గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సర్పంచ్ తడక నీరజ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆర్వం పరమయ్య మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామానికి చెందిన అర్హులైన ప్రజలు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. కుటుంబంలో అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు బాధిత కుటుంబానికి రూ.5 లక్షల బీమా పరిహారం అందించడం ద్వారా ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.గ్రామంలోని ప్రతి కుటుంబం గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా బీమా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకొని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అన్నదాత కుమారస్వామి, ఉడుత శ్రీనివాస్, పసుల లక్ష్మీనారాయణ, పావుశెట్టి శివకుమార్, ఉప్పునూతల కోటి తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం, నిత్యావసరాలు పంపించిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు.



ఏటూరునాగారం నవంబర్ 21,ప్రజావాణి:. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని 13వ వార్డుకు చెందిన పలక లక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఈ విషయాన్ని 13వ వార్డు సభ్యులు ఆవుల అక్షయ లక్ష్మీనారాయణ ద్వారా తెలుసుకున్న ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మృతురాలి కుటుంబానికి అండగా నిలిచారు. ఆయన ఆదేశాల మేరకు, మృతురాలి దశదిన కర్మ కార్యక్రమాల నిమిత్తం బియ్యం బస్తాలు, వంట నూనె వంటి నిత్యావసర సరుకులను పంపించడం జరిగింది.లక్ష్మణ్ బాబు పంపించిన సహాయాన్ని నిత్యావసర సరుకులను 13వ వార్డు సభ్యులు ఆవుల అక్షయ లక్ష్మీనారాయణ తో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి మృతురాలి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం పలక లక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కష్టకాలంలో బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో 13వ వార్డు సభ్యులు ఆవుల అక్షయ లక్ష్మీనారాయణ ,స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తాడూరి రఘు, తూరం పద్మ, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, జగన్నాధ నాగ సాగర్, ఏంపెల్లి రాజు, కొండాయి చిన్ని, బాలకృష్ణ, కిరణ్, బట్టు గోపి, నాగరాజు, చిప్ప నాగరాజు, రామకృష్ణ, గండేపల్లి నాగరాజు,కార్యకర్తలు మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

చిన్నారుల మేధస్సుకు చెకుముకి పరీక్ష

● చెన్నారావుపేటలో కన్నులపండువగా సైన్స్ సంబరాలు
● ప్రశ్నించే తత్వంతోనే భావి శాస్త్రవేత్తల ఆవిర్భావం: మోతే ఇంద్రసేనారెడ్డి





చెన్నారావుపేట నవంబర్ 21ప్రజావాణి తరగతి గదులకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లోని సృజనాత్మకతను, ప్రశ్నించే తత్వాన్ని వెలికితీసినప్పుడే భావి శాస్త్రవేత్తలు తయారవుతారని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షులు మోతే ఇంద్రసేనారెడ్డి అన్నారు. జేవీవీ జిల్లా కమిటీ పిలుపు మేరకు, చెన్నారావుపేట మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి 'చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్' విజ్ఞాన పండుగను తలపించింది.మండలంలోని ప్రభుత్వ, గురుకుల, ప్రైవేటు ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ మేధోమథనంలో ఉత్సాహంగా తలపడ్డారు. శాస్త్ర, సాంకేతిక అంశాలపై తమకున్న పట్టును ప్రదర్శిస్తూ పరీక్ష రాశారు. మూడు విభాగాల్లో ప్రతిభ చాటి అగ్రస్థానంలో నిలిచిన జట్లు ఈ నెల 28న జరగనున్న జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించాయి.జిల్లా పోరుకు లింగాపురం ఉన్నత పాఠశాల (బి.రిషి, టి.శ్రేష్ట, ఆర్.వరుణ్). దుగ్గొండి సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల (ఎస్.వర్ష, వి.హర్షితశ్రీ, టి.నిత్య),సిద్ధార్థ హైస్కూల్ (పి.శశాంక్, కె.నైనిక, పి.సంజన)లు సిద్ధమైనారు.ఈ సందర్భంగా విజేతలకు, పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ అతిథులు ప్రశంసాపత్రాలతో పాటు విజ్ఞానదాయకమైన సైన్స్ పుస్తకాలను బహుమతులుగా అందజేసి అభినందించారు. కార్యక్రమ నిర్వహణకు పూర్తి సహకారం అందించిన మండల విద్యాశాఖ అధికారులకు జేవీవీ జిల్లా శాఖ కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో జేవీవీ మండల కన్వీనర్ కన్యధార అనిల్ కుమార్, సిద్ధార్థ పాఠశాల డైరెక్టర్ మాధవరెడ్డి, ప్రిన్సిపాల్ అండే కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు వి.కిషోర్, ఇంద్ర కరుణాకర్ రెడ్డి, రజిని, రాజ్యలక్ష్మి, రామకృష్ణ, గణేష్, శ్రీనివాస్, నర్సింహారాములు, సీఆర్పీలు సంపత్, బాలు, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● అక్కల్‌చెడలో అవగాహన సదస్సు;సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం





చెన్నారావుపేట నవంబర్ 21 ప్రజావాణి ఆపద వేళ పేద కుటుంబాలకు 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకం కొండంత అండగా నిలుస్తుందని మండల ప్రత్యేక అధికారి బాలాజీ, ఎంపీడీవో సాయి శివానంద్, తహసీల్దార్ అభిద్ అలీ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. మండలంలోని అక్కల్‌చెడ గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచి భూక్య బుజ్జి సురేష్ అధ్యక్షతన శనివారం ఇందిరమ్మ జీవిత బీమాపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పథకం వివరాలను గ్రామస్థులకు విశదీకరించారు. "రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ఈ బీమా రక్షణ కల్పిస్తోంది. కుటుంబ సభ్యుల అంగీకారంతో 18 నుంచి 59 ఏళ్ల లోపు ఉన్న ఇంటి పెద్ద లేదా సంపాదించే వ్యక్తిని లబ్ధిదారునిగా నమోదు చేసుకోవచ్చు. దురదృష్టవశాత్తు లబ్ధిదారుడు ప్రమాదవశాత్తు గానీ, సాధారణ మరణం గానీ పొందితే ఆ కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించి ఆదుకుంటుంది,అని వివరించారు.పేదలకు భరోసానిచ్చే పథకాన్ని అమలు చేస్తున్నందు కు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్,కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్న రైతులకే బీమా పరిమితమై ఉండేదని, నేడు రేషన్ కార్డున్న ప్రతి నిరుపేద కుటుంబానికి బీమా వర్తింపజేయడం చరిత్రాత్మక నిర్ణయమని సర్పంచ్ బుజ్జి సురేష్, రాజేందర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో జగదీశ్, ఆర్ఐ రషీద్, పశువైద్యాధికారి జునేజ్, పంచాయతీ కార్యదర్శి వీరన్న, జీపీవో నర్సింహా స్వామి, ఉప సర్పంచి కక్కెర్ల రజిత శ్రీను, మాజీ సర్పంచి తూటి పావని రమేష్, నాయకులు లావుడ్యా వెంకన్న, చిలుక రామక్క, షేక్ కయాజ్, వివో అధ్యక్షురాలు సరస్వతి, వార్డు సభ్యులు ఒంటరి రాజు, తూటి రాణి, చిన్న శ్రీను, ఇస్లావత్ స్వరూప, బాధవత్ సురేష్, కోరే మల్లయ్య, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో సవాళ్లను అధిగమించేలా ఆయిల్‌పామ్ తోటల యాజమాన్యం చేపట్టాలి

■ ముత్తారం గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం
■ ఎల్‌నినో పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ సాగులో నీటి, పోషక యాజమాన్యం అత్యంత కీలకం
■ జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి గడ్డం శ్యాంప్రసాద్





మంథని నియోజకవర్గ ప్రతినిధి, నవంబర్ 21, ప్రజావాణి:పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ముత్తారం గ్రామంలో ఎలినినో ప్రభావం ఆయిల్ ఫామ్ సాగు పై పంటల మార్పిడి పై రైతులకు అవగాహన శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది
ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి గడ్డం శ్యాంప్రసాద్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆయిల్‌పామ్ సాగు ప్రాధాన్యతను వివరించారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ తోటల్లో సమర్థవంతమైన నీటి యాజమాన్యం, సమతుల్య పోషకాల వినియోగం ద్వారా పుష్పాల అభివృద్ధి, గెలల ఏర్పాటు, అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.అలాగే ఆయిల్‌పామ్ సాగులో రైతులకు అవసరమైన స్లాషర్లు, స్ప్రెడర్లు, మినీ ట్రాక్టర్లు వంటి వ్యవసాయ యంత్ర పరికరాలతో పాటు బిందు సేద్య పరికరాలపై ఉద్యానవన శాఖ ద్వారా రాయితీలు అందిస్తున్నట్లు వివరించారు.ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కోకో సాగు చేపట్టడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని, కోకో సాగుకు కూడా ఉద్యానవన శాఖ ద్వారా రాయితీ సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
కృషి విజ్ఞాన కేంద్రం రామగిరి ఖిల్లా సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకట రమేష్ మాట్లాడుతూ వాతావరణానికి అనుకూలంగా పంట మార్పిడి చేయాలని ఒకే రకం పంట కాకుండా విభిన్నమైన పంటలు పండించాలని రసాయన ఎరువుల వాడకం తగ్గించి భూసారాన్ని పెంపొందించాలని మరియు చీడ , పీడలూ రైతులు కృషి చేయాలని తెలియజేశారు.ఉద్యాన శాస్త్రవేత్త డాక్టరు భాస్కరరావు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగులో ఎరువుల యాజమాన్యం, సమతుల్య పోషకాల వినియోగం, మొక్కల ఆరోగ్యకరమైన పెరుగుదల, అధిక దిగుబడుల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు సాంకేతిక అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో రామగుండం ఉద్యానవన అధికారి జ్యోతి, ఉద్యానవన విస్తరణ అధికారి రాజశేఖర్, వ్యవసాయ శాఖ అధికారి అనూష, విస్తరణ అధికారి మనీషా ఆయిల్‌పామ్ క్షేత్రస్థాయి సిబ్బంది, ముత్తారం గ్రామ సర్పంచ్ రవీంద్రరావు,పీసీసీస్ చైర్మన్ రాజిరెడ్డి, జగన్ మోహన్ రావు రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలి

● ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో





ఏటూరునాగారం, నవంబర్ 21, ప్రజావాణి:రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు సజావుగా విక్రయించుకునేలా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం రొయ్యూరు గ్రామంలోని గిరిజన సహకార సంస్థ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అక్కడ చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
ఈ సందర్భంగా కొనుగోలుకు తీసుకొచ్చిన ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించి, నిబంధనల ప్రకారం తేమ శాతం తగ్గిన అనంతరం ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం ఆరబెట్టేందుకు సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైనన్ని టార్పాలిన్లు ముందుగానే సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.ధాన్యంలో తేమ శాతం తగ్గిన వెంటనే ప్యాకింగ్ ప్రక్రియ చేపట్టేందుకు తగినన్ని గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచాలని, ప్యాక్ చేసిన ధాన్యాన్ని కేటాయించిన మిల్లులకు సకాలంలో తరలించేలా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని పీఓ సూచించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వ, ఆరబెట్టడం, ప్యాకింగ్, రవాణా ప్రక్రియల్లో ఎలాంటి జాప్యం జరగకుండా సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.
రైతులతో ముఖాముఖి.. ప్రభుత్వ మద్దతు ధరపై అవగాహన:
అనంతరం కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులతో పీఓ మాట్లాడి వారి పంట సాగు వివరాలు, పంటల సరళి, ఎకరాకు వచ్చిన దిగుబడి పరిమాణం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం మద్దతు ధర, అదనపు బోనస్ మొత్తానికి సంబంధించిన వివరాలను రైతులకు వివరించి అవగాహన కల్పించారు.రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకునే సమయంలో అవసరమైన సహకారం అందించాలని, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని పీఓ సూచించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్యాకింగ్ సామగ్రి, రవాణా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని, రైతులకు సకాలంలో సేవలు అందేలా సంబంధిత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ఆదేశించారు.

పొగమంచులో వేగం వద్దు.. ప్రాణాలే ముఖ్యం!

● వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి.. వేగం తగ్గించి సురక్షితంగా ప్రయాణించాలి: ఎస్పై సోమేశ్వరి.

కొండాపూర్, నవంబర్ 21 (ప్రజావాణి): శీతాకాలం ప్రారంభం కావడంతో ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుంటోంది. దీంతో రహదారులపై ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని కొండాపూర్ ఎస్పై సోమేశ్వరి సూచించారు. పొగమంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు, ముందున్న వాహనాలు సరిగా కనిపించక రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో వాహనదారులు నిర్లక్ష్యాన్ని వీడి, తగిన జాగ్రత్తలు పాటించాలని ఓ ప్రకటనలో కోరారు.

ముఖ్యంగా ఉదయం వేళల్లో ప్రయాణించే వారు వాహనాల హెడ్‌లైట్లు, పార్కింగ్ లైట్లు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. పొగమంచు తీవ్రతను బట్టి వేగాన్ని తగ్గించుకోవాలని, ముందు వెళ్తున్న వాహనానికి తగిన దూరం



పాటించాలని తెలిపారు. అనవసర ఓవర్‌టేకింగ్, అతివేగానికి దూరంగా ఉండాలని, అవసరమైనప్పుడు మాత్రమే హారన్ వినియోగించాలని పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు, ఇతర వాహనాల డ్రైవర్లు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ప్రయాణానికి ముందు వాహనాల బ్రేకులు, లైట్లు సక్రమంగా పనిచేస్తున్నాయో తనిఖీ చేసుకోవాలన్నారు. పొగమంచు మరీ ఎక్కువగా ఉన్నప్పుడు ప్రయాణాన్ని కొనసాగించకుండా సురక్షితమైన ప్రదేశంలో వాహనాన్ని నిలిపి, పరిస్థితులు అనుకూలించిన తర్వాత ముందుకు వెళ్లాలని సూచించారు.

ప్రయాణం కంటే ప్రాణం విలువైనది: గమ్యస్థానానికి కొన్ని నిమిషాలు ఆలస్యంగా చేరుకున్నా ఫర్వాలేదు కానీ, వేగంగా వెళ్లి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని ఎస్పై సోమేశ్వరి హితవు పలికారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాల భద్రతకు కూడా బాధ్యత వహించాలని కోరారు.పొగమంచులో వేగం కాదు.. జాగ్రత్తే ముఖ్యం. క్షేమంగా బయలుదేరి.. క్షేమంగా ఇంటికి చేరుకోవడమే ప్రతి ప్రయాణికుడి లక్ష్యం కావాలి అని ఎస్పై సూచించారు.

విద్యార్థుల హాజరు శాతం పెరగాలి

- టీచర్లు నిత్యం పర్యవేక్షణ చేయాలి.
- విద్యార్థులను విద్యాలయాలకు వచ్చేలా ప్రోత్సహించాలి.
- విద్యాలయాల్లో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి.
- పేరెంట్ టీచర్ మీటింగ్‌లు క్రమం తప్పకుండా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల,ప్రజావాణి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా ఉపాధ్యాయులు, విద్యాధికారులు నిత్యం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలలకు హాజరయ్యేలా ప్రోత్సహించాలని, బడికి రాకపోవడానికి గల కారణాలను తెలుసుకుని వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.ఎఫ్ఆర్ఎస్, ఎఫ్ఎల్ఎన్, ఆన్లైన్ తరగతులు, పాఠశాలల్లో అభివృద్ధి పనులు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో విద్యాశాఖ, పంచాయతీ రాజ్ శాఖ, టీజీఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

పనులకు అనుగుణంగా కూలీల సంఖ్య పెంచాలి

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాలయం నిర్మాణ



పనుల్లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పనులకు అనుగుణంగా కూలీల సంఖ్యను పెంచి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని తెలిపారు. నాబార్డ్ నిధులతో విద్యాలయాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎం ఉష పథకం కింద గంభీరావుపేట, అగ్రహారం ప్రాంతాల్లో చేపట్టిన నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

ఆన్లైన్ తరగతులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలిలి

ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ ఆన్లైన్ తరగతులను అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆన్లైన్ తరగతులకు విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాలని, రోజువారీ, వారంవారీ పరీక్షల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం అందిస్తున్న ఆన్లైన్ తరగతులు పోటీ పరీక్షల సన్నద్ధతకు ఎంతో ఉపయోగపడతాయని, వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

పేరెంట్ టీచర్ మీటింగ్‌లు క్రమం తప్పకుండా నిర్వహించాలి

అన్ని విద్యాలయాల్లో పేరెంట్ టీచర్ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశాలకు హాజరయ్యేలా విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు సమాచారం అందించాలని, విద్యార్థుల చదువు, హాజరు, అభ్యాసన సామర్థ్యాలపై తల్లిదండ్రులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు మెరుగుపర్చాలి

విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు చదవడం, రాయడం, గణితం తదితర పాఠ్యాంశాల్లో నైపుణ్యం సాధించేలా బోధన చేపట్టాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులను రానున్న వార్షిక పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేయాలని, గత ప్రశ్నాపత్రాలను సాధన చేయిస్తూ అన్ని పాఠ్యాంశాల్లో చదవడం, రాయడం వచ్చేలా శిక్షణ ఇవ్వాలని తెలిపారు.అన్ని విద్యాలయాల బాధ్యులు పకడ్బందీ ప్రణాళికతో విద్యా కార్యక్రమాలను అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా విద్యాధికారి అన్ని అంశాలపై తరచూ సమీక్షలు నిర్వహిస్తూ పురోగతిని పరిశీలించాలని, మండల, జిల్లా స్థాయి విద్యాధికారులు తమ పరిధిలోని పాఠశాలలను క్రమం తప్పకుండా తనిఖీ చేసి విద్యా ప్రమాణాల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి విజయసాగర్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, వివిధ మండలాల విద్యాధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏటూర్ నాగారం మండల కేంద్రంలో జెండా ఎగరవేసిన ముదిరాజ్ మహాసభ మలుగు నియోజకవర్గ ఇన్చార్జి చిటమట రఘు

ప్రపంచ మత్స్య కార్మికుల దినోత్సవం మరియు తెలంగాణ ముదిరాజ్ మహాసభ 12వ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా ఏటూర్ నాగారం మండల కేంద్రంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ ములుగు నియోజకవర్గ ఇన్చార్జి చిటమట రఘు ముదిరాజ్ జెండా ఆవిష్కరించడం జరిగినది.

ఏటూరునాగారం నవంబర్ 21,ప్రజావాణి:1. కాంగ్రెస్ ప్రభుత్వము మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ కి బదులుగా సొసైటీలకే డబ్బులను బదిలీ చేసి నాణ్యమైన చేప పిల్లలను ఖరీదు చేసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు అదేవిధంగా గత ప్రభుత్వంలో నాణ్యమైన చేప పిల్ల పంపిణీ చేయకపోవడంతో చేపలు పెరగక మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి జరగలేదని అన్నారు
2. ముదిరాజులను బిసి-డి నుండి "ఏ"లోకి పునరుద్ధరణ చేయాలని అన్నారు.
3. మత్స్యకారులందరికీ 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు



4. మత్స్యకారుల అభివృద్ధి కోసం మత్స్యకారుల పిల్లల చదువుల కోసం ప్రత్యేక బడ్జెట్ను ఏర్పాటు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు
5. ప్రతి గ్రామంలో పెద్దమ్మ తల్లి దేవాలయాలకు ముదిరాజ్ కమ్యూనిటీ హాళ్ళకు నిధులను కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇట్టి కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు నకిర బోయిన రమేష్ ముదిరాజ్. చింతకింది రాజు ముదిరాజ్. బాస



పుల్లయ్య ముదిరాజ్, బాసరవి ముదిరాజ్,
గాడి చెర్ల సత్యం ముదిరాజ్ గాడిచర్ల సాంబయ్య బండి శ్రీనివాస్ ముదిరాజ్, భాష జగ్గయ్య ముదిరాజ్, భాష శేఖర్ ముదిరాజ్, ముదిరాజ్, గీ కురు సాంబమూర్తి ముదిరాజ్, గీకురూ అనిల్ ముదిరాజ్, గేకురు లింగయ్య ముదిరాజ్ గీకూరు లక్ష్మీనారాయణ ముదిరాజ్, నీరటి విజేందర్ ముదిరాజ్, నకిరా బోయిన రాజ్ కుమార్, ఎద్దు సత్యం ముదిరాజ్, ఎద్దు జగదీష్ నాగుల బాలకృష్ణ, ముదిరాజ్, కంకణాల రఘు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసైతే భవిష్యత్తు అంధకారమే!

- డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి.. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- విద్యార్థులకు న్యాయవాదులు ఎస్. రాజేశ్, బి. రమేశ్ సూచన

నంగునూరు, నవంబరు 21: విద్యార్థుల బంగారు భవిష్యత్తును మత్తు పదార్థాలు ఛిద్రం చేస్తాయని, చిన్న వయసులోనే చెడు వ్యసనాలకు బానిసైతే జీవితమే అంధకారంలో పడుతుందని న్యాయవాదులు ఎస్. రాజేశ్, బి. రమేశ్ హెచ్చరించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు.తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, సిద్దిపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జి. సుదర్శన్ ఆదేశాల మేరకు బుధవారం నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామిగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, బాలల హక్కులు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం యువత జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోందన్నారు. సరదాగా ప్రారంభమయ్యే అలవాటు క్రమంగా వ్యసనంగా మారి విద్య, ఆరోగ్యం, కుటుంబ జీవనాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. మత్తు పదార్థాల విక్రయం,



వినియోగం, అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. ఇలాంటి వ్యవహారాలు తెలిసినప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

బాలల హక్కులపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని, బాలలపై జరిగే వేధింపులు, అన్యాయాలను మౌనంగా భరించకూడదని తెలిపారు. సమస్యలు ఎదురైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అదేవిధంగా పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులు పంపే సందేశాలు, అనుమానాస్పద లింకులను తెరవకూడదని హెచ్చరించారు. వ్యక్తిగత వివరాలు, రహస్య సంకేతాలు, బ్యాంకు ఖాతాల సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. చట్టాలపై అవగాహన హక్కులకు రక్షణ కల్పిస్తుందని, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుపై ఏకాగ్రత పెట్టి, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామిగౌడ్, ఉపాధ్యాయులు దుబ్బుడు రవీందర్‌రెడ్డి, కొత్తపల్లి రవి, కోర్టు సిబ్బంది ఆకుల శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత హక్కుల పోరాట సమితి 20వ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయండి

● దళితుల హక్కుల సాధనకు సమిష్టిగా పోరాడాలి.. బోనగిరి రూపేష్



బెజ్జంకి, నవంబర్ 21 (ప్రజావాణి)దళితులు, అట్టడుగు వర్గాల హక్కుల సాధన కోసం దళిత హక్కుల పోరాట సమితి (DHPS) గత 20 సంవత్సరాలుగా అనేక పోరాటాలు నిర్వహిస్తూ సామాజిక చైతన్యం కల్పిస్తోందని దళిత హక్కుల పోరాట సమితి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బోనగిరి రూపేష్ అన్నారు. దళితులపై కొనసాగుతున్న సామాజిక వివక్ష, అంటరానితనం, కుల ఆధిపత్యం, ఆర్థిక దోపిడీ, పేదరికం, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి సమితి నిరంతరం కృషి చేస్తోందన్నారు.హైదరాబాద్‌లో నిర్వహించనున్న DHPS 20వ వార్షికోత్సవ కార్యక్రమానికి దళితులు, ప్రజాస్వామికవాదులు, కార్మికులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు అందించాలని, దళిత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.దళిత సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి తగిన నిధులు కేటాయించాలని, దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి బోనగిరి శ్రావణ్, మండల అధ్యక్షులు రొడ్డ చరణ్ పాల్గొన్నారు.

స్కావెంజర్ల 4 రోజుల పాఠశాల బహిష్కరణ.



ఏటూరునాగారం నవంబర్ 21, ప్రజావాణి:రాష్ట్రంలోని 33 జిల్లాల్లో జిల్లా పరిషత్, మండల పరిషత్, మోడల్ స్కూల్స్ లో పని చేస్తున్న స్కావెంజర్లకు 6 నెలలుగా జీతాలు రావడం లేదు.

జీతాలు ఎప్పుడు వస్తాయో అధికారులు, ప్రభుత్వం, కలెక్టర్, డీ ఈ వో ఎవరూ క్లారిటీ ఇవ్వడం లేదు. అందరూ చేతులెత్తేస్తున్నారు.జీతం లేకుండా మేము కుటుంబాలను ఎలా పోషించుకోవాలి? అనేక సార్లు వినతి పత్రాలు ఇచ్చినా, మౌఖికంగా చెప్పినా పట్టించుకోవడం లేదు.

కావున తప్పనిసరి పరిస్థితుల్లో మేము విధుల్లోకి హాజరు కాము అని తెలియజేస్తున్నాము.

సోమవారం, మంగళవారం, బుధవారం, గురువారం - 4 రోజులు.

ఈ 4 రోజులు పాఠశాలలకు స్కావెంజర్లు హాజరు కారు.

మా డిమాండ్లు నెరవేరే వరకు, 6 నెలల పెండింగ్ జీతాలు విడుదల అయ్యే వరకు మా పోరాటం కొనసాగుతుంది.

మా డిమాండ్లు :

1. 6 నెలల పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలి
2. ప్రతి నెలా సకాలంలో జీతం ఇవ్వాలి
3. జీవో 06 జారీ చేసి, జాబ్ చార్ట్ ఇచ్చి, అవుట్ సోర్సింగ్ కార్మికులుగా రిజిస్టర్ చేయాలి
4. పీఎఫ్ ఈ ఎస్ ఐ సౌకర్యం కల్పించాలి
5. సమాన పనికి సమాన వేతనం రూ. 26,000/- ఇవ్వాలి
6. పిల్లల సంఖ్య ఆధారంగా వద్దు, మాకు సొంత అకౌంట్ కావాలి. పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి స్కావెంజర్ కు సొంత అకౌంట్ లో నేరుగా జీతం వేయాలి.

ఎల్‌నినో ప్రభావంపై విద్యార్థుల అవగాహన

● నీటి పొదుపుపై నృత్యం, నాటికలతో సందేశం



సిద్ధిపేట ప్రతినిధి,నవంబర్ 21(ప్రజావాణి) ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవక భూగర్భ జలాలు తగ్గిపోతున్న నేపథ్యంలో నీటి ప్రాధాన్యత, పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దుబ్బాక పట్టణంలోని మాస్టర్‌మైండ్స్ పాఠశాల విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం రోజున నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు, నాటికల రూపంలో నీటి కొరత వల్ల ఎదురయ్యే సమస్యలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. వర్షాభావ పరిస్థితులు కొనసాగితే తాగునీరు, సాగునీటికి ఎదురయ్యే ఇబ్బందులను వివరిస్తూ నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని సందేశాన్ని అందించారు. విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హరిబాబు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో నీటి ప్రతి చుక్క ఎంతో విలువైనదని, నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో పొదుపు అలవాట్లు పెంపొందించాలని, నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ బీమా నమోదు ప్రక్రియలో తప్పులకు తావివ్వొద్దు

● అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం అందేలా చర్యలు తీసుకోవాలి: కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ



చిలుకూరు నవంబర్21(ప్రజావాణి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను అధికారులు అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని కోదాడ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) సూర్యనారాయణ సూచించారు. అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.శనివారం సూర్యాపేట జిల్లా చిలుకూరు గ్రామపంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆర్డీవో సూర్యనారాయణ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నమోదు విధానం, లబ్ధిదారుల వివరాల సేకరణ, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల వ్యక్తిగత వివరాలు, అవసరమైన పత్రాలను పరిశీలించి నమోదు చేయాలని, సాంకేతిక కారణాలతో లేదా వివరాల్లో పొరపాట్లతో అర్హులకు పథకం అందకుండా ఉండకూడదని సూచించారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో అమలు చేస్తున్న నేపథ్యంలో, ఈ పథకంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ బీమా నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ నమోదు ప్రక్రియను నిర్ణీత సమయంలో పారదర్శకంగా పూర్తి చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో చిలుకూరు తహశీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీవో ముక్కపాటి నరసింహారావు,ఆర్ఐ సితయ్య,పంచాయతీ కార్యదర్శి షరీఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లతో పేదలకు భరోసా అందించిన సర్పంచ్ గడ్డం రమ్య సంపత్



డోర్నకల్: నవంబర్21(ప్రజావాణి) మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం కన్నెగుండ్ల గ్రామం లో వితంతువులు వికలాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. డోర్నకల్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ ఆదేశాల మేరకు కన్నెగుండ్ల గ్రామం లో పింఛన్దారులకు పత్రాలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులుగా తీర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఉచిత రేషన్ కార్డులు. ఉచిత సన్న బియ్యం.200 యూనిట్ల ఉచితంగా విద్యుత్. ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణం వంటి మహిళలకు ఆర్థిక సహాయం భరోసా కల్పిస్తున్నామన్నారు . ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శిరీష. రాము తదితరులు పాల్గొన్నారు

వేల్లంపల్లిలో ఆర్ఎస్పీ అభిమానిగా భారీ ప్లెక్సీ ఏర్పాటు చేసిన జిల్లా సహాయక కార్యదర్శి పెండ్యాల మహేందర్





వేల్లంపల్లి: స్వేరోస్ వ్యవస్థపై అభిమానం, అంబేద్కర్ ఆశయాల పట్ల నిబద్ధతతో జిల్లా సహాయక కార్యదర్శి పెండ్యాల మహేందర్ తన సొంత ఖర్చులతో వేల్లంపల్లి గ్రామంలో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ (ఆర్ఎస్పీ) చిత్రంతో భారీ ప్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా స్వేరోస్ అధ్యక్షుడు మాదారపు నవీన్‌తో కలిసి ఫోటో దిగారు.అదేవిధంగా స్వేరోస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, ప్రచార కార్యక్రమాల్లో పెండ్యాల మహేందర్ తనవంతు సహకారం అందిస్తూ కీలక పాత్ర పోషించారు. కార్యక్రమ విజయవంతానికి ఆర్థికంగా, వ్యక్తిగతంగా సహకారం అందించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.స్వేరోస్ అంటే ఎవరో ఇచ్చే సహాయం కోసం ఎదురుచూసే వ్యవస్థ కాదని, ప్రతి ఒక్కరూ తమ కాళ్లపై తాము నిలబడుతూ సొంతంగా వ్యవస్థను నిర్మించుకోవడమే స్వేరోస్ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. “అక్షరం -- ఆర్థికం” అనే ప్రధాన లక్ష్యాలతో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రూపొందించిన స్వేరోస్ నెట్‌వర్క్ విద్య, ఆర్థిక స్వావలంబన, సామాజిక చైతన్యానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు.స్వేరోస్ ఆశయాల సాధన కోసం వ్యక్తిగతంగా ముందుకొచ్చి సహకరిస్తున్న పెండ్యాల మహేందర్‌ను పలువురు స్వేరోస్ నాయకులు, అభిమానులు అభినందించారు. జై భీమ్! జై స్వేరోస్!

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి:

- **జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో నవంబర్ 21:-ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.శనివారం కలెక్టర్ పట్టణంలోని గొల్లపేట్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీమా నమోదు తీరును పర్యవేక్షించారు. ఒక కుటుంబానికి బీమా నమోదు చేయడానికి దాదాపు ఎంత సమయం అవుతుందో స్వయంగా పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బీమా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. స్థానిక అధికారులంతా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం శిబిరాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ప్రజలంతా ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం కింద నమోదయ్యేలా చొరవ చూపాలని తెలిపారు. ఈ పథకంపై ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్న వారికి అర్థమయ్యేలా తెలియజేయాలని అన్నారు. ప్రక్రియ పూర్తి చేసిన కుటుంబాల వివరాలన్నీ స్పష్టంగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.ఈ తనిఖీలో సిపిఓ గంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, స్థానిక కౌన్సిలర్ సురేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సాయి గ్రామర్ పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవ వేడుకలు

- **ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించిన విద్యార్థులు.. ఒకరోజు పాఠశాల బాధ్యతలు చేపట్టిన చిన్నారులు**



చిలుకూరు, నవంబర్ 21(ప్రజావాణి): చిలుకూరు మండల కేంద్రంలోని సాయి గ్రామర్ పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వాహకుల వేషధారణలో సందడి చేశారు. ఒకరోజు పాటు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించడంతో పాటు పాఠశాల నిర్వహణ బాధ్యతలను చేపట్టి తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేగా నేహా, ఆర్జేడీగా ఉజ్వల, డీఈవోగా వేదశ్రీ, ఎంఈవోగా యశ్వంత్, ప్రధానోపాధ్యాయురాలిగా యశ్విత బాధ్యతలు స్వీకరించి ఒకరోజు పాటు పాఠశాల కార్యకలాపాలను నిర్వహించారు. ఉపాధ్యాయుల మాదిరిగా తరగతి గదుల్లో పాఠాలు బోధిస్తూ, విద్యార్థులకు క్రమశిక్షణ, విద్యా ప్రాధాన్యతను వివరించారు. పాఠశాల నిర్వహణలో ఉపాధ్యాయులు ఎదుర్కొనే బాధ్యతలను స్వయంగా అనుభవించి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ప్రతిరోజూ తాము చేసే అల్లరిని ఓపికగా భరిస్తూ, ప్రతి అంశాన్ని తమకు అర్థమయ్యేలా వివరించి పాఠాలు బోధించడం ఉపాధ్యాయులకు ఎంతో కష్టమైన పని అని ఈ కార్యక్రమం ద్వారా తెలుసుకున్నామని తెలిపారు. ఇకపై ఉపాధ్యాయులను గౌరవిస్తూ, క్రమశిక్షణతో మెలుగుతామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తమను సొంత పిల్లలుగా భావించి విద్యాబుద్ధులు నేర్పుతూ, ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడం తమ అదృష్టమని అన్నారు.స్వపరిపాలన దినోత్సవం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత ప్రవర్తన, ఆత్మవిశ్వాసం, ఉపాధ్యాయుల పట్ల గౌరవభావం పెంపొందుతాయని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి పాఠశాల నిర్వహణలో భాగస్వాములు కావడం అందరినీ ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గవిని ఆంజనేయులు, ఉపాధ్యాయులు దీప్తి, ఉమా, లావణ్య, ఇందిర, ఇందు, త్రివేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

రావల్‌కోల్‌లో ఏసీబీ వలలో వార్డు ఆఫీసర్

- **రూ.30 వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబాటు**
- **ఇంటి మ్యూటేషన్ కోసం రూ.40 వేలు డిమాండ్.. బేరసారాల అనంతరం రూ.30 వేలకు ఒప్పందం**
- **మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారుల పాత్రపైనా ఏసీబీ విచారణ**



మేడ్చల్, నవంబర్ 21 (ప్రజా వాణి):- మేడ్చల్ జిల్లాలోని రావల్‌కోల్‌లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు వలపన్ని వార్డు ఆఫీసర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇంటి మ్యూటేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు లంచం డిమాండ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో దాడి నిర్వహించి వార్డు ఆఫీసర్ డి. రవీందర్ రెడ్డిని రూ.30 వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.వివరాల్లోకి వెళితే.. రావల్‌కోల్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన తల్లిదండ్రుల పేరుపై ఉన్న ఇంటిని తన పేరుపై మ్యూటేషన్ చేయించుకునేందుకు సంబంధిత మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకు అవసరమైన దరఖాస్తు ప్రక్రియ పూర్తయినప్పటికీ, మ్యూటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలంటే రూ.40 వేలు లంచం ఇవ్వాలని వార్డు ఆఫీసర్ డి. రవీందర్ రెడ్డి డిమాండ్ చేసినట్లు బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు.అధికారి అడిగిన లంచం ఇచ్చేందుకు ఇష్టపడని బాధితుడు డబ్బులు చెల్లించేందుకు నిరాకరించడంతో ఇరువురి మధ్య బేరసారాలు జరిగినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. చివరకు రూ.30 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరినట్లు తెలిపారు. అయినప్పటికీ లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.

బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి, పక్కా ప్రణాళికతో వలపన్నారు. ఈ క్రమంలో శుక్రవారం బాధితుడి నుంచి రూ.30 వేల లంచం తీసుకుంటున్న సమయంలో వార్డు ఆఫీసర్ డి. రవీందర్ రెడ్డిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఈ లంచం వ్యవహారంలో మున్సిపల్ కమిషనర్ పాత్ర ఏమైనా ఉందా? ఇతర అధికారుల ప్రమేయం ఉందా? అనే కోణంలోనూ ఏసీబీ అధికారులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో మరిన్ని వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించాల్సిన అధికారులు లంచాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి తావులేకుండా ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో భావాలను వ్యక్తపరచాలి

- **వక్తృత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి**



ప్రజావాణి,నంగునూరు, నవంబరు 21: ఆంగ్ల భాషపై పట్టు సాధించడం నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఎంతో అవసరమని, భాషా నైపుణ్యాలు భవిష్యత్తులో ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవడానికి దోహదపడతాయని మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి అన్నారు. నంగునూరు మండల ఆంగ్ల భాషా ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మండలస్థాయి ఆంగ్ల భాషా ఒలింపియాడ్, టెడ్-ఎడ్ ప్రసంగ పోటీలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని భాషా పరిజ్ఞానం, సృజనాత్మకత, భావవ్యక్తీకరణ సామర్థ్యాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సంపాదించడంతో పాటు తమ ఆలోచనలను స్పష్టంగా, ధైర్యంగా ఇతరులకు వివరించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వక్తృత్వ పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి చక్కటి అవకాశమని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మాట్లాడే నైపుణ్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనడం ద్వారా కొత్త విషయాలను నేర్చుకుని నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాల్సిన నైపుణ్యాలను గుర్తించ వచ్చని తెలిపారు. నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా వేదికలపై ధైర్యంగా మాట్లాడే నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అభ్యసనలో ఆంగ్ల భాషా పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. కేవలం పరీక్షల్లో మార్కులు సాధించడమే కాక ఆంగ్లంలో మాట్లాడటం, ఇతరుల అభిప్రాయాలను అర్థం చేసుకోవడం, స్వతంత్రంగా ఆలోచించడం వంటి నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. ప్రసంగ పోటీలు విద్యార్థుల్లో వేదిక భయాన్ని తొలగించి, తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తపరిచే ధైర్యాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ ఇలాంటి పోటీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఆంగ్ల భాషా ఒలింపియాడ్ సీనియర్ల విభాగంలో నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.హర్షితారెడ్డి, నర్మెట్ట పాఠశాలకు చెందిన బి. రిత్విక్ వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతి సాధించారు. జూనియర్ల విభాగంలో నంగునూరు పాఠశాలకు చెందిన రిషివర్ధన్ రెడ్డి, బద్దిపడగ పాఠశాలకు చెందిన జె.భవాని వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారు. టెడ్ - ఎడ్ ప్రసంగ పోటీల్లో సీనియర్ల విభాగంలో అక్కెనపల్లి తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన ఐ.మనోజ్ఞ, బద్దిపడగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జి. అక్షిత వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. జూనియర్ల విభాగంలో అక్కెనపల్లి తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన ఎన్. నిత్యారెడ్డి, నర్మెట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.నిఖిల ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు విజేతలను అభినందించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల భాషా ఉపాధ్యాయుల సంఘం మండల సమన్వయకర్త గజబింకార్ కన్యాలాల్, సహ సమన్వయకర్త ఎర్ర పార్థసారథి, ఆంగ్ల ఉపాధ్యాయులు భైరు సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా డిప్యూటీ కమిషనర్ సుదాన్స్

- **గుండ్ల పోచంపల్లి డివిజన్‌లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం**



మేడ్చల్ (ప్రజావాణి):- గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుదాన్స్ ఆధ్వర్యంలో దరఖాస్తుల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. దరఖాస్తుల స్వీకరణకు నెల రోజుల గడువు ఉంటుందని, డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలకు సులభంగా సేవలు అందించేందుకు వార్డు కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గరిసెల సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు ఈ పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాన్ని అర్హులందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, మాజీ సర్పంచులు బండారి నరేందర్ ముదిరాజ్, బేరి ఈశ్వర్, జిల్లా ఓబీసీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవి ముదిరాజ్, మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రమణారెడ్డి, శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బొజ్జ ఆదిలక్ష్మి, మాజీ ఎంపీటీసీ పులిగల్ల రాజేశ్వర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దొడ్ల మోహన్ ముదిరాజ్, అమరం సురేష్ రెడ్డి, జిల్లా ఐఎన్‌టీయూసీ మాజీ అధ్యక్షుడు కావేరి శేఖర్ ముదిరాజ్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు పాలకుర్తి మురళి గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుండ భానుచందర్, జిల్లా ఓబీసీ నాయకుడు సాయిపేట సురేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ ముదిరాజ్, తలారి వెంకటేష్ ముదిరాజ్, కండ్లకొయ్య మాజీ ఉపసర్పంచ్ చిల్ల వెంకటేష్ ముదిరాజ్, సేవాదళ్ అధ్యక్షుడు చిల్ల సాయి ముదిరాజ్, ప్రవీణ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నంగునూరులో ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

- **ముదిరాజ్‌ల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి -- 50 ఏళ్లు పైబడిన మత్స్యకారులకు పింఛన్ కల్పించాలని విజ్ఞప్తి**



ప్రజావాణి,నంగునూరు, నవంబర్ 21 :మత్స్యకారుల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని నంగునూరు ముదిరాజ్ సంఘం నాయకులు కోరారు. చేపల వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా మరింత చేయూత అందించాలని, ముఖ్యంగా 50 ఏళ్ల పైబడిన ప్రతి మత్స్యకారుడికి పింఛన్ సౌకర్యం కల్పించి వారి జీవితాలకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు జెండా ఆవిష్కరించి మత్స్యకారుల ఐక్యత, సంక్షేమం, హక్కులు, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ మత్స్యకారులు సమాజానికి అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. తరతరాలుగా చేపల వృత్తినే జీవనాధారంగా చేసుకుని ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న మత్స్యకార కుటుంబాల అభ్యున్నతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంతో పాటు చెరువులు, కుంటల్లో చేపల పెంపకానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని కోరారు.వయస్సు పైబడిన మత్స్యకారులు శారీరక శ్రమ చేయలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాంటి వారికి నెలవారీ పింఛన్ అందించడం ద్వారా వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కల్పించవచ్చని అన్నారు. ముదిరాజ్‌ల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.మత్స్యకారుల ఐక్యతను చాటుతూ నిర్వహించిన ఈ వేడుకల్లో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గౌరబోయిన సంపత్ కుమార్, ఉపాధ్యక్షుడు కొండిల్ల రాజు, కార్యవర్గ సభ్యులు సోప్పరి ఎల్లాదాసు, జంగిటి శ్రీనివాస్, వస్తాదుల యాదయ్య, జంగిటి ఆంజనేయులు, భీమరి కనకరాజు, చింతల రాజు, అప్పిస్ ఆంజనేయులు, చింతల నవీన్ కుమార్, గుండబోయిన సాయిరామ్, జంగిటి శేఖర్, పోలబోయిన మహేష్, గౌరబోయిన రాజు, తుపాకుల సాయి, గుండబోయిన భూపతి, సోప్పరి సంజయ్, గౌరబోయిన అజయ్, నల్లక్కట్టే హరికృష్ణ, కన్నారం ప్రశాంత్, గౌరబోయిన బాబు, ముదిరాజ్ సంఘం కుల పెద్దలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల్లో తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ.

- **మండల స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి కైవసం.**
- **విజేతలను అభినందించిన ప్రిన్సిపల్ బి. శంకర్ నాయక్.**



హుజూర్నగర్ నవంబర్ 21 (ప్రజావాణి) జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి 'చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్' పోటీల్లో మఠంపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటి ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు.సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గ మఠంపల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ పోటీల్లో ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల విభాగం నుంచి మోడల్ స్కూల్ విద్యార్థులు బి. సంతోష్ (10వ తరగతి), ఐజాక్ (9వ తరగతి), షర్మిల (8వ తరగతి) పాల్గొని అద్భుత ప్రతిభతో మొదటి స్థానంలో నిలిచారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన ఈ బృందం త్వరలో జరగబోయే జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించింది.విద్యార్థులను విజేతలుగా తీర్చిదిద్దిన గైడ్ టీచర్, పి.జి.టి, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు జక్కుల లక్ష్మణరావును, విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ బి. శంకర్ నాయక్ మరియు ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో రాణించి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు.

కుటుంబానికి కొండంత అండ.. ఇందిరమ్మ జీవిత బీమా

- డిసెంబర్ 3న పల్లె గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు కార్యక్రమం
- అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల ఉచిత జీవిత బీమా
- అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- పల్లె గ్రామ సర్పంచ్ పార్దేమ్ మనీషా సంజీవ్



ఆర్మూర్ టౌన్,నవంబర్21(మన సమగ్ర ప్రజావాణి):
పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని డిసెంబర్ 3వ తేదీన ఆర్మూర్ మండలంలోని పల్లె గ్రామంలో ప్రారంభించనున్నట్లు గ్రామ సర్పంచ్ పార్దేమ్ మనీషా సంజీవ్ తెలిపారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డిసెంబర్ 3న ప్రారంభమై డిసెంబర్ 9న ముగిస్తుందని కుటుంబంలో సంపాదించే వ్యక్తి అకస్మాత్తుగా మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, అలాంటి పేద కుటుంబాలకు అండగా నిలవాలనే గొప్ప ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తోందని అన్నారు.
రూ.5 లక్షల జీవిత బీమా.. కుటుంబానికి అండగా ప్రభుత్వం
ఈ పథకం ద్వారా అర్హత కలిగిన ప్రతి కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సున్న సంపాదించే ఒక వ్యక్తికి రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పిస్తారని తెలిపారు. బీమా పొందిన వ్యక్తి మరణించిన సందర్భంలో నామినీగా నమోదు చేసిన కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల బీమా పరిహారం అందుతుందని వివరించారు.
ఈ పథకంలో చేరేందుకు లబ్ధిదారులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని, బీమా ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వమే భరిస్తుందని ఆమె తెలిపారు. పేద కుటుంబాలపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం ఉచితంగా బీమా రక్షణ కల్పించడం ఎంతో అభినందనీయమని అన్నారు.
దరఖాస్తు సమయంలో తీసుకురావాల్సిన వివరాలు
తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. బీమా చేయించుకునే వ్యక్తి ఆధార్ కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ వివరాలు, రేషన్ కార్డు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా నామినీ వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయించుకోవాలని కోరారు.
రేషన్ కార్డు లేని కుటుంబాలు లేదా రేషన్ కార్డులో పేర్లు లేని వారు కూడా ప్రత్యేక దరఖాస్తు ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉన్నందున వారు కూడా అధికారులను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.
ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యం
ఇది కేవలం ఒక బీమా పథకం మాత్రమే కాదని, కుటుంబంలో సంపాదించే వ్యక్తిని కోల్పోయినప్పుడు ఆ కుటుంబం రోడ్డున పడకుండా ఆర్థికంగా ఆదుకునే గొప్ప సంక్షేమ కార్యక్రమమని మనీషా సంజీవ్ అన్నారు
పల్లె గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబం డిసెంబర్ 3న నిర్వహించే నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా తమ కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ తొలి దశ ఉద్యమ నేత సేవలకు సముచిత గుర్తింపు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి కృతజ్ఞతలు



ప్రజావాణి, నంగునూరు, నవంబరు 21: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన తొలి దశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన దివంగత సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అనంతుల మదన్ మోహన్ సేవలను గుర్తించి సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు ఆయన పేరు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం అభినందనీయమని టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి అన్నారు. తెలంగాణ ఉద్యమానికి విశేష సేవలందించిన మహనీయుడికి ఈ నిర్ణయం ద్వారా సముచిత గౌరవం లభించిందని హర్షం వ్యక్తం చేశారు.
ఇటీవల సిద్దిపేటలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ గురువు అనంతుల మదన్ మోహన్ పేరును సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు పెడుతున్నట్లు ప్రకటించడం పట్ల యాదగిరి సంతోషం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను తొలి దశ ఉద్యమంలోనే బలంగా వినిపించిన నాయకుల్లో అనంతుల మదన్ మోహన్ ప్రముఖులని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన పోరాటం, రాజకీయ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.
పదవులు, అధికారాలకు అతీతంగా ప్రజల ఆకాంక్షల కోసం పనిచేసిన నాయకుల సేవలను భావితరాలకు పరిచయం చేయడం ఎంతో అవసరమని అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు అనంతుల మదన్ మోహన్ పేరు పెట్టాలనే నిర్ణయం ఆయన ఆశయాలను, ఉద్యమ స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు గుర్తుచేస్తుందని పేర్కొన్నారు.
తెలంగాణ ఉద్యమ చరిత్రలో విశిష్ట స్థానం సంపాదించుకున్న అనంతుల మదన్ మోహన్ సేవలను గుర్తించి గౌరవించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.

ట్రినిటీ జాబ్ మేళాకు యువత పోటెత్తింది

- 45 ప్రముఖ కంపెనీల భాగస్వామ్యం.. వెయ్యి మందికి పైగా నిరుద్యోగ యువత హాజరు
- చిన్న ఉద్యోగమే ఉన్నత భవిష్యత్తుకు తొలి మెట్టు: మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, నవంబర్ 21:
నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పెద్దపల్లి పట్టణంలోని ప్రగతినగర్ ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. విద్యాసంస్థల వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో, చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ఉద్యోగ మేళాకు పెద్దపల్లితో పాటు పరిసర ప్రాంతాల నుంచి వెయ్యి మందికి పైగా నిరుద్యోగ యువతీ యువకులు తరలివచ్చారు.
ఈ జాబ్ మేళాలో సాఫ్ట్‌వేర్, ఫార్మా, ఫైనాన్స్, మేనేజ్‌మెంట్ తదితర రంగాలకు చెందిన 45 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. పదో తరగతి నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ వరకు వివిధ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులకు ఆయా కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించారు. తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అభ్యర్థులు ఉత్సాహంగా ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. దీంతో కళాశాల ప్రాంగణం నిరుద్యోగ యువత సందడితో కిటకిటలాడింది.
ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ పెద్దపల్లి ప్రాంతంలోని ఏ ఒక్క యువతీ యువకుడికి ఉద్యోగం లభించినా తమ కుటుంబ సభ్యుడికి ఉద్యోగం వచ్చినంత ఆనందంగా భావిస్తామని అన్నారు. యువత ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూడకుండా అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రారంభంలో చిన్న ఉద్యోగం లభించినా నిరాశ చెందకుండా దానిని ఒక అవకాశంగా భావించి కష్టపడి పనిచేయాలని, నేటి చిన్న కొలువే రేపటి గొప్ప భవిష్యత్తుకు బలమైన పునాదిగా మారుతుందని పేర్కొన్నారు.నాణ్యమైన విద్యను అందించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం తమ విద్యాసంస్థల ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువతలో ఉన్న ప్రతిభను గుర్తించి వారికి తగిన ఉద్యోగాలు లభించేలా భవిష్యత్తులోనూ మరిన్ని జాబ్ మేళాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి విద్యాసంస్థల తరఫున తమ వంతు కృషి నిరంతరం కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ వూట్ల అశోక్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేష్, ఎస్‌ఆర్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ సమ్మయ్య, ఏవో సురేష్ రాజిరెడ్డి, కళాశాల అధ్యాపకులు, వివిధ కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

- అర్హులైన ప్రతి కుటుంబం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి -సర్పంచ్ వడ్డెమాన్ బిచ్చన్న
- 18 నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగిన వారికి బీమా అవకాశం.. కుటుంబాలకు ఆర్థిక భరోసా



చిన్నంబావి, ప్రజావాణి నవంబరు 21: చిన్నంబావిమండల పరిధిలోనికొప్పునూర్ గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని గ్రామ సర్పంచ్ వడ్డెమాన్ బిచ్చన్న శనివారం ప్రజాప్రతినిధులతో కలిసిప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో పథకానికి సంబంధించిన వివరాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ వడ్డెమాన్ బిచ్చన్నమాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగాపనిచేస్తోందని,రాష్ట్రముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొనిప్రవేశపెడుతున్న పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు. కుటుంబ పెద్దకు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబానికి ఆర్థిక భరోసాకల్పించడంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ పథకానికి 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని, వయస్సుధ్రువీకరణకు ఆధార్ కార్డు సరిపోతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పథకం వివరాలనుతెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల సంక్షేమం, గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అగ్గన్నగారి సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్నాయకులు జంగ బిచుపల్లి యాదవ్, వార్డు సభ్యులు తగరం శ్రీనివాసులు,బిజినెముల జగదీష్, బంకుమిది చక్రధర్ రెడ్డి, పసుల భారత్, పంచాయతీకార్యదర్శినాగరాజ్,హరిచందర్, కృష్ణారెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



గ్రామ పంచాయితీ కార్మికులు, ఆశా వర్కర్లు ఏఐటీయూసీలో చేరిక

- మేకల శ్రీనివాసరావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి



చిలుకూరు నవంబర్ 21 (ప్రజావాణి) చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం గ్రామంలో ఆశా వర్కర్లు మరియు గ్రామ పంచాయతీ కార్మికులను ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు వారికి ఏఐటీయూసీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం నిరంతరం అలుపెరగని పోరాటం చేస్తున్న దేశంలో ఏకైక సంఘం ఏఐటీయూసీ అని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతన చట్టాన్ని సవరించి రూ.26,000 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి రూ.18,000 ఫిక్స్ శాలరీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా కింద రూ.50 లక్షలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.ఏఐటీయూసీలో చేరిన ఆశా వర్కర్లు మోదుగు లక్ష్మి, షేక్ ఖాలేదా బేగం, గుగులోత్ కళావతి, మాలోతు దుర్గ.గ్రామ పంచాయతీ వర్కర్లు సైదాచారి,కోటయ్య, పొట్టి అంజమ్మ,మాతంగి నాగమ్మ, కొండా శ్రీలత, సైదా తదితరులు చేరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రేమిడాల రాజు,జెర్రిపోతులగూడెం గ్రామ సీపీఐ కార్యదర్శి కె. వెంకటయ్య, సీపీఐ మండల నాయకులు ఉద్దండు నారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు

వివేకానంద విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా చిల్డ్రన్స్ డే వేడుకలు

- సిరిసిల్ల అశోక్ నగర్‌లో వేడుకల సందడి





సిరిసిల్ల, ప్రజావాణి సిరిసిల్ల పట్టణంలోని అశోక్ నగర్ వివేకానంద విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చిల్డ్రన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ బచ్చారావు ఆధ్వర్యంలో వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి.ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. పిల్లల ప్రతిభను ప్రోత్సహిస్తూ, వారి విద్యాభివృద్ధితో పాటు సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.చిల్డ్రన్స్ డే సందర్భంగా పాఠశాలలో సందడి నెలకొనగా, విద్యార్థులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.

కష్టకాలంలో బాధితురాలికి అండగా స్పీకర్ ప్రసాద్ కుమార్

- కష్టాల్లో తోడుగా.కన్నీళ్ళలో భరోసాగా ప్రసాదన్న
- బాధిత కుటుంబానికి రూ. 2 లక్షల 50 వేల ఎల్ఓసీ అందజేత





ప్రజా వాణి,వికారాబాద్ జిల్లా,నవంబర్21:వికారాబాద్ నియోజకవర్గం మర్పల్లి మండలంలోని కోట మర్పల్లి గ్రామానికి చెందిన పులిపిరి ఎల్లయ్య భార్య అంతమ్మ వైద్య చికిత్స కోసం తెలంగాణ శాసనసభ సభాపతి,వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ రూ. 2,50,000/-ల ఎల్ఓసీ ని మంజూరు చేయించారు.నిరుపేద మహిళ అంతమ్మ హైదరాబాద్ లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స తీసుకోవడానికి స్పీకర్ ఎల్ఓసీ ఇప్పించారు.పులిపిరి అంతమ్మ కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న వెంటనే స్పీకర్ ప్రసాద్ కుమార్ చలించిపోయారు.వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి సిఏంఆర్ ఫ్ నుండి ఎల్ ఓ సి మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు.ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.పులిపిరి అంతమ్మ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.తన నియోజకవర్గంలో ఏ ఒక్కరికి కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పులిపిరి అంతమ్మ కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.అత్యవసర సమయంలో ఆదుకుని రూ. 2,50,000/-ల ఎల్ఓసీని మంజూరు చేయించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పులిపిరి అంతమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నారాయణఖేడ్ నియోజకవర్గం:-(ప్రజావాణి)ఇంచార్జ్ మదుసుదన్
నారాయణఖేడ్ : మున్సిపల్ పట్టణంలోని మంగళ్‌పేట్‌కు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుడు గండ్ల రామకృష్ణ నూతన గృహప్రవేశ వేడుకల్లో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. సొంత ఇల్లు అనేది ప్రతి పేద కుటుంబానికి ఒక చిరకాల స్వప్నమని, ఆ స్వప్నాన్ని నెరవేర్చేందుకు ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ నిర్మాణానికి సహకారం అందిస్తోందని పేర్కొన్నారు.ప్రజా సంక్షేమం, పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.అనంతరం గృహ యజమాని గండ్ల రామకృష్ణ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, భోజి రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, తాహెర్ అలీ సీనియర్ నాయకులు, రుక్మిణి గోపాల్ రెడ్డి, సుబుర్ కౌన్సిలర్, మొహీద్, శెట్టి శంకర్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు, భాస్కర్ ఉప సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, peerzadi guda, GHMC, medchal malkaj giri AND PUBLICATIONS, , Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONSContact No : 9440032006. MAIL ID : prajavaani006@gmail.comepaper.prajavaani.net

నిరుపేద కుటుంబానికి మోరీల్ శ్రీనివాస్ రావు ఆర్థిక చేయూత.

● అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించిన బీఆర్ఎస్ నేతలు.



వర్ని/ప్రజావాణి: -నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజక వర్గం వర్ని మండలంలోని జాకోర గ్రామానికి చెందిన గుండ్ల సాయిలు తల్లి అనారోగ్యంతో శనివారం మరణించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకుల ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు మోరీల్ శ్రీనివాస్ రావు తక్షణమే స్పందించారు. సాయిలు కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా మృతురాలి అంత్యక్రియల నిమిత్తం ఆయన రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని పంపించారు.ఈ మొత్తాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబానికి అందజేసి వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఇందిరమ్మ జీవిత బీమా పథకం.. పేద కుటుంబాలకు కొండంత అండ



డోర్నకల్: నవంబర్ 21 (ప్రజావాణి) మహబూబాబాద్ జిల్లా డోర్నకల్: స్థానిక ఎనిమిదవ వార్డులోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకమైన ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని డీసీసీ ప్రధాన కార్యదర్శి,కో-ఆప్షన్ సభ్యురాలు శీలం భాగ్యలక్ష్మి శ్రీనివాస్ 8వ వార్డు కౌన్సిలర్ రాము. శరత్. కలిసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద,మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అర్హులైన ప్రతి ఒక్కరూ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాలు ప్రతి కుటుంబానికి కొండంత అండగా నిలుస్తాయని పేర్కొన్నారు.

జన చైతన్య సభకు ఆత్మకూరు మండల బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలి

● కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరు.. పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపు



ఆత్మకూరు, నవంబర్ 21 (ప్రజావాణి): హనుమకొండలోని కేడీసీ కళాశాల మైదానంలో ఆదివారం (నవంబర్ 22) సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న జన చైతన్య సభకు ఆత్మకూరు మండలంలోని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని మండల సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది.ఈ సభకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు మండలంలోని అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, సొసైటీ, మార్కెట్ కమిటీల మాజీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, యువజన నాయకులు, ముఖ్య నాయకులు తప్పనిసరిగా సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.పార్టీ శ్రేణులంతా సమన్వయంతో ముందుకు సాగుతూ జన చైతన్య సభలో భాగస్వాములు కావాలని భారత రాష్ట్ర సమితి ఆత్మకూరు మండల సమన్వయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

● సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు కొండంత అండ -- మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు



నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి నిరుపేదలకు కొండంత అండగా సీఎం రిలీఫ్ ఫండ్ నిలుస్తుందని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. చండూరు మున్సిపాలిటీలో అనారోగ్య కారణంగా వివిధ ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ప్రత్యేక చొరవతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం నాడు స్థానిక ప్రభుత్వ అతిథి గృహం నందు మున్సిపాలిటీకి చెందిన 17 మంది లబ్ధిదారులకు గాను 6,66,000/- రూపాయల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు ఐతరాజు మల్లేస్తులతో కలిసి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బుషిపాక వాసు, కోడి సుష్మా వెంకన్న, కో ఆప్షన్ సభ్యులు కల్లెట్ల చంద్రకళ మారయ్య, మొగుదాల వెంకన్న, చేనే సహకార సంఘం డైరెక్టర్ జూలూరు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి సందర్భంగా ఉయ్యాల వేడుకలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

● 12 జంటలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు.. భక్తులకు అన్నప్రసాద వితరణ





జోగిపేట, నవంబర్ 21, మన ప్రజావాణి, జిల్లా ప్రతినిధి శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 418వ జయంతి సందర్భంగా జోగిపేట పట్టణంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఉయ్యాల వేడుకలు, సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ డి.బి. నాగభూషణం, బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, బిర్ల శంకర్, కరుణాకర్ పాల్గొన్నారు. అలాగే పట్టణ ప్రముఖులు ప్రభాత్ కుమార్, బేలూరు రవీందర్, సంగమేశ్వర్, రమణయ్య, బాబా గౌడ్ తదితరులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన 12 వ్రత పీటల వద్ద 12 జంటలు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ పాండు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలను పరిశీలన

● నర్సింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ఎస్టీ హాస్టల్, ఆర్డీఓ కార్యాలయాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్





అందోల్--జోగిపేట, నవంబర్ 21, మన ప్రజావాణి, జిల్లా ప్రతినిధి అందోల్--జోగిపేట పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలను అదనపు కలెక్టర్ పాండు శుక్రవారం సందర్శించి పరిశీలించారు. నర్సింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ఎస్టీ హాస్టల్, ఆర్డీఓ కార్యాలయాలను సందర్శించి అక్కడ అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, కార్యాలయాల పనితీరును సమీక్షించారు. అనంతరం అందోల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన స్వయం పరిపాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన కార్యక్రమాలను పరిశీలించి, వారి ప్రతిభను అభినందించారు. విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులతో కలిసి ఫొటోలు దిగుతూ ఉత్సాహంగా గడిపారు.విద్యార్థులు స్వయంగా నిర్వహించిన కార్యక్రమాలు, వారి ప్రతిభను చూసి అధికారులు, ప్రముఖులు ప్రశంసలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), మంత్రి వ్యక్తిగత పీఏ హన్మాండ్లు, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఎంఆర్ఓ మధుకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సద్గుణ మేరీ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ లో స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్‌లో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రాజెక్టుల ప్రదర్శన





మంథని నియోజకవర్గ ప్రతినిధి, నవంబర్ 21, ప్రజావాణి:మంథని పట్టణంలోని కాకతీయ హై స్కూల్ లో స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ విద్యార్థులు వివిధ సబ్జెక్టులకు సంబంధించిన అనేక రకాల ప్రాజెక్టులను తయారుచేసి ప్రదర్శించారు.తెలుగు, ఇంగ్లీష్, గణితం, సైన్స్, సోషల్ స్టడీస్ తదితర అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ప్రాజెక్టులను విద్యార్థులు ఎంతో ఆసక్తిగా, సృజనాత్మకంగా రూపొందించి ప్రదర్శించారు. విద్యార్థులు తమ ప్రాజెక్టుల గురించి తల్లిదండ్రులకు వివరించడంతో పాటు, వాటి ఉపయోగాలు, వాటి తయారీ విధానాన్ని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై విద్యార్థుల ప్రాజెక్టులను సందర్శించి, పిల్లల ప్రతిభను చూసి అభినందించారు. లీడ్ కోఆర్డినేటర్ పావని రెడ్డి మాట్లాడుతూ పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా, ఇలా ప్రాక్టికల్ నాలెడ్జ్ ద్వారా నేర్చుకోవడం ముఖ్యం ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, విషయ పరిజ్ఞానం మరియు తమ ఆలోచనలను ఇతరులకు వివరించే నైపుణ్యాలు పెంపొందుతాయని అని తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ ఎంతో ఉపయోగపడుతుంది. విద్యార్థులు పుస్తకాలలో చదువుకున్న విషయాలను ప్రాజెక్టుల రూపంలో స్వయంగా తయారుచేసి, వాటి గురించి తల్లిదండ్రులకు వివరించడం చాలా సంతోషంగా ఉంది.

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుంది. అలాంటి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే మా పాఠశాల లక్ష్యం. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మక ఆలోచన, నాయకత్వ లక్షణాలు, మాట్లాడే నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి.తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని పిల్లల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించడం అభినందనీయం. పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరం. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

చండూరు హైస్కూల్లో ఘనంగా జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) చెకుముకి మండల స్థాయి పోటీలు

● విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, జ్ఞాపికలు అందజేత





నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణిచండూరు హైస్కూల్లో శనివారం జన విజ్ఞన వేదిక (జేవీవీ) చెకుముకి మండల స్థాయి పోటీలు, విద్యార్థులకు దృవీకరణ పత్రాలు, జ్ఞాపికల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొబ్బల వెంకట్ రామ్ రెడ్డి (టామ్ రెడ్డి), ఎస్పై శివకుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లేశం, ఎంఈఓ సుధాకర్ రెడ్డి హాజరయ్యారు. వారు మట్లాడుతూ నమ్మకం, మూడ నమ్మకం వేరువేరు అని విద్యార్థులకు వివరించారు. తమ జీవితంలో ఎదురైన కొన్నిఘటనలను ఉదహారణగా చెబుతూ అందరు విజ్ఞాన వంతులు అవ్వాలని బాగా చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని తెలిపారు. మూడు రోడ్ల వద్ద నిమ్మకాయలు, కోడి గుడ్లు, అన్నం తిప్పివేయటం వంటి వాటితో ఏమి కాదని, దెయ్యాలు, భూతాలు అన్ని కూడా అభూత కల్పనలు అంటు వివరించారు. ఎనకటి కాలంలో గ్రామీణ ప్రాంతలలో నిరక్షరాస్యత ఉండేదని అంధ విశ్వాసాలతో అనేక ఆచారాలు పాటించేవారని తెలిపారు. అప్పటి కాలంలో ఇంట్లోని వృద్ధులు పిల్లలు రాత్రి వేళలో పడుకోకుండా మారాం చేస్తుంటే దెయ్యం వస్తుంది, భూతం వస్తుంది అంటు కల్లబొల్లి మాటలు చెప్పి పడుకోబెట్టేవారన్నారు. మన ఇల్లు పగడివేళలో ఎలా ఉంటుందో రాత్రి వేళలోను అలాగే ఉంటుందని కాని మనం చీకటిలో ఏదో ఉంటుందని భయపడుతామని అక్కడ ఏది ఉండదని అందంతా మన మానసిక భయాందోళనలు మాత్రమే అంటు వివరించారు. చేతబడులు, బానామతులు అన్ని ఉట్టివేనని వాటిని ఎంత మాత్రం పట్టించుకోవాల్సిన పనిలేదని తెలిపారు. భక్తి అంటే క్రమశిక్షణ అని భక్తికి మూడ నమ్మకానికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ఎచ్ఎమ్ కోటేశ్వర్‌రెడ్డి, జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) డివిజన్ అధ్యక్షుడు, సీనియర్ పాత్రికేయుడు రాపోలు ప్రభాకర్, మండల అధ్యక్షుడు, సీనియర్ పాత్రికేయుడు సంగేపు మల్లికార్జున్, సీనియర్ స్కూల్ అసిస్టెంట్ ఎస్. విజయలక్ష్మి, కళ్లెం వెంకట్‌రెడ్డి, సుధీర్‌బాబు, కరుణాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, సతీష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలి:

● మాజీ మంత్రి జీవన్ రెడ్డి...



మున ప్రజావాణి జగిత్యాల పట్టణం నవంబర్ 21. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా శనివారం రోజున మత్స్యకారులకు ఘన సన్మానం... ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని, మత్స్యకారులు మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి చేపలను అందజేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి వారిని శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ చెరువుల పరిరక్షణ & శుద్ధీకరణ: భూముల రీ-సర్వేలో భాగంగా జిల్లాలోని మోతే చెరువు, చింతకుంట, ముప్పల చెరువు, కండ్లపల్లి పెద్ద చెరువు సహా అన్ని చెరువులు, కుంటలకు హద్దులు ఏర్పాటు చేసి కబ్జాల నుండి కాపాడాలి. హైదరాబాద్‌లో హైడ్రా తరహాలో జిల్లాలోనూ ఆక్రమణలను తొలగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. చెరువుల్లోకి మురికి నీరు చేరకుండా ఎస్టీపీ లను ఏర్పాటు చేసి నీటిని శుద్ధి చేసిన తర్వాతే అమృత్ పథకం కింద సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు.

లి మరమ్మతులు & ప్రభుత్వ వైఖరి: తెగిపోయిన మోతే చెరువు మత్తడికి నాలుగేళ్లుగా మరమ్మతులు చేయకపోవడం దురదృష్టకరమని, దీనిపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదని జీవన్ రెడ్డి విమర్శించారు. సభలను కేవలం కేసీఆర్, కేటీఆర్‌లను విమర్శించడానికి కాకుండా, ప్రజలకు ఏం చేస్తారో చెప్పడానికి ఉపయోగించాలని హితవు పలికారు.

లి మత్స్యకారులకు నగదు సాయం: దళారీ వ్యవస్థను అరికట్టడానికి, చేప విత్తన నారుకు బదులుగా చెరువు విస్తీర్ణానికి అనుగుణంగా మత్స్యకార సంఘాలకే నేరుగా నగదు అందజేయాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ మిషన్ కాకతీయతో చెరువులను పునరుద్ధరించడంతో పాటు చేపల విక్రయ వాహనాలు అందించారని, తాను సైతం జగిత్యాలలో చేపల మార్కెట్, గంగపుత్రులు మరియు ముదిరాజ్ సంఘాలకు భూములు కేటాయించానని గుర్తుచేశారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి ఉండాలని, హోదాతో సంబంధం లేకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు.మత్స్యకారుల సమస్యలపై పోరాడుతున్న నాయకుడు జీవన్ రెడ్డి అని తోపరపు రజనీకాంత్ పేర్కొన్నారు. ప్రభుత్వం చేప పిల్లల బదులు ఆ నిధులను నగదు రూపంలో నేరుగా మత్స్యకారులకే ఇవ్వాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో తోపరపు రజనీకాంత్, అరుముల్ల నారాయణ, పల్లికొండ రాజు, అరుముల్ల ఉమేందర్, గుమ్ముల జనార్ధన్, తోపరపు శ్రీహరి, అరుముల్ల గంగాధర్, గుమ్ముల రాజేష్, ద్యావర శ్రీనివాస్, తోపరపు రాజేశం, జంబర్తి రవి తదితరులు పాల్గొన్నారు.

దారితప్పిన చిన్నారులను క్షేమంగా తల్లి చెంతకు చేర్చిన నల్గొండ 2 టౌన్ పోలీసులు

నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి ఆటపాటలతో ఇంటి నుండి బయలుదేరి దారితప్పిన ఇద్దరు చిన్నారులను నల్గొండ 2 టౌన్ పోలీసులు ఎంతో ఓపికతో వెతికి, సురక్షితంగా వారి తల్లి ఒడికి చేర్చిన మానవీయ ఘటన స్థానికుల ప్రశంసలు అందుకుంటోంది.

ఆటల్లో పడి దారితప్పిన పసికూనలు

నల్గొండ పట్టణంలోని మాన్యంచెల్క ప్రాంతానికి చెందిన ఇద్దరు చిన్నారులు ఉదయం అంగన్వాడీ కేంద్రానికి వెళ్లేందుకు ఇంటి నుండి బయలుదేరారు. అయితే, చిన్నతనపు అల్లరితో అంగన్వాడీ వైపు కాకుండా ఆడుకుంటూ ముందుకు సాగారు. అలా నడుచుకుంటూ వెళ్లిన ఆ చిన్నారులు దారితప్పి మధ్యాహ్న సమయానికి విద్యానగర్ ప్రాంతానికి చేరుకున్నారు.

అపార్ట్‌మెంట్ వాసుల అప్రమత్తత

విద్యానగర్‌లోని వసుధ టవర్స్ అపార్ట్‌మెంట్ లిఫ్ట్‌లో ఆ ఇద్దరు చిన్నారులు ఆడుకోవడాన్ని అపార్ట్‌మెంట్ వాసులు గమనించారు. అనుమానం వచ్చి వారిని ఆరా తీయగా, ఆ చిన్నారులు హిందీలో మాట్లాడుతుండటం, తమ ఇంటి వివరాలేవీ చెప్పలేకపోవడంతో వారు దారితప్పి వచ్చారని గ్రహించారు. వెంటనే స్థానిక కార్పొరేటర్ కేసాని వేణుగోపాల్ రెడ్డి ద్వారా 2 టౌన్ పోలీసులకు సమాచారం అందించారు.

పోలీసుల 2 గంటల శ్రమ.. సుఖాంతం

సమాచారం అందుకున్న ఎస్సై సైదాబాబు ఆదేశాల మేరకు కానిస్టేబుళ్లు ఎంఏ ఫరూక్, స్వామి వెంటనే వసుధ





అపార్ట్‌మెంట్‌కు చేరుకున్నారు. చిన్నారులు తమ తల్లిదండ్రుల పేర్లు గానీ, చిరునామా గానీ చెప్పలేకపోవడంతో వారి ఆచూకీ కనుగొనడం పోలీసులకు సవాలుగా మారింది. ?దీంతో అపార్ట్‌మెంట్ వాసులు చంద్రశేఖర్ రెడ్డి, రేవంత్ రెడ్డి తదితరుల సహకారంతో కానిస్టేబుళ్లు ఫరూక్, స్వామి ఆ చిన్నారులను తమ బైక్‌లపై ఎక్కించుకొని నల్గొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో కలియతిరిగారు. చిన్నారులు హిందీ మాట్లాడుతుండటంతో ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చిన కుటుంబాలకు చెందిన పిల్లలై ఉంటారని భావించిన పోలీసులు, ముఖ్యంగా బీటీఎస్, మాన్యంచెల్క ప్రాంతాల్లోని ప్రతి గల్లీ తిరుగుతూ ఆరా తీశారు. ?దాదాపు రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వెతికిన తర్వాత, మాన్యంచెల్కలోని ఒక అంగన్వాడీ కేంద్రం వద్ద ఇద్దరు పిల్లల కోసం వెతుకుతున్నారనే సమాచారం పోలీసులకు అందింది. వెంటనే చిన్నారులను అక్కడికి తీసుకెళ్లగా, అంగన్వాడీ నిర్వాహకురాలు వారిని గుర్తుపట్టారు. అనంతరం ఆమె సమీపంలోనే ఉన్న వారి ఇంటికి పోలీసులను తీసుకెళ్లడంతో, ఉదయం నుండి బిడ్డల కోసం కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లికి పోలీసులు ఆ చిన్నారులను సురక్షితంగా అప్పగించారు. తమ ప్రాణాలను తిరిగి అప్పగించినట్లుగా భావించిన ఆ తల్లి, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏ.ఎస్.ఐ నుండి ఎస్.ఐగా పదోన్నతి సాధించిన లక్ష్మి కి అభినందనలు



నవంబర్ 21.ప్రజావాణి న్యూస్/ సంగెం అంకితభావంతో,నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ పోలీస్ శాఖలో ఎంతో మంది స్ఫూర్తిగా నిలిచిన లక్ష్మి ఏ.ఎస్.ఐ (అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్) నుండి ఎస్.ఐ (సబ్ ఇన్‌స్పెక్టర్) గా పదోన్నతి సాధించారు.ఎన్నో ఏళ్లుగా శాంతి భద్రతల పరిరక్షణలో, ప్రజా సేవలో ఆమె చేసిన కృషికి గుర్తింపుగా ఈ పదోన్నతి లభించింది.ముఖ్యంగా మహిళా సాధికారతకు ఆమె ఒక ప్రతీకగా నిలిచారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, పోలీస్ శాఖ అధికారులు మరియు గ్రామ ప్రజలు ఆమెకు ఘనంగా అభినందనలు తెలిపారు.భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.లక్ష్మికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఇంగ్లీషు ఒలంపియాడ్‌లో మంజునాథ్‌కు ప్రథమ బహుమతి

నవంబర్ 21.ప్రజావాణి న్యూస్/ సంగెం వరంగల్ నగరంలోశంభునిపేట ప్రభుత్వ పాఠశాల వేదికగా ఇంగ్లీషు లాంగ్వేజి టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంగ్లీషు ఒలంపియాడ్ పరీక్షలలో కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి మంజునాథ్ అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మహేష్ నాయక్, మండల విద్యాశాఖ అధికారి వెంకటయ్య,వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉల్లాస్ కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు తదితర అతిధుల చేతులమీదుగా విద్యార్థి మంజునాథ్ బహుమతిని అందుకోవడం జరిగింది.అక్షరాలను ఆలోచనలుగా మలిచి,ఆలోచనలను ఆత్మవిశ్వాసపు రెక్కలుగా విప్పిన మంజునాథ్ విజయం ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలకు,అక్కడి విద్యార్థుల అంకితభావానికి నిలువెత్తు నిదర్శనం. భాషా సరిహద్దులను చెరిపేస్తూ,ప్రపంచంతో సంభాషించే శక్తిని అందించే ఆంగ్ల నైపుణ్యంలో మంజునాథ్ చూపిన ప్రతిభ తోటి విద్యార్థులకు ఒక గొప్ప స్ఫూర్తిమంత్రంగా నిలుస్తోంది.ఈ విజయం వెనుక ఉన్న మార్గదర్శకత్వం ఎంతో విలువైనది. మంజునాథ్‌కు గైడ్ టీచర్‌గా నిలిచి, పట్టుదలను,పదునైన ఆలోచనను నూరిపోసిన ఉపాధ్యాయుడు పోగు అశోక్ ని , విద్యార్థి మంజునాథ్ ని పాఠశాల ఉపాధ్యాయులు రాజమౌళి,శ్రీనివాసులు, తిలక్, విశ్వప్రసాద్, గౌస్, రవీందర్ రెడ్డి,కరుణ కుమారి, పావని తదితరులు అభినందించారు.

దంతేపల్లిలో ఎల్‌నినో, వర్షాభావంపై అవగాహన కార్యక్రమం

- **జొన్నల కొనుగోళ్లలో పరిమితులు విధించవద్దు -- సర్పంచ్ మస్కూరి బాలరాజు విజ్ఞప్తి**

రామాయంపేట, నవంబర్ 21 (ప్రజావాణి ప్రతినిధి: నరేష్ నాయక్):

ఎల్‌నినో ప్రభావం, రానున్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు, ప్రజలను అప్రమత్తం చేసేందుకు రామాయంపేట మండలంలోని దంతేపల్లి, జామ్లా తండా గ్రామపంచాయతీల్లో శనివారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. దంతేపల్లి సర్పంచ్ మస్కూరి బాలరాజు, జామ్లా తండా సర్పంచ్ బాన్సీ రాథోడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాలకు ఎంపీడీవో షాజలొద్దీన్, తహసీల్దార్ రజనీకుమారి, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని



సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, వరి సాగుకు బదులుగా జొన్న, మొక్కజొన్న వంటి తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. అదేవిధంగా ఇంకుడు గుంతలు, వ్యవసాయ కుంటలు ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని అవగాహన కల్పించారు.

జొన్నల కొనుగోళ్లకు పరిమితులు వద్దు

ఈ సందర్భంగా దంతేపల్లి సర్పంచ్ మస్కూరి బాలరాజు మాట్లాడుతూ గతంలో వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు రైతులు జొన్న పంట సాగు చేసినప్పటికీ, ప్రభుత్వం పరిమితంగా కొనుగోలు చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఈసారి రైతులు పండించిన జొన్న పంట మొత్తం కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఎలాంటి పరిమితులు విధించకూడదని విజ్ఞప్తి చేశారు. రైతులకు నష్టం కలగకుండా గ్రామాలకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ తిరుపతిరెడ్డి, వ్యవసాయ అధికారి సందీప్ కుమార్, ఉపసర్పంచ్ శ్యామ్‌రాజ్, వీక్షపతి, పంచాయతీ కార్యదర్శి మాధవి, వార్డు సభ్యులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ ఐపీఎస్.

- **పోలీస్ స్టేషన్ నిర్వహణలో నిరంతర అప్రమత్తత, పారదర్శకత పాటించాలి.**





ఏటూరునాగారం నవంబర్ 21,ప్రజావాణి:ములుగు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ ఐపీఎస్ ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్ ఆవరణ, వివిధ విభాగాల నిర్వహణ, రికార్డులు, కేసుల రికార్డ్ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, రికార్డులను క్రమపద్ధతిలో నిర్వహించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి మర్యాదపూర్వకంగా స్పందించి, చట్టపరిధిలో సత్వర న్యాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.ఈ తనిఖీలో ఏఎస్పీ ఏటూరునాగారం మానస్ భట్ ఐపీఎస్,డి సి ఆర్ బి డి ఎస్ పి కిషోర్ కుమార్,సీఐ సూర్యప్రకాశ్, ఎస్ఐ మహేష్ తదితరులు పాల్గొన్నారు.ం

పెద్దపల్లి అభివృద్ధికి కొత్త రూపు!

- **ఐటీఐ కళాశాలలో వాకింగ్ ట్రాక్, జెండా చౌరస్తాలో 150 అడుగుల జాతీయ జెండా**
- **జెండా చౌరస్తా నుంచి మసీదు చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులు**
- **ఎల్‌నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి: ప్రభుత్వ విప్ విజయరమణ రావు**

పెద్దపల్లి: పెద్దపల్లి పట్టణాన్ని సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు.

పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల మైదానంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. మైదానంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న వాకింగ్ ట్రాక్, లైటింగ్ తదితర సదుపాయాలపై అధికారులతో చర్చించి, పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం పట్టణంలోని జెండా చౌరస్తాలో కొనసాగుతున్న ప్రధాన రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. జెండా చౌరస్తా నుంచి మసీదు చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులను





వేగవంతం చేయాలని సూచించారు. జెండా చౌరస్తాలో సుమారు 150 అడుగుల ఎత్తైన భారీ జాతీయ జెండాను ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలించారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా తొలగించిన పాత కమాన్ స్థానంలో త్వరలోనే ఆధునిక హంగులతో నూతన కమాన్ నిర్మిస్తామని తెలిపారు. పెద్దపల్లి పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

అనంతరం పెద్దపల్లి మండలంలోని నిట్టూరు, నిమ్మనపల్లి గ్రామాల్లో సింగిల్ విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రభుత్వ విప్ విజయరమణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, కేంద్రాల్లో కల్పించిన సదుపాయాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని సంబంధిత నిర్వాహకులకు సూచించారు.

ఎల్‌నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

రాబోయే కాలంలో ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులందరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విజయరమణ రావు సూచించారు. వ్యవసాయ సాగు విషయంలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు.

ఈ కార్యక్రమాల్లో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్,నూగిల్లా మల్లయ్య మున్సిపల్ కమిషనర్, ఆకుల వెంకటేష్ పట్టణ కౌన్సిలర్లు,మంథని నర్సింగ్ కొమ్ము సుధాకర్ సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లు, ముత్యాల నరేష్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు,భూతగడ్డ సంపత్ కాంగ్రెస్‌నాయకులు,కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయం తనిఖీ పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి ఏసీపీ సతీష్ బాబు



ప్రజావాణి శాయంపేట సర్కిల్ పోలీస్ కార్యాలయాన్ని ఏసీపీ సతీష్ బాబు వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం లోని వివిధ రికార్డులు, కేసుల దర్యాప్తు వివరాలు, పెండింగ్ కేసులు, క్రైమ్ రికార్డులు, స్టేషన్ నిర్వహణతో పాటు పోలీస్ సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, ఇతర పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఆదేశించారుశాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, ఎస్ఐ పరమేశ్వర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

నేరాల నియంత్రణకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలి

- **ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలి.. కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి**

గరిడేపల్లి, నవంబర్ 21 (ప్రజావాణి):పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి పోలీస్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా శనివారం ఆయన సందర్శించి వివిధ విభాగాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది పరేడ్‌ను పరిశీలించి, వారి విధుల నిర్వహణ తీరును సమీక్షించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, క్రైమ్ ఫైల్స్, పెండింగ్ కేసులు, కేసుల పురోగతిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని డీఎస్పీ సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాల విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మండల కేంద్రంతో పాటు





గ్రామీణ ప్రాంతాల్లో దొంగతనాల నివారణకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, అతివేగాన్ని నియంత్రించడం వంటి జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు

ప్రజల రక్షణ, భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ, ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి చట్టపరిధిలో సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావాలని అన్నారు.ఈ వార్షిక తనిఖీ కార్యక్రమంలో హుజూర్‌నగర్ సీఐ చారమండ రాజు, గరిడేపల్లి ఎస్సై శ్రీకాంత్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ బీమా కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీడీఓ,తహసీల్దార్, సర్పంచ్



చిన్నంబావి, నవంబరు 21 ప్రజావాణి :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ బీమా కార్యక్రమాన్ని చిన్నంబావి మండల పరిధిలోని వెలగొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ప్రారంభించారు. ఎంపీడీఓ సూర్ణ ఆదర్శ్ గౌడ్, తహసీల్దార్శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ శరత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఇందిరమ్మ కుటుంబ బీమా కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈపథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమనిపేర్కొన్నారు. కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా భరోసాకల్పించేందుకు ఈ పథకం దోహదపడుతుందని వివరించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ శరత్ రెడ్డి సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి,పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

టాటా ఏస్ ఆటో -- బైక్ ఢీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు!

- ప్రమాదంలో కుడికాలు, కుడిచేయికి తీవ్ర గాయాలు..
- క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించిన 108 అంబులెన్స్ సిబ్బంది



చిన్నంబావి, ప్రజావాణి నవంబరు 21:చిన్నంబావి మండల కేంద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలో టాటా ఏస్ ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో పెద్ద దగడ గ్రామానికి చెందిన చంద్రమోహన్ (46) తీవ్రంగాగాయపడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన కుడికాలు, కుడిచేయికి తీవ్ర గాయాలయ్యాయి.ప్రమాదం జరిగిన సమయంలో అటుగా వెళ్తున్న స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. దీంతో చిన్నంబావి మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన చంద్రమోహన్‌కు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ సందర్భంగా అంబులెన్స్ పైలట్ రాఘవేంద్ర, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ నరేందర్ వివరాలు వెల్లడించారు. ప్రమాదసమయంలో వెంటనే స్పందించి 108కు సమాచారం అందించిన స్థానికులనుపలువురు అభినందించారు.

మండల స్థాయి చెకుముకి పరీక్షలో సెయింట్ డాన్ బాస్కో పాఠశాలకు ప్రథమ స్థానం

- ప్రతిభ చాటిన విద్యార్థినులు.. పాఠశాల యాజమాన్యం అభినందనలు





జోగిపేట ، నవంబర్ 21 ، మన ప్రజావాణి ، జిల్లా ప్రతినిధి మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి సైన్స్ పరీక్షలో జోగిపేట సెయింట్ డాన్ బాస్కో హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించి ప్రతిభ చాటారు.ఈ పరీక్షలో పాఠశాలకు చెందిన వై. ప్రగతి (10వ తరగతి), వి. అక్షిత (9వ తరగతి), చి. లిఖిత (8వ తరగతి) విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు.విద్యార్థినుల విజయంపై పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ విద్యార్థులు విద్యా, విజ్ఞాన రంగాల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా

- ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా.
- పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత.
- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం.
- ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి చేతుల మీదుగా ప్రారంభం.



కుమురం భీం జిల్లా, ప్రజావాణి): రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని శనివారం జిల్లాలో ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా కలెక్టర్ హరిత ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించనున్నారు. కుటుంబ పెద్దకు అనుకోని మరణం సంభవించినప్పుడు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా బాధిత కుటుంబానికి అండగా నిలవడమే పథకం ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కేంద్రాలను జిల్లా కలెక్టర్‌తో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం నవంబర్ 21మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో అమలవుతున్న ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి -BLR అధికారులకు సూచించారు.
ఈరోజు మిర్యాలగూడ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కేంద్రాలను జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ IAS తో కలిసి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సందర్శించి, నమోదు ప్రక్రియను పరిశీలించారు...
మొదట మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామం, గంద్రవాణిగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాలను సందర్శించి, పథకం నమోదు విధానం, ప్రజలకు అందుతున్న సేవలు, నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు...
అనంతరం దామరచర్ల మండల కేంద్రంలోని నమోదు కేంద్రాన్ని పరిశీలించారు.
అలాగే మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ ప్రాంతంలో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ IAS తో కలిసి పర్యటించి, ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు... అర్హులైన కుటుంబాలన్నీ ఈ పథకంలో నమోదు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించారు...
ఈ సందర్భంగా ఎమ్మెల్యే BLR మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడమే ప్రభుత్వ ధ్యేయమని, ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి భద్రత కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ..అర్హులైన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నమోదు చేసుకోవాలని కోరారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ , వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ , =ణూ రమణారెడ్డి , మున్సిపల్ కమిషనర్ శ్రీజ రెడ్డి , సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

ప్రాణాలతో చెలగాటం.. నిబంధనలకు తూట్లు!

- పెనుగొండ కాకతీయ గ్రానైట్స్ క్వారీలో భద్రతా ప్రమాణాలు గాలికి!
- ఫోర్‌మెన్, బ్లాస్టింగ్ వేట్ లేకుండానే ఇష్టారాజ్యంగా పేలుళ్లు!
- సర్వే నంబర్ 519/1లో రైతులకు '1-బి' నిలిపివేత.. క్వారీకి మాత్రం అనుమతులా?
- అధికారుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం!





కేసముద్రం, నవంబర్ 21,ప్రజావాణి.మండలంలోని పెనుగొండ గ్రామ శివారులో ఉన్న 'కాకతీయ గ్రానైట్స్' క్వారీ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా, అర్హులైన సాంకేతిక సిబ్బంది లేకుండానే విచ్చలవిడిగా బ్లాస్టింగ్ (పేలుళ్లు) నిర్వహిస్తున్నారని స్థానిక ప్రజలు, రైతులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు.
నిబంధనలు బేఖాతరు.. భద్రత గాలికి!
మైనింగ్ నిబంధనల ప్రకారం, క్వారీలో పనులు జరిగేటప్పుడు కచ్చితంగా అర్హత కలిగిన ఫోర్‌మెన్, పేలుళ్ల పర్యవేక్షణకు బ్లాస్టింగ్ మేట్ ఉండాలి. కానీ, సదరు క్వారీలో వీరెవరూ లేకుండానే ఇష్టారాజ్యంగా పేలుళ్లు జరుపుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, క్వారీలో విద్యుత్ (ఎలక్ట్రికల్) భద్రత అత్యంత ప్రమాదకరంగా మారింది. కనీసం ఎలక్ట్రికల్ ఇంజనీర్ పర్యవేక్షణ లేకుండా, ప్రమాదకరమైన హై-వోల్టేజ్ విద్యుత్ తీగల మధ్య కార్మికులతో పనులు చేయిస్తుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది.
అనుమతులపై అనుమానాలు.. పంటలకు నష్టం!
అసలు ఈ క్వారీకి బ్లాస్టింగ్ నిర్వహించే అనుమతి ఉందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. క్వారీ నుండి వెలువడుతున్న భారీ శబ్దాలు, దుమ్ముధూళి కారణంగా పర్యావరణం దెబ్బతినడమే కాకుండా, చుట్టుపక్కల ఉన్న పంట పొలాలు తీవ్రంగా నష్టపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాలకు వెళ్లే దారులు కూడా మూసుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.
రైతులకో న్యాయం.. క్వారీకో న్యాయమా?
సర్వే నంబర్లు 70, 519/1 లోని భూములకు సంబంధించి కాలుష్య నియంత్రణ మండలి నుండి ఈసీ, సీఎఫ్ఈ, సీఎఫ్ఓ, అనుమతులు ఏ విధంగా జారీ చేశారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు సర్వే నంబర్ 519లోని రైతులకు ప్రభుత్వం '1-బి' పత్రాలు ఇవ్వడం నిలిపివేసిందని, దీనివల్ల తమకు బ్యాంకు రుణాలు కూడా అందడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతుల భూములకు వర్తించని నిబంధనలు, క్వారీ నిర్వాహకులకు ఎలా వర్తిస్తాయని, ఏ రూల్స్ ప్రకారం ఈ క్వారీ నడుస్తోందని ప్రజలు నిలదీస్తున్నారు.మైనింగ్, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి, మరియు ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులు తక్షణమే స్పందించి సదరు క్వారీలో తనిఖీలు నిర్వహించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.నిబంధనలు ఉల్లంఘించిన క్వారీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని, కార్మికుల ప్రాణాలను, రైతుల పంట పొలాలను కాపాడాలని కోరుతున్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



చిలుకూరు,నవంబర్ 21(ప్రజావాణి):చిలుకూరు మండలంలో సూర్యాపేట జిల్లా బిజేపి యసి మోర్చా పార్టీ శ్రేణులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించే గొప్ప ప్రజాస్వామ్య గ్రంథమని జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.భారత రాజ్యాంగం 1949 నవంబర్ 26న ఆమోదించబడి, 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చిందని తెలిపారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు ప్రతి పౌరుడికి గౌరవప్రదమైన జీవితాన్ని అందించేందుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. కుల, మత, ప్రాంత, భాషా భేదాలు లేకుండా ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించడం రాజ్యాంగ ప్రధాన ఉద్దేశమని వివరించారు..
ముఖ్యంగా సమాజంలో అణగారిన వర్గాలు, దళితులు, పేదలు, బలహీన వర్గాలకు విద్య, ఉపాధి, సామాజిక న్యాయం అందించడంలో రాజ్యాంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులో ఉండాలని, కులవివక్ష, అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలను పూర్తిగా నిర్మూలించాలని పిలుపునిచ్చారు.రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకోవడంతో పాటు పౌరులుగా మన బాధ్యతలను కూడా నిర్వర్తించాలని తెలిపారు. దేశ సమగ్రతను కాపాడటం, జాతీయ ఐక్యతను పెంపొందించడం, ఇతరుల హక్కులను గౌరవించడం, సోదరభావంతో మెలగడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు బొజ్జ పరుశురాం మాదిగ, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు మీసాల మార్కండేయ, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి చింత్రియాల సురేందర్ మాదిగ, జిల్లా ఎస్సీ మోర్చా సహాయ ప్రధాన కార్యదర్శి రోహిత్, జిల్లా ఎస్సీ మోర్చా ఐటీ సెల్ అధ్యక్షులు బొజ్జ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

23న మహా పాదయాత్రను విజయవంతం చేయాలి

- బండి సంజయ్‌కు మద్దతుగా కరీంనగర్ మహా పాదయాత్రలో పాల్గొనాలని పిలుపు
- కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దడమే బీజేపీ లక్ష్యం
- మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి ఆధ్వర్యంలో సన్నాహ సమావేశం



ప్రజావాణి,ముస్తాబాద్ ఈ నెల 23న కరీంనగర్‌లో నిర్వహించనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో ని మహేశ్వరి గార్డెన్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహ సమావేశానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1995లోనే ముస్తాబాద్‌లో జడ్పీటీసీగా ఎంపీటీసీగా బీజేపీ నుండి వ్యవహరించిన అనుభవాన్ని ప్రస్తావిస్తూ, ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దడమే బీజేపీ లక్ష్యమని తెలిపారు.కరీంనగర్‌లో నిర్వహించే మహా పాదయాత్రలో బండి సంజయ్‌కు మద్దతుగా భారీ సంఖ్యలో పాల్గొని పార్టీ బలాన్ని చాటాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ ఎస్ఐఆర్ కార్యక్రమంపై దుష్ప్రచారం చేస్తోందని నాయకులు విమర్శించారు. విదేశాల నుంచి వచ్చిన వారికి ఓటు హక్కు కాంగ్రెస్ పార్టీ కల్పిస్తుందని అన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో మృతి చెందిన వారి వివరాలనుతొలగించిందని నాయకులు గమనించాలని సూచించారుఈ నెల 23న నిర్వహించనున్న మహా పాదయాత్రను విజయవంతం చేసేందుకు బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నాయకులు కోరారు.
ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, నక్కదసారి రవి, మెంగని శ్రీనివాస్,జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మీసా సంజీవ్, మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపి కృష్ణ, బచ్చేలి మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఆపద వేళ పేదింటికి 'ఇందిరమ్మ' అభయహస్తం!

- కష్టాల్లో ఉన్న కుటుంబాలకు కొండంత అండగా జీవిత బీమా పథకం!
- ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలి..తహసీల్దార్ వివేక్ పిలుపు!
- కల్వల గ్రామంలో ప్రజల మనసు గెలిచిన అవగాహన సదస్సు!



కేసముద్రం, నవంబర్ 21,ప్రజావాణి.కష్టపడితేనే కానీ పూట గడవని నిరుపేద కుటుంబాల్లో అనుకోని ఆపద వస్తే ఆ ఇల్లు అంధకారంలోకి జారిపోతుంది. ఇంటి పెద్దదిక్కును కోల్పోయినా, అనుకోని ప్రమాదం జరిగినా ఆ కుటుంబాన్ని ఆదుకునే వారెవరు? ఈ ప్రశ్నకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన భరోసానే 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం. పేదింటి కన్నీళ్లు తుడిచి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకంపై శనివారం కేసముద్రం మండలం కల్వల గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన సదస్సు జరిగింది.
ప్రతి పేదవాడికి భద్రతే ప్రభుత్వ ధ్యేయం..!
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల తహసీల్దార్ వివేక్, గ్రామస్తులను ఉద్దేశించి ఎంతో ఆత్మీయంగా మాట్లాడారు.ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం వెనుక పేదవాడి సంక్షేమమే దాగి ఉంటుంది. అనుకోని విపత్తు ఎదురైనప్పుడు ఏ ఒక్క పేద కుటుంబం కూడా రోడ్డున పడకూడదనే ఉదాత్త ఆశయంతోనే ముఖ్యమంత్రి ఈ జీవిత బీమా పథకానికి రూపకల్పన చేశారు.ఇది కేవలం ఒక పథకం మాత్రమే కాదు..ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం ఇస్తున్న ఒక భరోసా అని ఆయన వివరించారు.
అవగాహనతోనే అసలైన ప్రయోజనం..!
ప్రభుత్వ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందినప్పుడే ఆ పథకానికి సార్థకత చేకూరుతుందని తహసీల్దార్ పేర్కొన్నారు. దళారుల ప్రమేయం లేకుండా, పథకం విధివిధానాలపై గ్రామస్తులంతా పూర్తి అవగాహన పెంచుకుని, తప్పనిసరిగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అధికారులు కూడా క్షేత్రస్థాయిలో ప్రజలకు అండగా ఉండి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో జరిగిన ఈ సదస్సుకు కల్వల గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల సుజాత రామచంద్రయ్య, ఉప సర్పంచ్ పెదగాని రవి, గండి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సాదుల మనోజ్, గ్రామ జీపీవో బాలకృష్ణ, కందిపాటి నాగరాజు, ప్రశాంత్‌తో పాటు పంచాయతీ సిబ్బంది, మహిళలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఎల్ నినో ప్రభావం -- జలసిరి కళాబృందం అవగాహన కార్యక్రమం

- గ్రామ సర్పంచ్ కూరాకుల చినరామయ్య



ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం నవంబర్ 21ఈరోజు అడవిదేవులపల్లి గ్రామంలో ఎల్ నినో ప్రభావం, వాతావరణ మార్పులు మరియు జల సంరక్షణపై జలసిరి కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.అలాగే VB-G RAM G ఉపాధి హామీ పథకం గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ కూరాకుల చినరామయ్య పంచాయతీ సెక్రటరీ పి. దుర్గయ్య TA శ్రాధ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీ గోడుగు మధు ఉప సర్పంచ్ బిళ్లకంటి రేణుక VB-G RAM G మేట్స్ గ్రామ ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తూ, నీటి సంరక్షణ మరియు ఉపాధి హామీ పథకం ప్రాముఖ్యతను వివరించడం జరిగింది.ఇట్లు కూరాకుల చినరామయ్య గ్రామ సర్పంచ్ అడవిదేవులపల్లి

జనయేత్రీ ఫౌండేషన్ సేవలు పొందిన వారి ఆశీస్సులు దివెనలు నా కుమార్తే కి తోడుగా ఉండాలి

● డా. మునిర్‌అహ్మద్ షరీఫ్

ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం నవంబర్ 21మిర్యాలగూడ కుమార్తె జన్మదిన వేడుకలకు కొత్త అర్థం.. నిరుపేదలకు అల్పాహారం అందించి ఆదర్శంగా నిలిచిన డా. మునిర్ అహ్మద్ షరీఫ్ జనయేత్రీ ఫౌండేషన్ ఐదేళ్ల సేవా ప్రస్థానంలో మరో మానవీయ కార్యక్రమం మిర్యాలగూడ, సాధారణంగా పిల్లల పుట్టినరోజు వచ్చిందంటే కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య కేక్ కటింగ్‌లు, వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. కానీ తన కుమార్తె జన్మదినాన్ని సమాజ సేవకు అంకితం చేస్తూ, నిరుపేదలు, వృద్ధులు, నిస్సహాయుల ఆశీస్సులే తన కుమార్తెకు నిజమైన సంపదగా భావిస్తున్న వ్యక్తి జనయేత్రీ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు, లయన్ డా. మునిర్ అహ్మద్ షరీఫ్.

తన కుమార్తె సాధియా మెహక్ జన్మదినాన్ని పురస్కరించుకుని మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగుల వెంట ఉండే సహాయకులకు అల్పాహారం పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.మిర్యాలగూడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగుల సహాయకులకు అల్పాహారం అందించే సేవా కార్యక్రమంలో భాగంగా, సాధియా మెహక్ జన్మదినం సందర్భంగా డా. మునిర్ అహ్మద్ షరీఫ్ ప్రత్యేకంగా అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 8 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రిలో రోగుల సేవలో ఉంటూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి సహాయకులకు అల్పాహారం అందించారు.

ఆవంతీపురంలోని ప్రభుత్వ బధీరుల పాఠశాలలో విద్యార్థులకు పండ్ల పంపిణీ మరియు పరిక్ష సామాగ్రి అందించారు

జన విజ్ఞాన వేదిక ద్వారా విద్యార్థులకు పెన్నులు పంపిణీ





చేశారు పుట్టినరోజు కానుకగా సేవా సంస్థ.. ఆశీస్సులే అసలైన బహుమతి! డా. మునిర్ అహ్మద్ షరీఫ్ సేవా ఆలోచన వెనుక ఒక ప్రత్యేకమైన భావోద్వేగం ఉంది. తన కుమార్తె జన్మదినాన్ని కేవలం కుటుంబ వేడుకగా కాకుండా, సమాజానికి ఉపయోగపడే రోజుగా మార్చాలనే సంకల్పంతో జనయేత్రీ ఫౌండేషన్ సేవా ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు.తన కుమార్తెకు ఆస్తిపాస్తులు, విలువైన బహుమతులు ఇవ్వడం కంటే సమాజంలోని వృద్ధులు, నిరుపేదలు, అనాథలు, నిస్సహాయుల ఆశీస్సులు, దీవెనలు జీవితాంతం ఉండాలన్నదే ఆయన ఆకాంక్ష.

ఒక చిన్నారి పుట్టినరోజు సందర్భంగా ప్రారంభమైన ఈ సేవా ఆలోచన నేడు ఐదేళ్ల సుదీర్ఘ సేవా ప్రస్థానంగా ఎదిగి, ఆరో సంవత్సరంలోకి అడుగుపెట్టడం విశేషం.

కులమతాలకు అతీతంగా పేదలకు వైద్య సహాయం, ఆర్థిక సహకారం, రక్తదానం, ఆకలితో ఉన్నవారికి ఆహారం, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం వంటి అనేక సేవా కార్యక్రమాలను జనయేత్రీ ఫౌండేషన్ నిర్వహిస్తోంది.

ఈ సందర్భంగా డా. మునిర్ అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ..

లి"నా కుమార్తె సాధియా మెహక్ పుట్టినరోజున పేదలకు, నిస్సహాయులకు ఏదైనా చేయగలిగితే అదే నాకు నిజమైన ఆనందం.లి మా అమ్మాయి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని, మంచి మనసుతో ఇతరులకు సహాయం చేసే వ్యక్తిగా ఉండాలని కోరుకుంటున్నాను. వృద్ధులు, అనాథలు, నిరుపేదలు మనస్ఫూర్తిగా అందించే ఆశీస్సుల కంటే గొప్ప జన్మదిన కానుక మరొకటి ఉండదు. అందుకే ప్రతి జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవాలని నిర్ణయించుకున్నాను" జనయేత్రీ ఫౌండేషన్ అవిర్భావదినోత్సవం సందర్భంగా రేండు తెలుగు రాష్ట్రాలలో జనయేత్రీ ఫౌండేషన్ సభ్యులు వివిధ సేవ కార్యక్రమాలు చేయడం జరిగింది వారందరికీ పేరు పేరున ధన్యవాదములు అని తెలిపారు.జనయేత్రీ ఫౌండేషన్ ఐదేళ్ల ప్రయాణానికి సహకరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు, దాతలు, మిత్రులు, శ్రేయోభిలాషులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.కుమార్తె పుట్టినరోజున వందలాది మందికి ఆనందాన్ని పంచడం.తన సంతోషాన్ని ఇతరుల సంతోషంలో వెతుక్కోవడం అని డా.మునిర్ అహ్మద్ షరీఫ్ అన్నారు

ఏఎస్సై నుంచి ఎస్సైగా పదోన్నతి పొందిన ఎం. లక్ష్మికి అభినందనలు



నవంబర్ 21 ప్రజావాణి న్యూస్ /సంగెం సంగెం పోలీస్ స్టేషన్‌లో విశేష సేవలందించిన ఎం. లక్ష్మికి పదోన్నతి.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సంగెం పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ASI)గా విధులు నిర్వహించిన ఎం. లక్ష్మి సబ్ ఇన్‌స్పెక్టర్ (SI)గా పదోన్నతి పొందారు.సంగెం పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన కాలంలో ఎం. లక్ష్మి తన విధులను ఎంతో క్రమశిక్షణతో, అంకితభావంతో, బాధ్యతాయుతంగా నిర్వహించి ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, పోలీస్ స్టేషన్‌లో రోజువారీ విధుల నిర్వహణలో చురుకైన పాత్ర పోషించారు.ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ శ్రీమతి ఎన్. శ్వేత, ఐ.పీ.ఎస్. పదోన్నతి పొందిన ఎం. లక్ష్మిని అభినందించి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.అలాగే సంగెం ఎస్సై కె. వంశీకృష్ణ ఎం. లక్ష్మికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, సంగెం పోలీస్ స్టేషన్‌లో ఆమె అందించిన సేవలు అభినందనీయ మని, విధుల పట్ల ఆమె చూపిన అంకితభావం ఇతర సిబ్బందికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు .పదోన్నతి పొందిన ఎం. లక్ష్మికి సంగెం పోలీస్ స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్సైగా ఎన్నికైన లక్ష్మికి ప్రజాప్రతినిధులు పత్రికా మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు

విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకే 'స్ఫూర్తి'

● చెన్నారావుపేట తహసీల్దార్ దిలావర్ మహ్మద్ ఆబిద్ అలీ





చెన్నారావుపేట నవంబర్ 21ప్రజావాణి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో భయాన్ని తొలగించి, వారిలో భరోసా, ఆత్మస్థైర్యం నింపేందుకే జిల్లా కలెక్టర్ 'స్ఫూర్తి' కార్యక్రమాన్ని ప్రారంభించారని చెన్నారావుపేట తహసీల్దార్ దిలావర్ మహ్మద్ ఆబిద్ అలీ అన్నారు. శనివారం మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన 'స్ఫూర్తి' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మమేకమవుతున్నట్లు తెలిపారు. చదువుతో పాటు జీవితంలో ఎదురయ్యే సమస్యలు, సవాళ్లను ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలో వివరించారు. వైఫల్యాలకు కుంగిపోకుండా వాటి నుంచే స్ఫూర్తి పొంది ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వంటశాలను, కూరగాయలను, వంటలను తనిఖీ చేసి నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చిట్టే జ్యోతి, ఆర్ఐ రషీద్,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో చైనా మాంజా కలకలం.. రూ.25 వేల విలువైన సరుకు సీజ్

- బట్టల దుకాణం మాటున నిషేధిత చైనా మాంజా విక్రయాలు.. టాస్క్‌ఫోర్స్ మెరుపుదాడి
- చేతన్ మెన్స్ వేర్ దుకాణంపై ఆకస్మిక తనిఖీలు.. యజమాని చేతన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మేడ్చల్ (ప్రజా వాణి):- పక్షుల ప్రాణాలకు, వాహనదారుల భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్న నిషేధిత చైనా మాంజా విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. నిషేధం ఉన్నప్పటికీ అక్రమంగా చైనా మాంజాను నిల్వ ఉంచి విక్రయిస్తున్న వారిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం మేడ్చల్ పట్టణంలో నిర్వహించిన మెరుపుదాడిలో రూ.25 వేల విలువైన చైనా మాంజాను స్వాధీనం చేసుకోవడం స్థానికంగా కలకలం రేపింది. మేడ్చల్ పట్టణంలోని స్ఫూర్తి జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న 'చేతన్ మెన్స్ వేర్' బట్టల దుకాణంలో నిషేధిత చైనా మాంజా విక్రయిస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసులు శుక్రవారం సదరు దుకాణంపై ఆకస్మిక దాడి నిర్వహించి తనిఖీలు చేపట్టారు. ఈ



సందర్భంగా దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన చైనా మాంజాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మాంజా విలువ సుమారు రూ.25 వేలుగా పోలీసులు అంచనా వేశారు. బట్టల దుకాణం మాటున నిషేధిత మాంజా విక్రయిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు దుకాణ యజమాని చేతన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సబ్ ఇన్‌స్పెక్టర్ సాయిరాం రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి చైనా మాంజాను విక్రయించడం, నిల్వ చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. నిషేధిత మాంజా విక్రయాలకు పాల్పడే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.చైనా మాంజా సాధారణ దారం కంటే ప్రమాదకరంగా ఉండటంతో పతంగులు ఎగురవేసే సమయంలోనే కాకుండా రహదారులపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు సైతం ప్రాణాపాయం కలిగించే అవకాశం ఉంది. అంతేకాకుండా చెట్లపై ఎగురుతున్న పక్షులు ఈ మాంజాకు చిక్కుకుని గాయపడటం, ప్రాణాలు కోల్పోవడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. పర్యావరణానికి, ప్రజల భద్రతకు హానికరమైన ఈ నిషేధిత మాంజా విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. మేడ్చల్ పట్టణంలో నిర్వహించిన ఈ దాడితో నిషేధిత చైనా మాంజా విక్రయదారుల్లో ఆందోళన నెలకొంది. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే ఇలాంటి అక్రమ వ్యాపారాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. నిషేధిత చైనా మాంజా విక్రయాలు లేదా నిల్వలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని, పతంగులు ఎగురవేసేందుకు సురక్షితమైన దారాలను మాత్రమే వినియోగించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి విజ్ఞాన ప్రదర్శనకు ఎంపికైన కృష్ణవేణి విద్యార్థిని





రాయికల్, నవంబర్ 21(ప్రజావాణి)జగిత్యాల జిల్లా కేంద్రంలో నవంబర్ 19, 20, 21 తేదీల్లో నిర్వహించిన జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శనలో పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు.ఈ ప్రదర్శనలో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని నీలి అగస్త్య వినూత్నంగా రూపొందించిన సౌరశక్తి చెక్క చిన్న వేడి పెట్టె నమూనాను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకుంది. ఈ నమూనా జిల్లా స్థాయిలో ఎంపికై రాష్ట్రస్థాయి విజ్ఞాన ప్రదర్శనకు అర్హత సాధించింది.ఈ సందర్భంగా జగిత్యాల ఓల్డ్ హై స్కూల్ లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాము,ఓల్డ్ హై స్కూల్ ప్రధానాచార్యులు చంద్రకళ, జిల్లా విజ్ఞానాధికారి మచ్చ రాజశేఖర్, గ్రంథాలయ అధ్యక్షులు దినేష్, వార్డు సభ్యులు లక్ష్మి మరియు పట్టభద్ర కళాశాల ప్రధానాచార్యులు నాగభూషణం చేతుల మీదుగా విద్యార్థిని ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని నీలి అగస్త్యను పాఠశాల నిర్వాహకులు జూపల్లి తిరుపతిరావు, ప్రధానాచార్యులు జూపల్లి వేణుగోపాల్ రావు మరియు ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, శాస్త్రీయ ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించడమే తమ పాఠశాల లక్ష్యమని పాఠశాల యాజమాన్యం పేర్కొన్నారు.

విద్యాశాఖ ఎఫ్.ఆర్.ఏ.ఎస్ యాప్ సమస్యలను పరిష్కరించాలి..

- యాప్‌ను మార్చాలి లేదా, ప్రత్యామ్నాయ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలి..
- టిఈపిటిఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యంపీ ఢ నాయక్ మాలోత్ ప్రతాప్ సింగ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూకర రాంబాబు

భద్రాద్రి జిల్లా బ్యూరో, నవంబర్ 21 (మన ప్రజావాణి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు నమోదుకు ప్రభుత్వం ఎఫ్ఆర్ఏఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టమ్) విధానాన్ని అమలు చేయడం స్వాగతించదగిన విషయం. ప్రస్తుతం అమలులో ఉన్న ఎఫ్ఆర్ఏఎస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేసే సమయంలో, రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో నెట్‌వర్క్ సిగ్నల్, ఫేస్ రికగ్నిషన్ సమస్యలు తలెత్తుతుండటంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు, కొన్ని మండల కేంద్రాల్లో సరైన నెట్‌వర్క్ సదుపాయం లేకపోవడంతో, ఉపాధ్యాయులు సమయానికి హాజరు నమోదు చేయలేకపోతున్నారు. విధులకు సకాలంలో హాజరైనప్పటికీ ఎఫ్ఆర్ఏఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టమ్) యాప్‌లో సాంకేతిక సమస్యల కారణంగా హాజరు నమోదు కాకపోవడం వల్ల ఉద్యోగులు ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల హాజరు నమోదు విషయంలో కూడా ఎలాంటి సాంకేతిక అంతరాయాలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలలకు మెరుగైన సాంకేతిక సదుపాయాలు కల్పించాలి. ట్రైబల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని క్రింది సమస్యలకు పరిష్కార చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తోంది.



1. ప్రస్తుతం అమలులో ఉన్న ఎఫ్ఆర్ఏఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టమ్) యాప్‌లో ఎదురవుతున్న నెట్‌వర్క్, ఫేస్ రికగ్నిషన్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.
2. ప్రస్తుత ఎఫ్ఆర్ఏఎస్ యాప్ ద్వారా సమస్యలు పరిష్కారం కాకపోతే, ఉన్న యాప్‌ను పూర్తిగా మార్చి, అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా పనిచేసే మెరుగైన ప్రత్యామ్నాయ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలి.
3. రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలు, మారుమూల, గిరిజన ప్రాంతాల్లో ఎఫ్ఆర్ఏఎస్ హాజరు నమోదుకు ఎలాంటి నెట్‌వర్క్ అంతరాయాలు లేకుండా అవసరమైన సాంకేతిక సదుపాయాలు కల్పించాలి.
4. నెట్‌వర్క్ లేదా యాప్ సమస్యల కారణంగా హాజరు నమోదు కానప్పుడు ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ఎలాంటి ప్రతికూల చర్యలు తీసుకోకుండా, ప్రత్యామ్నాయ హాజరు నమోదు విధానాన్ని అమలు చేయాలి.
5. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల



హాజరు నమోదు కూడా ఎలాంటి అంతరాయం లేకుండా జరిగేలా చర్యలు తీసుకోవాలి.

సాంకేతిక విధానాల వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఇబ్బందులు కలగకూడదు. ఎఫ్ఆర్ఏఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టమ్) విధానం సజావుగా పనిచేసేలా ప్రస్తుత యాప్‌లోని సమస్యలను పూర్తిగా పరిష్కరించాలి. అవసరమైతే ప్రస్తుత యాప్‌ను మార్చి మెరుగైన ప్రత్యామ్నాయ యాప్‌ను ప్రవేశపెట్టాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఎఫ్ఆర్ఏఎస్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించి, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, ట్రైబల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తోందని, ట్రైబల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ యంపీ నాయక్ మాలోత్ ప్రతాప్ సింగ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూకర రాంబాబు తెలిపారు.

పొలంలో విగతజీవిగా యువకుడు.. గ్రామంలో విషాదం.

● బురద నీటిలో పడి యువకుడి మృతి



ప్రజావాణి,గంభీరావుపేట మృత్యువు ఫీట్స్ రూపంలో ఓ యువకుడిని బలి తీసుకున్న ఘటన గంభీరావుపేట మండలం దోసెలగూడెం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది.

ఎస్సై ఆర్. బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం దోసెలగూడెం గ్రామానికి చెందిన కడారి లక్ష్మి చిన్న కుమారుడైన సురేష్(30) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతడికి వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో రెండేళ్ల క్రితం భార్య పిల్లలతో కలిసి వేరే ప్రాంతంలో నివసిస్తోంది. అప్పటి నుంచి సురేష్ మద్యానికి బానిసై గ్రామంలో తిరుగుతుండేవాడని, అతడికి ఫిట్స్ వ్యాధి కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ఈ క్రమంలో శనివారం ఉదయం 10:30 గంటల సమయంలో గ్రామానికి చెందిన దండు చంద్రం ఫోన్ చేసి, తన వ్యవసాయ పొలంలో సురేష్ బోర్లా పడి మృతి చెంది ఉన్నాడని అతడి తల్లికి సమాచారం ఇచ్చాడు. దీంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న తల్లి పరిశీలించగా, సురేష్ బురద నీటిలో పడి మృతి చెంది ఉన్నట్లు గుర్తించింది.మద్యం మత్తులో నడుస్తున్న సమయంలో ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు పొలంలోని బురద నీటిలో పడి ఊపిరాడక మృతి చెంది ఉంటాడని తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తన కుమారుడి మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని తెలిపింది. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వాటర్ వర్క్స్ జీఎం సంతోష్ కి ధన్యవాదాలు -- మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్



మల్కాజిగిరి ప్రతినిధి (ప్రజావాణి నవంబర్ 21)
సమస్య చెప్పిన వెంటనే స్పందించి పరిష్కరించిన జీఎం సంతోష్ కి ధన్యవాదాలు.తెలిపారు మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఉమ్మడి చిలకనగర్ డివిజన్లోని బీరప్ప గడ్డ శ్రీనగర్ కాలనీలో చాలా రోజుల నుండి వాటర్ పొల్యూషన్ తో ఇబ్బంది పడుతున్న స్ట్రీట్ నంబర్ 1,2,3 వాసులు మరియు అధ్యక్షులు ఓం ప్రకాష్ గారు మాజీ కార్పొరేటర్ గీత ప్రవీణ్ కి పొల్యూటెడ్ వాటర్ వచ్చే విషయాన్ని తెలిపిన వెంటనే , గీత ప్రవీణ్ వాటర్ వర్క్స్ జీఎం సంతోష్ కి కొత్త వాళ్ళు ఏర్పాటు చేసి పొల్యూషన్ వచ్చే విధులలో వెంటనే మరమ్మతులు చేయించమని కోరడం జరిగింది. చెప్పిన వెంటనే స్పందించి కొత్త వాల్స్ మరియు పైప్ లైన్ ఏర్పాటు చేసిన జీఎం సంతోష్ కి మరియు మేనేజర్ కిష్టయ్య కి మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ధన్యవాదాలు తెలిపారు.
కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, శ్రీనగర్ కాలనీ అధ్యక్షులు ఓం ప్రకాష్, సభ్యులు ప్రభాకర్ రెడ్డి, అంజన్న, ఉపేందర్ రెడ్డి, శ్రీహరి రెడ్డి వాటర్ వర్క్స్ సిబ్బంది శేఖర్ లైన్మెన్లు మొదలగువారు పాల్గొన్నారు.

శ్రీ అయ్యప్ప మహా పడిపూజ

- పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



మల్కాజ్‌గిరి ప్రతినిధి (ప్రజావాణి నవంబర్ 21)
మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మౌలాలి డివిజన్‌లోని సఫిల్ గూడ, పీబీ సూర్య నగర్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జె.ఎ.సి. వెంకన్న, మేకల రాము యాదవ్, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, వంశీ ముదిరాజ్, ఉస్మాన్, నవాబ్, దినేష్, మారుతి ప్రసాద్, విజయ్ రెడ్డి, అద్వైత్ రెడ్డి, బాల తదితర బీఆర్ఎస్ నాయకులు, అయ్యప్ప స్వామి భక్తులు మరియు స్థానిక కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆల్ ఇండియా క్రిస్టియన్ మిషన్ సౌత్ ఇండియా ప్రెసిడెంట్‌గా అంబాల ప్రశాంత్ నియామకం

- మిషన్ జాతీయ అధికార ప్రతినిధిగా, తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఇన్‌చార్జిగా బాధ్యతలు



హనుమకొండ, నవంబర్ 21 (ప్రజావాణి): ఆల్ ఇండియా క్రిస్టియన్ మిషన్ సౌత్ ఇండియా ప్రెసిడెంట్‌గా, జాతీయ అధికార ప్రతినిధిగా, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఇన్‌చార్జిగా అంబాల ప్రశాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆల్ ఇండియా క్రిస్టియన్ మిషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎడ్విన్ సైమన్ అధికారికంగా నియామక ఉత్తర్వులు ప్రకటించారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన అంబాల ప్రశాంత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎడ్విన్ సైమన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.అన్ని మతాల ప్రజలను కలుపుకొని క్రీస్తు ప్రేమ, శాంతి, సోదరభావం సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. సమాజంలో ఎవరికి ఆపద వచ్చినా, కష్టాలు ఎదురైనా తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ అండగా నిలుస్తానని పేర్కొన్నారు.తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ ఆల్ ఇండియా క్రిస్టియన్ మిషన్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు సేవా కార్యక్రమాలను విస్తృతం చేసేందుకు కృషి చేస్తానని అంబాల ప్రశాంత్ వెల్లడించారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు పెద్దఎత్తున ప్రచారం కల్పించాలి

- డిసెంబర్ 11 నుంచి 22 వరకు జాతీయ స్థాయి యువజన క్రీడా పోటీలు
- పోస్టర్, అధికారిక లోగో, మస్కట్‌ను ఆవిష్కరించిన
- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు



ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, నవంబర్ 21:
తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 8వ ఎడిషన్ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ (KIYG)--2026 పోటీలను విజయవంతం చేసేందుకు జిల్లావ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. శ్రీరాములు అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్‌లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026 అధికారిక లోగో, పోస్టర్, మస్కట్‌ను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలో ఈ జాతీయ స్థాయి యువజన క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.
రాష్ట్రంలోని ఎనిమిది ఆతిథ్య జిల్లాల్లో 20 వేదికలపై క్రీడా పోటీలు జరగనున్నాయని, హైదరాబాద్‌తో పాటు వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, కరీంనగర్ తదితర నగరాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు.ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రాధాన్యతను జిల్లాలోని ప్రతి పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు ప్రజలకు తెలియజేసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. మాల్స్, పార్కులు, బస్టాండ్లు, కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లు, చెరువు కట్టలు, ఇతర జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో మస్కట్, లోగోతో కూడిన కటౌట్లు, స్టాండీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.
అలాగే ఎన్ఎస్ఎస్ (NSS), ఎన్‌సీసీ (NCC), యువజన సంఘాలు, క్రీడా సంఘాల సహకారంతో వారాంతాల్లో మస్కట్‌తో కూడిన ఖేలో ఇండియా రన్, వాకథాన్, సైక్లోథాన్ కార్యక్రమాలను నిర్వహించి యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలని తెలిపారు. ఈ క్రీడా పోటీల గురించి విస్తృతంగా ప్రచారం చేస్తూ యువతను భాగస్వాములను చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం. రాజశేఖర్, హౌసింగ్ పీడీ పవన్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఏఈఓ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ విజయ్ కుమార్, జిల్లా యువజన, క్రీడల అధికారి ఎ. సురేష్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎం, అకౌంటెంట్‌ను వెంటనే సస్పెండ్ చేయాలిమండల సమాఖ్య కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ ధర్నా

- ఏపీఎం దిష్టిబొమ్మ దహనం.

ప్రజావాణి శాయంపేట: దళిత సామాజిక వర్గానికి చెందిన మండల సమాఖ్య అధ్యక్షురాలు గడిపే సుమలతను అవమానపరిచిన ఏపీఎం వేణుగోపాల్, అకౌంటెంట్ అనితలను వెంటనే సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ వరంగల్, ఖమ్మం జిల్లాల ఇన్‌చార్జి ముక్కేర ముఖేష్ మాదిగ డిమాండ్ చేశారు.
అధ్యక్షురాలు సుమలతను ఏపీఎం, అకౌంటెంట్, కోశాధికారి, కార్యదర్శి అవమానపరుస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో శనివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు శాయంపేట మండల సమాఖ్య కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏపీఎం వేణుగోపాల్, అకౌంటెంట్ అనిత, కోశాధికారి దాసరి కల్పన, కార్యదర్శి అమ్మ వసంతల కనుసైగల్లోనే మండల సమాఖ్య కార్యకలాపాలు కొనసాగుతున్నాయని నాయకులు ఆరోపించారు.
గత 20 ఏళ్లుగా అకౌంటెంట్‌గా కొనసాగుతున్న అనిత తమ మాటే వినాలని, ఎలాంటి ప్రశ్నలు వేయకూడదంటూ అధ్యక్షురాలిపై మాటల దాడికి దిగుతున్నారని విమర్శించారు.



మండల సమాఖ్యలో జరుగుతున్న ఖర్చులు, లెక్కలు, తీర్మానాల వివరాలను అధ్యక్షురాలికి తెలియకుండా చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే డీఆర్‌డీఓ అధికారులు మండల సమాఖ్య కార్యాలయానికి చేరుకుని విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారుఅనంతరం ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఏపీఎం వేణుగోపాల్ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా ముఖేష్ మాదిగ మాట్లాడుతూ.. దళిత మహిళ మండల సమాఖ్య అధ్యక్షురాలిగా కొనసాగడాన్ని జీర్ణించుకోలేక ఏపీఎం, అకౌంటెంట్, కోశాధికారి, కార్యదర్శులు ఆమెను మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు. మండల సమాఖ్యలో అవినీతి, అక్రమాలుచోటుచేసుకుంటున్నాయని, అకౌంటెంట్ అనిత ఇష్టానుసారంగా లెక్కలు రాస్తున్నారని విమర్శించారు. ఏపీఎం వేణుగోపాల్‌పై కూడా పలు ఆరోపణలు చేశారు.ఏపీఎం, అకౌంటెంట్‌తో పాటు కోశాధికారి, కార్యదర్శులను బాధ్యతల నుంచి తొలగించాలని, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి ప్రభుత్వకార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మామిడి భాస్కర్, మామిడి తిరుపతి, మస్కే కుమార్, తుడుం వెంకటేష్, మామిడిపెల్లి సాంబయ్య, మారపెల్లి చిరంజీవి, మారపెల్లి వినీత్, కుమ్మరి రాజన్న, గడిపే అనిల్, మామిడి రాజు, మస్కే విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై అపార పరిజ్ఞానం.. జిల్లా స్థాయిలో 'లావణ్య' విజయభేరి!

- 'ఎలక్షన్ లిటరసీ క్లబ్' క్విజ్ పోటీలలో ద్వితీయ స్థానం!
- కేసముద్రం స్టేషన్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థినికి అదనపు కలెక్టర్, డీఈఓ చేతుల మీదుగా ప్రశంసలు!

కేసముద్రం నవంబర్ 21,ప్రజావాణి.
భవిష్యత్ పౌరులైన విద్యార్థులకు పాఠశాల స్థాయి నుండే ఓటు హక్కు విలువ, ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించేందుకు భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న 'ఎలక్షన్ లిటరసీ క్లబ్' పోటీలలో కేసముద్రం స్టేషన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని విశేష ప్రతిభ చాటింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న తండ లావణ్య, జిల్లా స్థాయిలో జరిగిన క్విజ్ పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచి పాఠశాలకు, గ్రామానికి గర్వకారణంగా నిలిచింది.
అంచెలంచెలుగా విజేత..!



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పాఠశాల, అసెంబ్లీ నియోజకవర్గ, మరియు జిల్లా స్థాయిలలో వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఓటర్ల నమోదు, జాబితా తయారీ, ఈవీఎం, వీవీప్యాట్ పనితీరు, ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు వంటి క్లిష్టమైన అంశాలపై జరిగిన ఈ పోటీలలో లావణ్య తన మేధస్సును ప్రదర్శించింది. తొలుత పాఠశాల స్థాయిలో, ఆ తర్వాత మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఆమె, తాజాగా జరిగిన జిల్లా స్థాయి పోటీలలో రెండవ స్థానాన్ని కైవసం చేసుకుంది.ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మరియు జిల్లా విద్యాశాఖాధికారి కె. అనిల్ కుమార్ చేతుల మీదుగా లావణ్య ప్రశంసా పత్రంతో పాటు జ్ఞాపికను అందుకుంది.
గురువు ప్రోత్సాహం.. విద్యార్థిని కృషి.!
లావణ్య ఈ విజయం సాధించడంలో పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు, గైడ్ టీచర్ పెరుగు శ్రీవిద్య కీలక పాత్ర పోషించారు. గత కొంతకాలంగా పాఠశాలలో వివిధ అవగాహన కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ఎన్నికల వ్యవస్థపై చక్కని శిక్షణ ఇచ్చారు. లావణ్య సాంఘిక శాస్త్రం పట్ల ఇదే మక్కువతో భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. జిల్లా స్థాయిలో సత్తా చాటిన విద్యార్థిని లావణ్యను, మార్గనిర్దేశం చేసిన గైడ్ టీచర్ శ్రీవిద్యను పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగుల శ్రీనివాస్ మరియు ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

మున్సిపాలిటీల్లో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

- వ్యాపార సముదాయాల్లో తప్పనిసరిగా పార్కింగ్ వసతులు.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో నవంబర్ 21:--జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పట్టణాల్లో వాహనాల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వ్యాపార సముదాయాలన్నింటిలో నిబంధనల ప్రకారం ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వాహనాలను రహదారులపై ఇష్టానుసారంగా నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా చర్యలు



తీసుకోవాలన్నారు. పార్కింగ్ నిబంధనలు ఉల్లంఘించే వ్యాపార సంస్థలు, వాహనదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాపార సముదాయాలు నిబంధనలను పాటిస్తున్నాయా లేదా అన్నది సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. అలాగే అన్ని వ్యాపార సముదాయాల్లో అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన



పటిష్టమైన అగ్నిమాపక భద్రతా వ్యవస్థలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. పట్టణ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, రహదారులపై వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, వెంకట మాధవరావు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డీఎస్పీ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గో విజ్ఞాన పరీక్షల్లో మెరిసిన ఇటిక్యాల విద్యార్థినులు

రాయికల్, నవంబర్ 21(ప్రజావాణి)రాయికల్ మండలం ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గో విజ్ఞాన పరీక్షల్లో ప్రతిభ చాటి పాఠశాలకు, గ్రామానికి గుర్తింపు తీసుకొచ్చారు. ఈ నెల 5న నిర్వహించిన జిల్లా స్థాయి పరీక్షల్లో 13 మంది విద్యార్థులు ప్రశంసా పత్రాలు పొందగా, వారిలో ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయికి ఎంపికై, ఈ నెల 15న నిర్వహించిన రాష్ట్రస్థాయి పరీక్షల్లోనూ ప్రశంసా పత్రాలు సాధించారు.ఈ సందర్భంగా పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సీమలదారి సదాశివ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్ మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో గోమాతకు విశిష్ట స్థానం ఉందని, గోవును సకలదేవతల స్వరూపంగా ఆరాధిస్తామని తెలిపారు. గో ఆధారిత వ్యవసాయం ప్రకృతి పరిరక్షణకు, భూసార పెంపునకు



దోహదపడుతుందని వివరించారు. విద్యార్థులు గోమాత ప్రాముఖ్యత, సనాతన సంప్రదాయాలు, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం రాష్ట్రస్థాయిలో ప్రశంసా పత్రాలు పొందిన ముగ్గురు విద్యార్థినులతో పాటు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులకు సర్పంచ్ నీరటి శ్రీనివాస్, జిల్లా ఆత్మ అధ్యక్షులు కాటిపెల్లి గంగారెడ్డి, వార్డు సభ్యులు నిగ భూమేశ్వర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామీణ ఉపాధ్యాయ సంఘం జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు గాజెంగి రాజేశం, హన్మంతరావు, స్వర్ణలత, శ్రీలత, నీరజ, ముజాహిద్, రాజం తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ రూరల్ జిల్లా లేబర్ సెల్ కో కన్వీనర్ గా కరపూరి నరేష్ కుమార్

- కార్మిక సంక్షేమం,పార్టీ అభివృద్ధి నా లక్ష్యం
- మేడ్చల్ రూరల్ జిల్లా లేబర్ సెల్ కో కన్వీనర్, కరపూరి నరేష్ కుమార్

మేడిపల్లి నవంబర్ 21 (మన ప్రజావాణి)బీజేపీ రాష్ట్ర లేబర్ సెల్ కన్వీనర్ అందె శ్రీనివాస్ చేతుల మీదుగా మేడ్చల్ రూరల్ జిల్లా లేబర్ సెల్ కో కన్వీనర్ గా ప్రముఖ న్యాయవాది కరపూరి నరేష్ కుమార్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా,బీజేపీ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని నరేష్ కుమార్ అన్నారు. అదేవిధంగా తనపై నమ్మకంతో మేడ్చల్ రూరల్ జిల్లా లేబర్ సెల్ కో కన్వీనర్ గా నియమించిన పార్టీ అధిష్టానానికి,జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు విక్రమ్,పార్టీ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కన్వీనర్ దాసరి మహేష్ యాదవ్,మేడ్చల్ రూరల్ జిల్లా ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శి రాంపల్లి యాదగిరి గౌడ్స్, బోడుప్పల్ డివిజన్ కో కన్వీనర్ దుర్గా ప్రసాద్, సీనియర్ కార్యకర్తలు వనం అంబాదాస్,గన్నోజు శ్యామ్ తదితరులు పాల్గొని నరేష్ కుమార్ కు శుభాకాంక్షలు తెలిపారు.





చెకుముకి టాలెంట్ టెస్ట్ లో మెరిసిన చిన్నారులు

రాయికల్, నవంబర్ 21(ప్రజావాణి) చెకుముకి విజ్ఞాన సంబరాలు 2026 సంవత్సరానికి గాను మండల కేంద్రంలో నిర్వహించిన మండలస్థాయి ప్రతిభ పరీక్షలో భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. మండలంలోని అనేక పాఠశాలల విద్యార్థులు పోటీపడిన ఈ పరీక్షలో భూపతిపూర్ విద్యార్థులు ముందు వరుసలో నిలవడం పాఠశాలకే కాకుండా గ్రామానికే గర్వకారణంగా మారింది.ఈ పరీక్షలో ప్రతిభ చూపిన కొమ్ము షిపివిస్ట, సముదాల అమూల్య, మూడపెల్లి చైత్ర ఈ నెల 28న జరిగే జిల్లా స్థాయి ప్రతిభ పరీక్షకు ఎంపికయ్యారు. అదే విధంగా ఆంగ్ల భాషా పోటీ మండల స్థాయి ప్రతిభ పరీక్షలో నూకల సహజ ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయి పరీక్షకు అర్హత



పొందింది.విద్యార్థుల ఈ విజయం వెనుక ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. చిన్న గ్రామం నుంచి వచ్చిన విద్యార్థులు కూడా పెద్ద వేదికలపై సత్తా చాటగలరని ఈ ఫలితాలు మరోసారి నిరూపించాయి. జిల్లా స్థాయిలో కూడా విద్యార్థులు ఇదే ప్రతిభను చూపి మండలానికి పేరు తీసుకురావాలని అందరూ ఆకాంక్షించారు.ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు యు.వి. రమణీ, సర్పంచ్ గుర్రం భావన మహేందర్, ఉప సర్పంచ్ మూగల సంజీవచారి, మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, మాజీ ఉప సర్పంచ్ అన్నవేని వేణు, మాజీ ఎంపిపి మహేశ్వర్ రావ్, మాజీ పాఠశాల అధ్యక్షులు జక్కుల రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, తోట శంకరయ్య, సాహెబ్ హుస్సేన్, సంజయ్ కుమార్, వేణుగోపాల్, కమారుద్దీన్, సురేష్, రాజగోపాల్, పుష్పలత, భవాని, వంశీధర్ రావు, రమేష్ మరియు కార్యాలయ సిబ్బంది సాయన్న, పారిశుద్ధ్య సిబ్బంది దోనిపాల సాయన్న తదితరులు అభినందించారు.

జాతీయ చేనేత బోర్డు మెంబర్ కర్నాటి వజ్రమ్మ వెంకటేశం ను సన్మానించిన చేనేత కార్మిక సంఘం నాయకులు



నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణిజాతీయ చేనేత కో అపరేటివ్ బోర్డు మెంబర్ గా ఎన్నికైన ఘట్టుప్పల్ కేంద్రానికి చెందిన కర్నాటి వజమ్మ వెంకటేశం ను స్థానిక మండల గ్రామ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలిసి ఘనంగా సన్మానించి రాష్ట్ర కార్మిక సంఘం ఆధ్వర్యంలో మెమెంటో అందజేశారు. జాతీయ స్థాయిలో చేనేత బోర్డు మెంబర్ గా ఎన్నిక కావడం గర్వకారణమని కొనియాడారు. చేనేత కార్మికుల సంక్షేమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జాతీయ స్థాయిలో మన ఉత్పత్తులను అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ చేనేత కార్మికుల సమస్యలను వారి దృష్టి కి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక రాష్ట్ర కమిటీ సభ్యులు కర్నాటి వెంకటేశం తుకారం. కార్మిక సంఘం మండల అధ్యక్షులు గంజి కృష్ణయ్య, కార్మిక సంఘం గ్రామ అధ్యక్షుడు అందే రాము, నామని స్వామి, చేరుపల్లి కృష్ణయ్య, ఏలే శివ శంకర్, చేరుపల్లి రమేష్, నరేష్, గంజి జయరాములు, సురేపల్లి మాణిక్యం, సామల ఆంజనేయులు, రవ్వ రాములు, సంగెపు శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు

నల్లబెల్లి కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ సత్య శారద

- విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన వైనం

నల్లబెల్లి, నవంబర్ 21 ప్రజావాణి : విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆమె నల్లబెల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను, తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్. విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, వసతులపై ఆరా తీశారు. అనంతరం వంటశాలను తనిఖీ చేసి భోజన నాణ్యతను పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థినులతో కలిసి కూర్చుని భోజనం చేశారు. వారితో ఆప్యాయంగా ముచ్చటిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ పెట్టి ఉన్నత



లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ



తీసుకోవాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి (ఎస్వో) ఆవుల సునీత, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

గుడిపల్లిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

- అర్హులైన ప్రతి కుటుంబం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ కూన్ రెడ్డి రాజశేఖర్ రెడి



దేవరకొండ--గుడిపల్లి, ప్రజావాణి నవంబర్ 21:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమాన్ని గుడిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి శనివారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా రూ.5 లక్షల ఉచిత జీవిత బీమా సౌకర్యాన్ని కల్పిస్తోందని తెలిపారు. గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులోగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు, నామినీ వివరాలతో గ్రామపంచాయతీ కార్యాలయంలో బీమా నమోదు చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గుడిపల్లి తహసీల్దార్ సుహాసిని, మండల విద్యాధికారి శ్రీనయ్య, ఉపసర్పంచ్ శ్రీనయ్య, పంచాయతీ కార్యదర్శి విజయ్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లపై పోలీసుల 'నిఘా' అస్త్రం!

- గంజాయి అక్రమ రవాణా, నేరాల కట్టడికి విజిబుల్ పోలీసింగ్'!
- మహబూబాబాద్, కేసముద్రం స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు!
- ఫింగర్ ప్రింట్ స్కానర్లతో అనుమానితుల ఆరా..
- వదిలేసిన వాహనాలపై నజర్!
- నిరంతర తనిఖీలు కొనసాగుతాయి.
- .జిల్లా ఎస్పీ డా. శబరీష్!

కేసముద్రం నవంబర్ 21, ప్రజావాణి.రైలు మార్గాల ద్వారా సాగుతున్న గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా పోలీసు యంత్రాంగం విజిబుల్ పోలీసింగ్ కు పదును పెట్టింది. జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశాల మేరకు శనివారం మహబూబాబాద్, కేసముద్రం రైల్వే స్టేషన్లలో పోలీసు బృందాలు మెరుపు తనిఖీలు నిర్వహించాయి.
టెక్నాలజీతో పాత నేరస్థుల గుర్తింపు.!
తనిఖీల్లో భాగంగా స్టేషన్ ఆవరణలో అనుమానాస్పదంగా



సంచరిస్తున్న వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. కేవలం విచారణతోనే సరిపెట్టకుండా, అత్యాధునిక ఫింగర్ ప్రింట్ (వేలిముద్రల) పరికరాలను వినియోగించి వారి పాత నేర చరిత్రను అక్కడికక్కడే సరిచూశారు. రైళ్లలో ప్రయాణిస్తున్న వారి లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ మత్తుపదార్థాల రవాణాపై గట్టి నిఘా ఉంచారు.
అనాథ వాహనాలు, దుకాణాలపై ప్రత్యేక దృష్టి.!
రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్రదేశాల్లో రోజుల తరబడి వదిలేసిన వాహనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. వాటి రిజిస్ట్రేషన్ నంబర్ల ఆధారంగా యజమానుల వివరాలను



సేకరించారు. అలాగే స్టేషన్ పరిసరాల్లోని దుకాణాలు, వ్యాపార సముదాయాలను తనిఖీ చేసి, అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా హెచ్చరికలు జారీ చేశారు.ప్రజల భద్రతే మా ప్రథమ ప్రాధాన్యం. నేరస్థుల కదలికలను ఎప్పటికప్పుడు పసిగట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు, పెట్రోలింగ్ నిరంతరం కొనసాగుతాయి. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే ప్రజలు వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి.
--- డా. శబరీష్, ఐపీఎస్

మండల స్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో విద్యార్థినుల ప్రతిభసీనియర్, జూనియర్ విభాగాల్లో అక్షయకు ప్రథమ స్థానం



ప్రజావాణి శాయంపేట: మండల స్థాయిలో నిర్వహించిన ఇంగ్లీష్ ఒలింపియాడ్ పోటీల్లో శాయంపేట జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ చాటారు.శాయంపేట మండలంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్ పోటీల్లో సీనియర్ విభాగంలో బాలికల పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని అక్షయ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. అదేవిధంగా జూనియర్ విభాగంలో 8వ తరగతి విద్యార్థిని అక్షయ మొదటి స్థానంలో నిలిచి విజేతగా నిలిచింది.ఈ సందర్భంగా విద్యార్థినుల ప్రతిభను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జనార్ధన్, ఉపాధ్యాయ సిబ్బంది,ఎంఈఓ బిక్షపతి,రాజి, బాపు,కో-కన్వీనర్ శేఖర్ బాబు,ఆంగ్ల ఉపాధ్యాయు లు తదితరులు పాల్గొన్నారువిద్యార్థినుల విజయంపై పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు

సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా ఆసరా పెన్షన్ల పంపిణీ

- 135 మంది లబ్ధిదారులకు పెన్షన్లు అందజేత.. పేదలకు ఆసరా పెన్షన్లు కొండంత భరోసా

గరిడేపల్లి, నవంబర్ 21 (ప్రజావాణి):పేదలు, వృద్ధులు, వికలాంగులు, నిరుపేద కుటుంబాలకు ఆసరా పెన్షన్లు ఆర్థికంగా ఎంతో అండగా నిలుస్తున్నాయని గరిడేపల్లి గ్రామ సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్ అన్నారు. గరిడేపల్లి మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఆసరా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ పరిధిలో మొత్తం 135 మంది పెన్షన్ లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వృద్ధులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, ఇతర అర్హులైన పేదలకు ప్రభుత్వం అందించే పెన్షన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రతినెలా అందే పెన్షన్ డబ్బులు వారి నిత్యావసర ఖర్చులకు, మందులు, ఇతర వ్యక్తిగత అవసరాలకు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు.



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని చెప్పారు.ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని ఈ సందర్భంగా తెలిపారు. పెన్షన్ల పంపిణీతో



లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్ గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బండా నర్సిరెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి నాగేశ్వరావు, ఉపసర్పంచ్ మాతంగి సంజీవ, గ్రామపంచాయతీ సిబ్బంది,వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.సర్పంచ్ ఎంపెల్లి నాగలక్ష్మి వినోద్

- 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన వారు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలి.. వానల్‌పహాడ్ గ్రామ పంచాయతీలో దరఖాస్తుల స్వీకరణ



నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో నవంబర్ 21:-ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని గ్రామంలోని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వానల్‌పహాడ్ గ్రామ పంచాయతీ ప్రతినిధులు కోరారు. ఈ పథకానికి సంబంధించి గ్రామ పంచాయతీ కార్యాలయంలో అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత ఉన్నవారు ఎవరూ ఈ అవకాశాన్ని కోల్పోకుండా వెంటనే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే ఈ పథకంపై గ్రామ ప్రజలు అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఖైసా ఎంపీడీవో ప్రదీప్, గ్రామ సర్పంచ్ ఎంపెల్లి నాగలక్ష్మి వినోద్, ఉప సర్పంచ్ సాయిరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి గాయత్రి, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

- వెలిదండ సర్పంచ్ చెన్నగాని సాంబయ్య చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేత

గరిడేపల్లి, నవంబర్ 21 (ప్రజావాణి):గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం నూతనంగా చేయూత పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను (ప్రొసీడింగ్స్) గ్రామ సర్పంచ్ చెన్నగాని సాంబయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలనే లక్ష్యంతో నూతనంగా పింఛన్లు మంజూరు కావడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా సర్పంచ్ చెన్నగాని సాంబయ్య మాట్లాడుతూ, అర్హులైన పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పింఛన్లు వృద్ధులకు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నాగేంద్రబాబు,



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెన్నగాని రామయ్య, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు జంగం కోటేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు చెన్నగాని జగన్ మోహన్, వార్డు సభ్యులు కామళ్ళ వెంకటి, గండు యల్లయ్య, ములకలపల్లి నాగరాజు, కామళ్ళ కిరణ్, ఆదూరి కార్తిక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వక్కవంతుల మట్టపల్లి రావు తదితరులు పాల్గొన్నారు. నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులు, గ్రామ ప్రజలు హాజరయ్యారు.

జిల్లా రోడ్డు భద్రతా కో-ఆర్డినేటర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం...

- అర్హత బి.టెక్ సివిల్ & మెకానికల్.
- 25 సం//ల నుండి 35 సం//ల లోపు వాళ్లు అర్హులు.
- కన్సాలిడేటెడ్ వేతనం 40 వేలు.
- నెడోక ప్రకటనలో తెలిపిన జిల్లా రోడ్డు రవాణా శాఖ అధికారి నరేష్.



యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి నవంబర్ 22 యాదాద్రి భువనగిరి జిల్లాలో రోడ్డు రవాణా శాఖ కార్యాలయంలో ఖాళీగా ఉన్న జిల్లా రోడ్డు భద్రతా కోఆర్డినేటర్ పోస్టు (01 పోస్టు) కు అర్హత కలిగిన జిల్లా యువతీ యువకుల నుండి దరఖాస్తులను ఆహ్వానించబడుచున్నవి.అర్హత: బి.టెక్ (సివిల్ & మెకానికల్) వయస్సు: 25 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల లోపు ఉండాలి. కన్సాలిడేటెడ్ వేతనం: రూ. 40,000/- ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో అప్లికేషన్ ఫారములను సమర్పించ గలరని జిల్లా రోడ్డు రవాణా శాఖ అధికారి నరేష్ నేడోక ప్రకటనలో వెల్లడించారు. దరఖాస్తు లకు చివరి తేదీ 30 నవంబర్ 2026 లోపు దరఖాస్తులను సమర్పించాలి. పూర్తి వివరాల కొరకు: https://yadadri.telangana.gov.in/ వెబ్సైట్ ద్వారా అప్లైన్లో చేసుకోగలరు.

ఉప సర్పంచ్ల హక్కుల సాధనకు కృషి చేస్తా

- రేపల్లె సాయిప్రసాద్.
- నియోజకవర్గ ఉప సర్పంచ్ల ఫోరం ఇన్ఛార్జిగా నియామకం.



బాన్సువాడ/ప్రజావాణి:-నియోజకవర్గంలోని ఉప సర్పంచ్ల హక్కుల సాధనే లక్ష్యంగా పనిచేస్తానని బాన్సువాడ నియోజక వర్గ ఉపసర్పంచ్ల ఫోరం నూతన ఇన్ఛార్జి రేపల్లె సాయిప్రసాద్ పేర్కొన్నారు. రుద్రూర్ మండలం అంబం (ఆర్) ఉపసర్పంచ్గా ఉన్న ఆయనను ఫోరం రాష్ట్ర నాయకత్వం శనివారం నియోజక వర్గ ఉప సర్పంచ్ల ఇన్ఛార్జిగా నియమించింది.ఈ నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్,సెక్రటరీ సురేష్ గౌడ్,జిల్లా అధ్యక్షుడు మహేష్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు

పారిశుద్ధ్య కార్మికురలు రమణమ్మ మాదిగ పై జరిగిన దాడిని కండించిన

- MRPS జిల్లా నాయకులు సందాల శంభయ్య మాదిగ



ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం నవంబర్ 21నల్గొండ పట్టణంలోనీ 45వ వార్డు లో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న మాదిగ కులానికి చెందిన చందుపట్ల రమణమ్మ అనే మున్సిపల్ మహిళా కార్మికురాలు పై జరిగిన దాడిని MRPS జిల్లా నాయకులు సందాల శంభయ్య మాదిగ ఖండించడం జరిగింది.వారు మాట్లాడుతూ అదేవిధంగా దాడికి పాల్పడిన నిందితునిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు తో పాటు ప్రభుత్వ నిధుల్లో ఉన్న ఉద్యోగిపై దాడి జరిగితే ఎలాంటి సెక్షన్లు ఉంటాయో ఆ సెక్షన్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.కేసు కట్టడమే కాదు తక్షణమే నిందితునిపై చట్టపరమైనటువంటి చర్యలు తీసుకొని వెంటనే రిమాండ్ కు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. అలాగే నిందితుడి నుంచి మరియు అతని కుటుంబ సభ్యుల నుంచి సంబంధించిన వ్యక్తుల నుంచి బాధితురాలకు ఎలాంటి హాని లేకుండా కాపాడే బాధ్యత చట్టానికి ఉందని గుర్తు చేస్తున్నాం.లేని పక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమానికి నిర్మిస్తామని శంభయ్య మాదిగ అన్నారు

మహిళపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ప్రియుడు..!

నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి

నల్గొండ జిల్లా తోరగల్ గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. అనుమానం తో మహిళపై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. బాధితురాలు బొమ్మిశెట్టి రమణ (34), సూరేపల్లి గ్రామం, నిడమనూరు మండలం వాసి. నిందితుడు మెగావత్ హనుమాన్ నాయక్ (40), ప్రస్తుతం తోరగల్ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. సుమారు 8 సంవత్సరాల క్రితం ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడిందని, సంఘటనకు మూడు రోజుల ముందు బాధితురాలు తోరగల్ లోని నిందితుడి ఇంటికి వెళ్లి అతని వద్ద ఉంటోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న నిందితుడు, ఆమెను కొడుతూ వేధించేవాడని ఆరోపణ. ఈ క్రమంలో 20.11.2026 తేదీన రాత్రి సుమారు 8 గంటలకు నిందితుడు బాధితురాలిని చంపాలనే ఉద్దేశంతో ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు ఫిర్యాదులో తెలిపారు. దాంతో బాధితురాలు తీవ్రంగా కాలిన గాయాలకు గురైంది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం నల్గొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం బాధితురాలు జరిగిన సంఘటన వివరాలను తన అన్నయ్య అయిన బండారు కోటేశ్వరరావు (కొత్తాల గ్రామం, అనుముల మండలం) కు తెలియజేయగా, ఆయన 21.11.2026 అర్ధరాత్రి 00:50 గంటలకు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. నిందితుడిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుడు కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్లో జడ్పీహెచ్ చిట్యాల విద్యార్థుల విజయకేతనం



పెద్ద వంగర నవంబర్ 21 ప్రజావాణి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పెద్దవంగర మండల కేంద్రంలోని ఏం ఆర్ సి కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్లో జడ్పీహెచ్ చిట్యాల పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని సాధించారు.పాఠశాలకు చెందిన వర్షిత్, సృజన, రిషిత్ తమ ప్రతిభతో మండల స్థాయిలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకోవడంతో పాటు, ఈ నెల 28న నిర్వహించనున్న జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్కు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా స్థాయి పోటీలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.విద్యార్థుల విజయంపై పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నవంబర్ 26న మాదిగ డప్పుల దరువు.

మన ప్రజావాణి. మంథని ప్రతినిధి ఈరోజు మంథని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అందుబాటులో ఉన్న మాదిగ కుల బాంధవులతో ఈ నెల 26వ తేదీన మంథని పట్టణంలో నిర్వహించే మాదిగల డప్పుల దరువు కార్యక్రమ నిర్వహణ కోసం ఏ విధంగా కార్యక్రమం చేయాలనే ఒక కార్యాచరణ రూపొందించడం కోసం అందరం కలిసి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మంథని డివిజన్ లోని కమాన్ పూర్ రామగిరి ముత్తారం మంథని మండలాల్లో వివిధ గ్రామాలలో ఉన్న మన మాదిగ కుల బాంధవులందరూ ఈ డప్పుల దరువు కార్యక్రమంలో భాగస్వాములై మంథనినియోజకవర్గ కేంద్రంలో డప్పుల దరువు మోగించడానికి సన్నద్ధం కావాలని పిలుపునిస్తున్నాం



పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం...

- 107 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాల అందజేత.
- అందజేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి.





యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి నవంబర్ 22

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం రోజు సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో పట్టణానికి మంజూరైన 107 ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన మంజూరు పత్రాలను భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి లబ్ధిదారులకు అంద జేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద , మధ్య తరగతి కుటుంబాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలి పారు. ముఖ్యంగా సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఇళ్లు అనేది ప్రతి పేద కుటుంబం కల అని , ఆ కలను నిజం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన ఉద్దేశమని అన్నారు. అర్హులైన లబ్ధి దారులను పారదర్శకంగా ఎంపిక చేసి విడతల వారీగా ఇళ్ల మంజూరు ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని సద్విని యోగం చేసుకొని నాణ్యతా ప్రమాణాలతో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని లబ్ధి దారులకు సూచించారు.భువనగిరి పట్టణ అభి వృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని , నియోజక వర్గంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల మంజూరు తో తమ సొంతింటి కల నెరవేరనున్న నేపథ్యంలో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి , వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల , మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్ రెడ్డి , సీనియర్ కాంగ్రెస్ నాయకులు , పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్ , కౌన్సిలర్లు , కో అప్షన్ సభ్యులు , అధి కారులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ల పరిసరాల్లో విస్తృత తనిఖీలు -- నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్

డోర్నకల్: నవంబర్21 (ప్రజావాణి)

మహబూబాబాద్, కేసముద్రం, డోర్నకల్ రైల్వే స్టేషన్లలో ముమ్మర తనిఖీలు

అనుమానిత వ్యక్తులపై నిఘా.. నేరస్థుల కదలికలపై ప్రత్యేక దృష్టి

గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు ప్రత్యేక తనిఖీలు

మహబూబాబాద్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్ను మరింత బలోపేతం చేస్తూ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మహబూబాబాద్, కేసముద్రం, డోర్నకల్ రైల్వే స్టేషన్లలో పోలీసు బృందాలు ముమ్మరంగా తనిఖీలు చేపట్టాయి.

రైల్వే స్టేషన్లలో ప్రయాణికులు, అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల కదలికలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అనుమానం కలిగించే వ్యక్తులను ప్రశ్నించి, అవసరమైన చోట ఫింగర్ ప్రింట్ డివైజ్ల ద్వారా వారి వివరాలను పరిశీలిస్తున్నారు.



ముఖ్యంగా గంజాయి అక్రమ రవాణా, ఇతర మాదకద్రవ్యాల సరఫరా మరియు రవాణాను అరికట్టేందుకు రైల్వే మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైళ్లలో ప్రయాణించే అనుమానితులు, వారి లగేజీపై నిఘా ఉంచుతున్నారు.అదేవిధంగా రైల్వే స్టేషన్ల పరిసరాల్లో చాలా కాలంగా పార్కింగ్ చేసి వదిలివేసిన వాహనాలను తనిఖీ చేస్తూ, వాటి యజమానుల వివరాలను సేకరిస్తున్నారు. స్టేషన్ చుట్టుపక్కల ఉన్న దుకాణాలు, వ్యాపార సముదాయాలను కూడా పరిశీలిస్తూ అనుమానాస్పద కార్యకలాపాలపై ఆరా తీస్తున్నారు.

జిల్లాలో నేరాల నివారణకు నిరంతర పెట్రోలింగ్, ఆకస్మిక తనిఖీలు, విజిబుల్ పోలీసింగ్ కొనసాగుతాయని, ప్రజలు అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ సూచించారు.

రీ సర్వే ఫ్రీ సర్వేగా మారింది

- ఎట్రోల్ ఖర్చులు లేక లైసెన్స్ సర్వేయర్ల ఇబ్బందులు
- కనీసం తాగునీరు లేదు
- 3 రోజులుగా రీ సర్వేను బంధు పెట్టిన లైసెన్స్ సర్వేయర్లు



పెద్దవంగర నవంబర్ 21 ప్రజావాణి. రీ – సర్వే విధుల్లో పాల్గొంటున్న లైసెన్స్ సర్వేయర్లకు పెండింగ్ నిధుల విడుదల, వేతన సవరణ, గౌరవ వేతనం మరియు ఇతర సమస్యల పరిష్కరించాలని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని శనివారం తాసిల్దార్ కార్యాలయంలో అందజేశారు. అనంతరం సీనియర్ లైసెన్స్ సర్వేయర్ గంధం జంపయ్య మాట్లాడుతూ.. మన పెద్దవంగర మండలంలో ఇప్పటికే పోచారం గ్రామంలో రీ సర్వే పనులు పూర్తిచేసి, ప్రస్తుతం బొమ్మకల్ గ్రామంలో సర్వే పనులు చేస్తున్నాం . అయినప్పటికీ, గత సుమారు 8 నెలలుగా నిరంతరంగా విధులు నిర్వహిస్తున్న మాకు ఇప్పటివరకు పూర్తిస్థాయి నిధులు విడుదల కాలేదు. కొంతమంది సర్వేయర్లకు కేవలం నామమాత్రంగా రూ.5,000/- మాత్రమే చెల్లించడం జరిగింది.ఎన్నో వ్యయప్రయాసలకోర్చి, కుటుంబాలకు దూరంగా ఉంటూ, ఎండ, వాన, బురద, పొలాలు, ముళ్లపొదలు వంటి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తున్నాము. క్రిమి కీటకాలు, పాములతో ప్రాణభయం ఉంది. అయినా రీసెర్వే పనులు చేస్తున్నప్పటికి తగిన పారితోషికం అందకపోవడంతో మా కుటుంబాల రోజువారీ ఖర్చులు నిర్వహించడం కూడా భారంగా మారింది. గత మూడు రోజులుగా రీ సర్వే పనులు చేయకుండా నిరసన వ్యక్తం చేస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

1. పెండింగ్ నిధుల విడుదల మరియు వేతన సవరణ:
రీ సర్వే పనులు పూర్తయిన ప్రతి గ్రామానికి సంబంధించిన పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేసి, సర్వేయర్ల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకు రూ.60/- పారితోషికాన్ని పెంచి, పని భారానికి అనుగుణంగా తగిన వేతనం లేదా గౌరవ వేతనం కల్పించాలి. అదేవిధంగా ఉద్యోగ భద్రత కల్పించాలి.

2. ప్రభుత్వ మరియు ఇతర భూముల సర్వేకు పారితోషికం:
రీ సర్వేలో భాగంగా ప్రభుత్వ భూములైన రహదారులు, కాలువలు, చెరువులు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు మరియు ప్రైవేట్ ఇంటి స్థలాల సర్వేకు కూడా తగిన పారితోషికాన్ని ప్రకటించాలి.

3. కార్యాలయ రికార్డు పనులకు అదనపు వేతనం:
క్షేత్రస్థాయిలో సర్వే విధులతో పాటు కార్యాలయాల్లో నిర్వహించే రికార్డు పనులు, డేటా ఎంట్రీ, మ్యాపుల తయారీ మరియు ఇతర అదనపు పనులకు ప్రత్యేకంగా అదనపు పారితోషికం చెల్లించాలి.

4. ప్రమాద బీమా మరియు ఇన్సూరెన్స్:
ప్రభుత్వం ప్రకటించిన ప్రమాద బీమా మరియు ఇన్సూరెన్స్ పథకాల అమలు విధానం, అర్హతలు, వర్తించే ప్రయోజనాలు మరియు క్లెయిమ్ విధానంపై స్పష్టమైన సమాచారం అందించాలి. ప్రతి లైసెన్స్ సర్వేయర్కు బీమా రక్షణ కల్పించాలి.

కావున, మా సమస్యలను మరియు ఆర్థిక ఇబ్బందులను మానవతా దృక్పథంతో పరిశీలించి, మా న్యాయమైన డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, త్వరితగతిన పరిష్కారం లభించేలా తగిన చర్యలు తీసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో లైసెన్స్ సర్వేయర్లు బసనబోయిన కుమార్, గుర్రం సతీష్, తలారి జీవన్, చర్లపల్లి లివిత్, ఎద్దు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆత్మగౌరవానికి పట్టం కట్టాలి

- ప్రతి గ్రామంలో ముదిరాజ్ సంఘ భవనాలు నిర్మించాలి!
- క్రేసముద్రం వేదికగా రాష్ట్ర స్థాయి వేడుకలు జరగాలి!
- ప్రపంచ మత్స్యకారుల దినోత్సవంలో ముదిరాజ్ రాష్ట్ర నాయకులు నీలం దుర్గేష్!





కేసముద్రం, నవంబర్ 21, ప్రజావాణి.కష్టాన్ని నమ్ముకుని జీవించే మత్స్యకారుల చెమటకు తగిన గుర్తింపు, సమాజంలో సముచిత గౌరవం దక్కినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది" అని ముదిరాజ్ రాష్ట్ర నాయకులు నీలం దుర్గేష్ ఉద్ఘాటించారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. సభ అధ్యక్షులు లింగాల పిచ్చయ్య జెండాను ఆవిష్కరించగా, నీలం దుర్గేష్ నాయకత్వంలో నిర్వహించిన భారీ ర్యాలీ మత్స్యకారుల ఐక్యతను చాటిచెప్పింది.

గ్రామగ్రామాన సంఘ భవనాలు.. కేసముద్రంలో వేడుకలు!

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న నీలం దుర్గేష్ మాట్లాడుతూ.. మత్స్యకార సోదరులంతా ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. మన కులస్థుల ఆత్మగౌరవానికి, సామాజిక కార్యక్రమాలకు వేదికలుగా నిలిచేలా ప్రతి గ్రామంలో ముదిరాజ్ సంఘ భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. అంతేకాకుండా, మత్స్యకారుల ఐక్యతకు నిలయమైన కేసముద్రంలో భవిష్యత్తులో మరింత ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలను నిర్వహించుకునేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు.

సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి భరోసా!

గతంలో శిథిలావస్థలో ఉన్న చెరువులకు ప్రభుత్వం పూర్వవైభవం తీసుకురావడంతో మత్స్య సంపద గణనీయంగా పెరిగిందని దుర్గేష్ సంతోషం వ్యక్తం చేశారు. ఉచిత చేప పిల్లల పంపిణీ, రవాణా కోసం సబ్సిడీపై ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు, ఆధునిక పనిముట్ల పంపిణీ ద్వారా ప్రభుత్వం మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని కొనియాడారు. ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని అర్హులైన ప్రతి మత్స్యకారుడు అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు.మున్సిపల్ చైర్పర్సన్ సునీత వెంకన్న మాట్లాడుతూ.. మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ఇంతటి ఘనవిజయం సాధించడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరినీ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు.ఈ వేడుకల్లో దస్రు నాయక్, కౌన్సిలర్లు, సర్పంచ్ సూరయ్య, సత్యం, ముదిరాజ్ యువ నాయకులు సింగని యాకన్న, మహేష్, వెంకటేష్, ప్రభాకర్, అశోక్, చెన్నబోయిన శ్రీనాథ్, ముదిరాజ్ సంఘం సొసైటీ అధ్యక్షులు, మండల, గ్రామ, పట్టణ కమిటీల నాయకులు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంతో ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత

● జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య





మన ప్రజావాణి మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత, ఆర్థిక భరోసా కల్పించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. శనివారం జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32వ వార్డులో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, అదనపు కమీషనర్ జి రాజు, కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ లతో కలిసి ఇందిరమ్మ భీమా యోజన ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని అమలు చేస్తుందని, రేషన్ కార్డులు కలిగిన అర్హులైన కుటుంబాలు ఈ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ పథకం క్రింద కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలో నామినీకి 5 లక్షల రూపాయల భీమా పరిహారం అందించే అవకాశం ఉంటుందని, పథకానికి సంబంధించిన ఇతర ప్రయోజనాలు అర్హత నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు అందుతాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ శిబిరానికి హాజరై తమ వివరాలను నమోదు చేసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 5 వార్డు అమరావాది లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తో కలిసి పరిశీలించారు. ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేస్తుందని, ఈ క్రమంలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వివరాల నమోదులో పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు. పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, ఆహార నాణ్యత, విద్యాబోధన తీరును పరిశీలించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. పాఠశాలలో నిర్వహిస్తున్న గర్భిణులు, పిల్లల వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అగ్గు సాగర్, గోపాల్ రావు, రాజేశ్వరి, ఖలీద్, సంపత్ రెడ్డి, క్యాతనపల్లి మున్సిపాలిటీ లోని 5, 20 వార్డుల కౌన్సిలర్లు దాముక శిరీష్ రమేష్, కూతురు ప్రభాకర్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక దిగుబడి కరీంనగర్ మొక్కజొన్న విత్తనాలు పంపిణీ



రాయికల్, నవంబర్ 21(ప్రజావాణి) పొలాస దత్తత గ్రామమైన ఆలూరులో శనివారం రైతు పొలాల్లో ఆవిష్కరణ కార్యక్రమం రైతుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. విశ్వవిద్యాలయ పరిశోధనలు కేవలం ప్రయోగశాలలకే పరిమితం కాకుండా నేరుగా రైతు పొలాల్లోకి చేరాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులకు కరీంనగర్ మొక్కజొన్న ఒకటి అనే నూతన రకం విత్తనాలను అందజేశారు. ఈ రకం తక్కువ కాలంలో మంచి దిగుబడి ఇవ్వడంతో పాటు రైతులకు అధిక ఆదాయాన్ని అందిస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. విత్తనం వేసే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని, దాని వల్ల మొలక శాతం పెరిగి తెగుళ్లు తగ్గుతాయని వివరించారు.అనంతరం శాస్త్రవేత్తలు రాంరెడ్డి పసుపు తోటను పరిశీలించారు. తోటలో దుంప తొలిచే ఈగ ఉధృతిని గమనించి వెంటనే నివారణ చర్యలు సూచించారు. కార్టాప్ హైడ్రోక్లోరైడ్ నాలుగు గుళికలను ఎకరానికి ఎనిమిది కిలోల చొప్పున మొదళ్ల దగ్గర వేయాలని తెలిపారు. సకాలంలో స్పందిస్తే పంటను కాపాడుకోవచ్చని, ఆలస్యం చేస్తే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు.రైతులు తమ పొలాల్లో ఎదురవుతున్న సమస్యలను శాస్త్రవేత్తలకు నేరుగా చెప్పుకుని సలహాలు పొందారు. ఇలాంటి కార్యక్రమాలు రైతులకు శాస్త్రీయ సాగుపై అవగాహన పెంచి, నష్టాల నుంచి గట్టెక్కిస్తాయని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో పొలాస శాస్త్రవేత్తలు కె. రామకృష్ణ, వై. స్వాతి, వ్యవసాయ కేంద్ర సమన్వయకర్త దివ్య, సర్పంచ్ నల్లాల స్వామి, రాంరెడ్డి, శేఖర్, రాజారెడ్డి, బుచ్చయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు అండగా ప్రజా ప్రభుత్వం -- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు





జయశంకర్ భూపాలపల్లి, బ్యూరో నవంబర్ 21 (మన ప్రజావాణి) భూపాలపల్లి నియోజకవర్గంలోని గోరుకొత్తపల్లి మండలంలో పలు గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అవగాహన కార్యక్రమాల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని గ్రామ ప్రజలకు పథకం ఉద్దేశం, ప్రయోజనాలు, దరఖాస్తు చేసుకునే విధానం, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై వివరించారు.గోరి కొత్తపల్లి మండలంలోని చెన్నాపూర్, దామరించ పల్లె గ్రామం, చిన్నకోడపాక గ్రామం, బాలయ్యపల్లి గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ. 5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడం ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తికి అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఈ పథకం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, మహిళల ఆర్థిక భద్రత, రైతుల సంక్షేమం, విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తోందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలనే ఉద్దేశంతో గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రజలు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించిన వివరాలను తెలుసుకొని, అవసరమైన పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో అధికారులు, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భూపాలపల్లి మార్కెట్ చైర్మన్,గోరికోతపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,యువ నాయకులు, గ్రామస్థులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా నిలిచే నేస్తం జీవిత భీమా



రాయికల్, నవంబర్ 21(ప్రజావాణి) ఆపద కాలంలో ఆదుకునే నిజమైన నేస్తం ముందుచూపు అని ఆలూరు గ్రామస్తులకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అధికారులు గుర్తుచేశారు. రాయికల్ మండలం ఆలూరు గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అల్లీపూర్ శాఖ ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఆర్థిక సమ్మిళిత సంతృప్తి ప్రచార కార్యక్రమం గ్రామంలో నూతన చైతన్యాన్ని నింపింది.అరచేతిలో రూపాయి దాచుకుంటేనే కష్టకాలంలో కొండంత అండగా నిలుస్తుందని అధికారులు సరళమైన భాషలో వివరించారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక భద్రతా పథకాలైన ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా పథకం, ప్రధానమంత్రి సురక్ష బీమా పథకం, అటల్ పెన్షన్ పథకం ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబానికి వరంలాంటివని తెలిపారు. చిటికెడు చందాతో లక్షల రూపాయల భద్రత, వృద్ధాప్యంలో నెలనెలా పెన్షన్ భరోసా లభిస్తుందని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సదవకాశాన్ని చేజార్చుకోకుండా వెంటనే పథకాలలో చేరాలని పిలుపునిచ్చారు.గుర్తింపు వివరాలు నవీకరించకపోవడం వల్ల ఎన్నో ఖాతాలు నిలిచిపోతున్నాయని, ఖాతాలు పునరుద్ధరించుకుంటేనే ప్రభుత్వ పథకాల లబ్ధి నేరుగా చేతికి అందుతుందని అధికారులు హెచ్చరించారు. గ్రామస్తులు అడిగిన ప్రతి సందేహానికి ఓపికగా సమాధానం చెప్పి, అక్కడికక్కడే నమోదుకు ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు నిర్వాహకులు రాజేష్, సర్పంచ్ నల్లాల స్వామి, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, వార్డు సభ్యులు మరియు ఖాతాదారులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలి.

● మత్స్యకారుల సేవలు అభినందనీయం.



మన ప్రజావాణి. మంథని ప్రతినిధి. మంథని మండలం దుబ్బ పల్లి గ్రామంలోని మత్స్యకారులు ఈరోజు మత్స్యకార దినోత్సవాన్ని చాలా ఘనంగా జరుపుకున్నారు జెండా ఆవిష్కరణ చేశారు ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నవంబర్ 21న నిర్వహిస్తారు ఈ సందర్భంగా మత్స్యకారుల జీవన విధానం వారి కష్టాలు సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది చెరువులు వాగులు నదులు సముద్రాల్లో చేపల వేట సాగిస్తూ మత్స్యకారులు తమ జీవనోపాధిని కొనసాగిస్తున్నారు ప్రజలకు పోషక విలువలు కలిగిన చేపలను అందించడంలో మత్స్యకారుల పాత్ర ఎంతో కీలకమైనది చేపల వేటతో పాటు వారు అనేక సమస్య ఎదురుకుంటున్నారు చేపల వేటకు అవసరమైన వలలు పడవలు ఇంధనం ధరలు పెరగడం చేపల మార్కెటింగ్లో ఇబ్బందులు వర్షాకాలంలో ఉపాధి కోల్పోవడం వంటి సమస్యలు వారిని ఆర్థికంగా కృ శీగదిస్తున్నాయి మత్స్యకార్లసంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాలు వారికి అవసరమైన రుణాలు సబ్సిడీలు భీమా సౌకర్యాలు కల్పించాలి ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మత్స్యకారుల కష్టాలను గుర్తించి వారి అభివృద్ధికి ప్రభుత్వాలు చేయూతనియాలని కోరుతున్నారు ఈ కార్యక్రమంలో కాళ్ల గంగమ్మ తోకల పోచమ్మ పల్లికొండ గంగమ్మ పల్లికొండ కవిత ధర్మాజీ భాగ్యలక్ష్మి తోకల పద్మ తోకల స్రవంతి తోకల శ్వేత కాళ్ల సుజాత పల్లికొండ స్వరూప పల్లికొండ శ్యామల పల్లికొండ సాగరిక కూసరపోసక్క సాకాపుర ప్రత్యూష మేడి నరసయ్య పల్లికొండ శంకరయ్య గుమ్ముల తిరుపతి తోకల శ్రీనివాస్ తోకల రమేష్ లు పాల్గొన్నారు

17వ వార్డుపై కాంగ్రెస్ పార్టీ వివక్షాపూరిత వైఖరి కౌన్సిలర్ పమిడి గీతాశ్రీ ఆగ్రహం

● అధికార పార్టీ కౌన్సిలర్ల వార్డులకే అభివృద్ధి పనులా? బీజేపీ కౌన్సిలర్ గెలిచిన వార్డు కనిపించడం లేదా?



ప్రజావాణి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి నవంబర్ 21 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట: మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో అభివృద్ధి పనుల విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న తీరుపై బీజేపీ కౌన్సిలర్ పమిడి గీతాశ్రీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల ఓట్లతో ఎన్నికైన తనను రాజకీయ కక్షతో లక్ష్యంగా చేసుకుని, తన వార్డులో అభివృద్ధి పనులను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ మేరకు నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వైఖరిని తీవ్రంగా ఖండించారు. 17వ వార్డులో రహదారుల నిర్మాణానికి సంబంధించి గ్రాంట్లు విడుదలైనప్పటికీ పనులు ప్రారంభించకపోవడం అధికార పార్టీ వివక్షకు నిదర్శనమని గీతాశ్రీ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగుతుండగా, బీజేపీ కౌన్సిలర్‌గా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులో మాత్రం పనులను నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ ఈ విషయంలో బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.గతంలో అనేక కౌన్సిల్ సమావేశాల్లో తన వార్డులో నెలకొన్న సమస్యలను ప్రస్తావించి, రహదారుల నిర్మాణంతో పాటు అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ అధికారులు, పాలకవర్గం నుంచి ఎలాంటి స్పందన లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.ఇంతటితో ఆగకుండా, ప్రజలు ఎన్నుకుని కౌన్సిలర్‌గా బాధ్యతలు అప్పగించిన తనను పక్కనపెట్టి, కాంగ్రెస్ పార్టీకి చెందిన మరో వ్యక్తిని 17వ వార్డు ఇంచార్జిగా నియమించి అభివృద్ధి పనులు, రహదారుల నిర్మాణం కోసం సంప్రదించాలంటూ పత్రికా ప్రకటనలు ఇవ్వడం అధికార పార్టీ అహంకారపూరిత ధోరణికి నిదర్శనమని విమర్శించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధిని కాదని, సంబంధం లేని వ్యక్తికి వార్డు బాధ్యతలు అప్పగించడం ప్రజల తీర్పును అవమానించడమేనని స్పష్టం చేశారు.మున్సిపాలిటీలో 19 మంది కౌన్సిలర్ల బలం ఉన్న కాంగ్రెస్ పార్టీ, ఒక్క కౌన్సిలర్ ప్రాతినిధ్యం ఉన్న బీజేపీని చూసి భయపడుతోందని గీతాశ్రీ ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధికి రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉంటుందని హితవు పలికారు.ఇదే విధంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తే, రాబోయే రోజుల్లో ఎన్నికల్లో ఓడిపోయిన 22 వార్డులకు కూడా 22 మంది ఇంచార్జులను నియమించుకోవాల్సిన పరిస్థితి వస్తుందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇప్పటి నుంచే ఆ పార్టీ నాయకులు ఇంచార్జుల వేట ప్రారంభించుకోవాలని చురకలంటించారు.రాజకీయ కక్షలు, పార్టీల మధ్య విభేదాలను పక్కనపెట్టి 17వ వార్డులో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను తక్షణమే ప్రారంభించాలని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని పమిడి గీతాశ్రీ మున్సిపల్ పాలకవర్గాన్ని డిమాండ్ చేశారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు వార్డు అభివృద్ధి కోసం నిరంతరం పోరాడుతానని స్పష్టం చేశారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా.. ఇందిరమ్మ బీమా పథకం ప్రారంభం



● ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నాయకత్వంలో సంక్షేమ పథకాల అమలు -- 66వ డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్ కుమార్

హసన్‌పర్తి,(మన ప్రజావాణి),21:ప్రతి నిరుపేద కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రూ. 5 లక్షల ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని గ్రేటర్ వరంగల్ 66వ డివిజన్ హసన్‌పర్తిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. వర్ధన్నపేట శాసనసభ్యులు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నాయకత్వంలో, ఆయన సూచనల మేరకు 66వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొర్రె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా 66వ డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి కుటుంబ పెద్దకు రూ. 5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడం ద్వారా కుటుంబాలకు ఆపద సమయంలో ఆర్థిక భరోసా అందించడమే ఇందిరమ్మ బీమా పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఇప్పటికే పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ, చేయూత పథకం కింద నూతన పింఛన్ల మంజూరు వంటి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని వివరించారు.అదేవిధంగా రైతు భరోసా, రైతు రుణమాఫీ, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, మహిళా శక్తి భవనాల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, హాస్టల్ విద్యార్థులకు కాస్మొటిక్ ఛార్జీల పెంపు వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని గొర్రె కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఎస్సీ, బీసీ, మైనారిటీ నాయకులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఐలాపూర్ తండాలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై అధికారుల కొరడా

● 50 బేస్‌మెంట్లు, 25 ఇళ్ల కూల్చివేత





అమీన్‌పూర్, నవంబర్ 21 (ప్రజావాణి): ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని ఐలాపూర్ తండాలో ప్రభుత్వ భూములను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలపై శనివారం కూల్చివేతలు చేపట్టారు. అమీన్‌పూర్ ఎంఆర్ఓ వెంకటేశం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ చర్యల్లో 50 బేస్‌మెంట్లు, 25 ఇళ్లను అధికారులు కూల్చివేశారు.ప్రభుత్వ భూములను ఆక్రమించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా ఉపేక్షించేది లేదని, ఆక్రమణ నిర్మాణాల తొలగింపు నిరంతరం కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సీఎంసీ అమీన్‌పూర్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎండపల్లిలో ఉత్సాహంగా మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

- ప్రభుత్వ విభాగంలో ముంజంపల్లి జడ్పీహెచ్ఎస్, ప్రైవేట్ విభాగంలో అక్షర హైస్కూల్‌కు ప్రథమ స్థానం



జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్, ఎండపల్లి నవంబర్ 21 (ప్రజావాణి)విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, వారిని భవిష్యత్ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో జన విజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని ఎండపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి (ఎంఈఓ) సముద్రాల హరికృష్ణ మాట్లాడుతూ.... మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. సమాజంలో మూఢనమ్మకాలను నిర్మూలించి, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించేందుకు చెకుముకి వంటి పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో మండలంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలలు, ఒక ప్రైవేట్ పాఠశాల నుండి మొత్తం 45 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒక్కో పాఠశాల నుండి 8, 9, 10వ తరగతులకు చెందిన ముగ్గురు విద్యార్థులతో కూడిన బృందాలు ఈ పరీక్షలో తమ ప్రతిభను చాటుకున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగం నుండి ప్రథమ స్థానం జడ్పీహెచ్ఎస్ ముంజంపల్లి సిహెచ్ ఆదిత్య, ఎస్ దీక్షిత్ లు సత్తా చాటారు. ద్వితీయ స్థానం గా జడ్పీహెచ్ఎస్ గొడిశలపేట ఎ అక్షిత, కె కుమార్, సిహెచ్ సంజన నిలవగా, తృతీయ స్థానంలో జడ్పీహెచ్ఎస్ ఎండపల్లి పాఠశాల నుండి జీ రిశ్విక్ వర్మ, పి శివతేజ, బి కావ్యశ్రీ లు గెలుపొందారు.ప్రైవేట్ పాఠశాల విభాగం లో అక్షర హైస్కూల్, రాజారంపల్లి జి గణేష్ , ఆర్ దీక్షిత్, ఎం. వంశీకర్ లు ప్రథమ స్థానం సాధించారు. అనంతరం విజేతలకు అతిథుల చేతుల మీదుగా మెమెంటోలు, పరీక్షలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక బాధ్యులు శనిగరపు రవి, అంజయ్యలతో పాటు ఉపాధ్యాయులు కుమార్, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, రత్నయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఇనుగుర్తి లో మండల స్థాయి ఎల్టా పోటీలు





ప్రజావాణి,ఇనుగుర్తి :ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఒలంపియాడ్,ఎడ్యు టాక్ కార్యక్రమాలు ని స్థానిక హై స్కూల్లో శనివారం నిర్వహించారు.విజేతలకు ఎంఈవో వెన్న వెంకట్రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు.సీనియర్స్ ఒలంపియాడ్ పరీక్షలో భాగంగా ప్రథమం జె.జీవన్ కోమటిపల్లి జెడ్ పి హెచ్ ఎస్ 10వ,తరగతి జె. జీవన్,ద్వితీయ చిన్న ముప్పారం జడ్పిహెచ్ఎస్ 10వ,తరగతి అరుణ్,జూనియర్ విభాగంలో ప్రథమ స్థానం పింగిల్ స్ఫూర్తి 8 క్లాస్ ఇనుగుర్తి జడ్పీహెచ్ఎస్ 8వ,తరగతి పింగిలి స్ఫూర్తి, ద్వితీయ కోమటిపల్లి హై స్కూల్ ఎనిమిదవ తరగతి మోక్షిత,లు విజేతలుగా నిలిచారు. ఎడ్యు టాక్ సీనియర్ విభాగంలో ప్రథమ కోమటిపల్లి టెన్త్ క్లాస్ ఇ.నవీన్, ద్వితీయ ఇనుగుర్తి జడ్పిహెచ్ఎస్ 10వ తరగతి వర్ధేలు కార్తీక్, జూనియర్ విభాగంలో ధరావత్ యామిని 8 క్లాస్ జడ్పీహెచ్ఎస్ ఇనుగుర్తి,ద్వితీయ స్థానం బి సాహిత్ జడ్పీహెచ్ఎస్ చిన్న ముప్పారం. లు గెలుపొందగా విజేతలకు ఎంఈఓ వెంకట్ రెడ్డి ప్రశంస పత్రాలు అందజేశారు. గెలుపొందిన విజేతలు జిల్లా స్థాయిలో పాల్గొనవలసి ఉంటుంది ఈ కార్యక్రమంలో జడ్.పి.హెచ్.ఎస్ హెడ్మాస్టర్ అమ్మ యాకయ్య,ఆంగ్ల ఉపాధ్యాయులు బోడ దేవేందర్, మాధవ్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కొనసాగుతున్న టీఎన్జీవో సభ్యత్వ నమోదు



మన ప్రజావాణి, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-టీఎన్జీవో సభ్యత నమోదు కార్యక్రమం జిల్లాలో నిరంతరాయంగా కొనసాగుతుండగా, శని వారం జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని జిల్లా ట్రెజరీ కార్యాలయం, జిల్లా పే అండ్ అకౌంట్స్ కార్యాలయంలో టీఎన్జీవో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో జిల్లా ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్ శాఖల ఉద్యోగులు దాదాపు 30 మంది నాన్ గెజిటెడ్ ఉద్యోగులు టీఎన్జీవో సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో టీఎన్జీవో సంఘం ఎల్లవేళలా కృషి చేస్తుందని తెలిపారు. జిల్లాలో మిగిలిన యూనిట్లలో సైతం సభ్యత్వ నమోదును అతి త్వరలో పూర్తి చేసి, రాష్ట్రంలోనే జిల్లాను మొదటి స్థానంలో నిలుపుతామని, రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈకార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి బొడ్డు శ్రావణ్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, ఉపాధ్యక్షులు రాంకుమార్, తిరుపతి, సంయుక్త కార్యదర్శి సునీత, ప్రచార కార్యదర్శి యూసుఫ్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్, కార్యదర్శి అజయ్, ఉపాధ్యక్షులు ప్రకాష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళా పారిశుద్ధ్య కార్మికురాలిపై చేయి చేసుకున్న అగ్రకుల దురాహంకారిని కఠినంగా శిక్షించాలి.

- మంథని మాదిగల ఐక్యవేదిక డిమాండ్.



మన ప్రజావాణి. మంతని ప్రతినిధి. మంథని మాదిగల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈరోజు అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలియజేయడం జరిగింది . ఈనెల 19న నల్గొండ జిల్లా కేంద్రంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన చందుపట్ల రమణమ్మ అనే పారిశుద్ధ్య మహిళ కార్మికురాలపై విచక్షణ రహితంగా అమానుషంగా కొట్టి దుర్భాషలాడిన బాలకృష్ణ అనే వెలమ దొరపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేయడం జరిగింది . భవిష్యత్తులో దళితులపై దాడులు చేస్తే కఠినంగా చట్టాలు అమలుపరిచి శిక్షలు పెంచాలని రోజురోజుకు దళితులపై దాడులు జరుగుతున్నాయని దాడుల నియంత్రణకు ఇంకా కఠిన చట్టాలు తేవాల్సిన అవసరం ఉందని మాదిగ ఐక్యవేదిక నాయకులు అన్నారు ఈ కార్యక్రమంలో మాదిగ ఐక్యవేదిక నాయకులు వేల్పుల రాజు కన్నూరి రాజబాబు రిటైర్డ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి రాజయ్య బూడిద తిరుపతి మంథని రాకేష్ నాగేల్లి మహేష్ కొయ్యలముండి ఇందారపు నవీన్ వేల్పుల శ్రావణ్ ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు

ఇందిరమ్మ చేయూతతో అర్హులకు ఆసరా.. నూతన పింఛన్ల పత్రాల పంపిణీ

- ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడమే లక్ష్యం
- సర్పంచ్ రామంజి గౌడ్

రాయినిగూడెం: నవంబర్ 21 (ప్రజావాణి)

గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాయినిగూడెం గ్రామ సర్పంచ్, సూర్యాపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రామంజి గౌడ్ అన్నారు. ఇందులో భాగంగా రాయినిగూడెం గ్రామానికి నూతనంగా మంజూరైన చేయూత ఆసరా పింఛన్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు ఆయన అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సామాజిక భద్రత పింఛన్లు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు తదితర అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని తెలిపారు.



ప్రతి నెలా పింఛన్ రూపంలో అందించే ఆర్థిక సాయం వృద్ధులకు జీవన భరోసాగా, వితంతువులకు ఆర్థిక అండగా, దివ్యాంగులకు ఆత్మగౌరవంతో జీవించే అవకాశంగా నిలుస్తోందన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అందిస్తున్న చేయూతకు ఈ పింఛన్లు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, మాజీ ఎంపీటీసీ బల్దూర్ సందీప్, గ్రామ శాఖ అధ్యక్షుడు గుండు శంబయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు గుండు నరేష్, పంచాయతీ కార్యదర్శి సునీత, గుండు కాశయ్య, గుండు సైదులు, గుండు సురేష్, గుండు శ్రీను, గుండు వీరస్వామి, గుండు నాగేశ్వరరావు, కట్టుకోల అంజయ్య, కొండ వెంకన్న, గుండు సీతయ్య, గుండు అంజయ్య, మామిడి కృష్ణ, వీరబాబు, వెంకన్న, సైదులు, కడప చంద్రకళ, మేరమ్మ, నాగమణి, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' నమోదు

- రెండు రోజుల్లో 643 కుటుంబాల డేటా ఎంట్రీ పూర్తి

జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్, ఎండపల్లి నవంబర్ 21 (ప్రజావాణి):

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' కింద అర్హులైన లబ్ధిదారుల నమోదు మరియు ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియ ఎండపల్లి మండలంలో రెండవ రోజు శనివారం నాడు కూడా ముమ్మరంగా కొనసాగింది. జగిత్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని కొండపూర్, రాజారాంపల్లి, సూరారం, శానబండ గ్రామ పంచాయతీలలో ప్రత్యేక సిబ్బంది ద్వారా ఈ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని ఎండపల్లి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి డి కృపాకర్ తెలిపారు.ఈ నాలుగు గ్రామ పంచాయతీలలో కలిపి మొత్తం 1,671 రేషన్ కార్డులు ఉండగా, మొదటి రోజు (శుక్రవారం) 353 కుటుంబాలు, రెండవ రోజు (శనివారం) 290 కుటుంబాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. దీంతో ఇప్పటివరకు మొత్తం 643 కుటుంబాల డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తికాగా.గ్రామాల వారీగా కొండపూర్ లో మొత్తం 797 కార్డులకు గాను, మొదటి రోజు 115, రెండవ రోజు 123 కలిపి మొత్తం 238, రాజారాంపల్లి గ్రామంలో మొత్తం 604 కార్డులకు గాను, మొదటి రోజు 120, రెండవ రోజు 101 కలిపి మొత్తం 221, సూరారం లో మొత్తం 168 కార్డులకు గాను, మొదటి రోజు 72, రెండవ రోజు 43 కలిపి మొత్తం 115 నమోదయ్యాయి. శానబండ గ్రామపంచాయతీలో మొత్తం 102 కార్డులకు గాను, మొదటి రోజు 46, రెండవ రోజు 23 కలిపి మొత్తం 69 నమోదయినట్లు తెలిపారు. అర్హులైన ఏ ఒక్క కుటుంబం కూడా నష్టపోకుండా పారదర్శకంగా డేటా ఎంట్రీ పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు, అర్హులైన లబ్ధిదారులు తమ వివరాల నమోదు ధృవీకరణ కోసం గ్రామ పంచాయతీలలో కేటాయించిన సంబంధిత సిబ్బందిని సంప్రదించి, ఈ ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





గురువుపై గౌరవం20 ఏళ్లైనా చెరగని అనుబంధం విద్యార్థులు

- గురువు కుమార్తె వివాహానికి ఆర్థిక సాయం విద్యార్థులు
- ఆదర్శంగా నిలిచిన కాకతీయ హైస్కూల్ 2004--05 ఎస్ ఎస్ సి బ్యాచ్

జమ్మికుంటనవంబర్ 21 (ప్రజావాణి) గురువు నేర్పిన విద్యాబుద్ధులు చూపిన మార్గం విద్యార్థుల జీవితాల్లో ఎంతటి ప్రభావం చూపుతాయో కాకతీయ హైస్కూల్ 2004--05 ఎస్ ఎస్ సి బ్యాచ్ విద్యార్థులు చాటిచెప్పారు. దాదాపు 20 ఏళ్లు గడిచినా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుపై అభిమానం ఆయన కుటుంబంపై ఆప్యాయతను మరువకుండాగురువు కుమార్తె వివాహానికి ఆర్థిక సహాయం అందించి మానవత్వానికి మచ్చుతునకగా నిలిచారు జమ్మికుంట కాకతీయ హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ గురువు కీర్తిశేషులు బుర్ర సంజీవ్ ప్రథమ కుమార్తె మధుహాసిని--సాయికృష్ణ వివాహాన్ని పురస్కరించుకుని రూ.90 వేల ఆర్థిక సహాయాన్ని సేకరించి వివాహ వేడుకలో అందజేశారుఇందులో రూ.60 వేల నగదును చెక్కు రూపంలో రూ.15 వేలతో బీరువా కూలర్‌ను 2005--06 బ్యాచ్ విద్యార్థుల తరఫున అందించారు. మరో రూ.15 వేలతో చిన్నారి కళాశాల ఫీజు చెల్లించి కుటుంబానికి అండగా నిలిచారు. గతంలో 2012లో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలోనూ గురువు సంజీవ్ కుటుంబానికి రూ.35 వేల ఆర్థిక సహాయం అందించడం విశేషంగురువు భౌతికంగా దూరమైనప్పటికీ ఆయన నేర్పిన విలువలు జ్ఞాపకాలు విద్యార్థుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయని ఈ సహాయం మరోసారి నిరూపించింది.వివాహ వేడుకకు హాజరైన బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు గురువు పట్ల విద్యార్థులు చూపిన ప్రేమాభిమానాలు, బాధ్యత, సేవాభావాన్ని అభినందించారు. చదువు చెప్పిన గురువు కుటుంబాన్ని తమ కుటుంబంగా భావించి కష్టసుఖాల్లో తోడుగా నిలవడం నేటి విద్యార్థులకు గొప్ప సందేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబీరి శ్రీకాంత్, జక్కు రజనీకాంత్, పైండ్ల రాజేష్ రెడ్డి, పిల్లల శ్రీనివాస్, నాగలగని మధు, వొల్లల అజయ్, పలకల చంద్ర రెడ్డి, కండెం రాజేష్, పొద్దుటూరి విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు గురువుపై గౌరవం తోటి మనిషిపై బాధ్యతఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉంటే సమాజంలో ఎన్నో మంచి మార్పులు సాధ్యమవుతాయని ఈ పూర్వ విద్యార్థులు తమ ఆచరణతో చాటిచెప్పారు





ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మన ప్రజావాణి మందమర్రి:-ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మండల ఎంపీడీవో ఎన్ రాజేశ్వర్, ఎంపీవో మహేష్ కుమార్ లు తెలిపారు. శనివారం మండలంలోని ఆదిల్ పేట్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ నెందుగురి పున్నం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రారంభ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో మహేష్ కుమార్ లు హాజరై, నమోదు ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షల రూపాయల జీవిత బీమా సౌకర్యంతో ఈ పథకాన్ని తీసుకువచ్చిందని, కుటుంబ పెద్దకు ఏదైనా జరిగితే ఆ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఈ భీమా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామంలో అర్హులైన ప్రతి కుటుంబం తప్పకుండా ఈ పథకంలో నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఇటీవల మంజూరైన 25 మంది నూతన చేయూత ఆసరా పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను సర్పంచ్ నెందుగురి పున్నం తో కలిసి అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన వారికి చేరేలా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ రాజన్న, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటాపూర్ లో చేయూత ఆసరా పింఛన్ల పంపిణీ

మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ సేగ్యం వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం చేయూత ఆసరా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు నూతన ఆసరా పింఛన్ల మంజూరు పత్రాలను సర్పంచ్ వెంకటేష్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల సంక్షేమం కోసం చేయుత ఆసరా పింఛన్లను అందిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేష్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



అనంతుల రామస్వామి గౌడ్ కు గౌడ సంఘం ఘన నివాళి

- పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన చండూరు గౌడ సంఘం నాయకులు

నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి చండూరు పట్టణంలోని 8వ వార్డులో శనివారం ఉదయం అనంతుల రామస్వామి గౌడ్ పార్థివ దేహానికి చండూరు గౌడ సంఘం తరఫున పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో చండూరు గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి మోగుదాల శేఖర్ గౌడ్, కోశాధికారి బొల్లపల్లి రాజు గౌడ్, గౌరవ అధ్యక్షుడు మాధగోని ఆంజనేయులు గౌడ్, బొమ్మగోని కృష్ణయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గుడిపేట, హాజీపూర్ పిహెచ్సి లను తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ

మన ప్రజావాణి మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-జిల్లాలోని గుడిపేట, హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను(పిహెచ్సి) శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా గుడిపేటలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమం, మందుల నిల్వలు, అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. హాజీపూర్ పీహెచ్సీలో వైద్య సేవలపై సమీక్ష నిర్వహించి, తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రతి శనివారం గ్రామాల్లో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ముందస్తుగా టీకాలు ఇచ్చే పిల్లల వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఎన్సీపీ కార్డులో వ్యాధి నిరోధక టీకాల వివరాలను నమోదు చేయాలని, ఏ రోజుకు ఆ రోజు వ్యాక్సిన్ ఇచ్చిన వారి వివరాలను తప్పకుండా నమోదు చేయాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు పిల్లలకు ఆరోగ్య వరాలు అని, ఏ టీకా ఏ వ్యాధి రాకుండా ఉపయోగపడుతుందో తల్లిదండ్రులకు తెలియజేయాలని తెలిపారు.క్షయ, పోలియో, కామెర్లు, కంఠసర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం, నిమోనియా, తట్టు, రూబెల్లా, అంధత్వ నివారణ, విరేచనాలు వంటి 5 ఏళ్లలోపు పిల్లలకు వచ్చే వ్యాధులను టీకాలతో నివారించవచ్చునని వివరించారు. వైద్య సిబ్బంది తమ పరిధిలోని పిల్లలందరికీ టీకాలు వేయించాలన్నారు. హాజీపూర్ పీహెచ్సీని తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 14 రకాల వైద్య ఆరోగ్య కార్యక్రమాల్లో వెనుకబడి ఉన్నామని, వాటిని పూర్తి





చేయాలని వైద్యాధికారిని ఆదేశించారు. ముఖ్యంగా ప్రమాణ్ యాప్ లో హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని, చేయని వారిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, మాతా శిశు సంరక్షణ, గర్భవతుల నమోదు, పరీక్షలు, ఐరన్ ఫోలిక్ మాత్రల పంపిణీని సకాలంలో చేసి, పోర్టల్ లో నమోదు చేయాలని సూచించారు. సంజీవని, మానసిక ఆరోగ్యం, అసంక్రమణ వ్యాధులు (బీపీ, షుగర్) వివరాలను రోజువారీ నమోదు చేయాలని, 30 ఏళ్లు పైబడిన వారందరికీ పరీక్షలు చేయాలన్నారు. కుష్ఠు వ్యాధిగ్రస్తుల్లో చిన్న పిల్లలు ఉంటే ప్రత్యేక వైద్య నిపుణులచే పరీక్షించాలని, సమయపాలన పాటిస్తూ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే గర్భవతుల వివరాలను సేకరించి వంద శాతం నమోదు కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, వైద్యాధికారి డాక్టర్ లహరి, ఆరోగ్య పర్యవేక్షకులు రఘుపతి, పద్మ, ఆరోగ్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరా జీవిత బీమా పథకం చేనేత పింఛన్ల ప్రొసీడింగ్ లెటర్లపంపిణీ

● కౌన్సిలర్ యాట్ల సునీత అశోక్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం





జమ్మికుంట నవంబర్ 21 (ప్రజావాణి)జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని వార్డులో తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరా జీవిత బీమా పథకం చేనేత పింఛన్ల ప్రొసీడింగ్ లెటర్లపంపిణీకార్యక్రమంవార్డు ప్రజలందరూసమక్షంలో కౌన్సిలర్ యాట్ల సునీత అశోక్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి పింఛన్ పత్రాలు అందజేయడం జరిగిందిఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి కౌన్సిలర్ యాట్ల సునీత అశోక్ మాట్లాడుతూ ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా ధైర్యము నింపడం ప్రభుత్వ ముఖ్య ఉద్దేశంకుటుంబంలోని కుటుంబ పెద్ద ను కోల్పోతే ఆ కుటుంబం కి ఆర్థిక భరోసా కల్పించడానికి ఉచిత ఐదు లక్షల బీమా పథకాన్ని వారికి అందించి ఆ కుటుంబానికి సహాయం చేయడానికి గాను ప్రభుత్వం వారిని ఆదుకోవడానికి గాను ఈ పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది. కాబట్టి ప్రజలందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు వార్డులో మంజూరైన చేయూత పింఛన్లను అందజేయడం జరిగిందిఇట్టి కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకుడు రోమాల రాజ్ కుమార్ వార్డ్ ఆఫీసర్ఆర్.పివిజయలక్ష్మివార్డు ప్రజలు పాల్గొనడం జరిగింది

ఎరువుల బుకింగ్‌పై డీలర్లకు అవగాహన





మన ప్రజావాణి చౌడేపల్లి నవంబర్ 21మండలంలోని ఎరువుల డీలర్లకు ఎఫ్ఎఫ్ఎస్ (FFS) యాప్ వినియోగంపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్, మండల వ్యవసాయ అధికారి డి. మోహన్‌కుమార్ పాల్గొని యాప్ పనితీరును వివరించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రైతులు ఫార్మర్ ఐడీ లేదా ఆధార్ నంబర్‌తో యాప్‌లో లాగిన్ అయి, పంట సర్వే నంబర్లను ఎంపిక చేసుకుని అవసరమైన ఎరువులను బుక్ చేసుకోవాలని సూచించారు. బుకింగ్ అనంతరం జనరేట్ అయ్యే క్యూఆర్ కోడ్‌తో రెండు రోజుల్లోగా తమకు నచ్చిన దుకాణంలో ఎరువులు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. గడువులోగా కొనుగోలు చేయకపోతే కోడ్ రద్దవుతుందని తెలిపారు. యాప్‌పై రైతులందరికీ అవగాహన కల్పించాలని డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

పలాస జంట పట్టణాల్లో విచ్చలవిడిగ నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాలు

- వారానికి లక్షల్లో అక్రమ ప్లాస్టిక్ అమ్మకాలు
- స్థానికులు అండతో కొందరు రాజస్థాన్ వాసులు అక్రమ ప్లాస్టిక్ దిగుమతి.
- కొత్త మున్సిపాలిటీ చైర్స్ పర్సన్ చర్యలు తీసుకుంటారా ?

పలాస ప్రజావాణి ప్రతినిధి పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ, నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాలు కోట్ల రూపాయలు వరకు అక్రమ బిజినెస్ సాగుతుంది.గతము లో ఉన్నా మున్సిపాలిటీ కమీషనర్ అక్రమ ప్లాస్టిక్ అమ్మకాలు పై అంతగా పట్టించు కోలేదని ఇక్కడ విమర్శలు ఉన్నాయి. తర్వాత వచ్చిన కమీషనర్ శ్రీనివాస్ రావు కొన్ని నియంత్రణలు చేశారు. ప్రస్తుతం ఇక్కడ అక్రమ ప్లాస్టిక్ దిగుమతి,అమ్మకాలు పెరిగి పోతున్నాయి.వారానికి లక్షల్లో బిజినెస్ సాగుతుంది

అధికారులు నామమాత్రపు తనిఖీలు.. పట్టించుకోని యంత్రాంగం జిల్లాలో ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా సాగుతోంది. శ్రీకాకుళం నగరపాలక సంస్థతో పాటు ప్రధాన పట్టణాల్లో నిషేధిత ప్లాస్టిక్ యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. నియంత్రణ, నిషేధం పేరుకే పరిమితమవుతున్నాయి. ఆచరణలో మాత్రం మార్పు కనిపించడం లేదు. చిన్న కిరాణా దుకాణం నుంచి పెద్ద రెస్టారెంట్ వరకు







ప్లాస్టిక్ వినియోగం సాధారణంగా మారిపోయింది. నిత్యం పోగవుతున్న చెత్తలో గణనీయమైన వాటా ప్లాస్టిక్ వ్యర్థాలదే. గతంలో అవగాహన కార్యక్రమాలు, తనిఖీలు చేపట్టినా.. ఆ తర్వాత వాటిని పట్టించుకోవడం మానేశారనే విమర్శలున్నాయి. నిషేధం అమలుపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయకపోవడంతో ప్లాస్టిక్ వినియోగానికి అడ్డుకట్ట పడడం లేదు.

చెత్తలోనూ భారీ వాటా

జిల్లాలో శ్రీకాకుళం నగరపాలక సంస్థతో పాటు ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస మునిసిపాలిటీలు ఉన్నాయి. ఈ నాలుగు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో రోజుకు మొత్తం 155 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఇందులో 17.5 మెట్రిక్ టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉండడం ఆందోళన కలిగిస్తోంది- శ్రీకాకుళం నగరంలో రోజుకు 80 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుండగా, అందులో 6.5 మెట్రిక్ టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలే. గత మూడేళ్లలో ప్లాస్టిక్ వినియోగానికి సంబంధించి 210 కేసులు నమోదు చేసి, రూ.1.59 లక్షల జరిమానా వసూలు చేశారు. పలాస మున్సిపాలిటీ కు కొత్తగా ఎన్నికయిన చైర్మన్, కౌన్సిల్ సభ్యులు అక్రమ ప్లాస్టిక్ దిగుమతి, అక్రమ అమ్మకాలు పై చర్యలు తీసుకోవాలని ఇక్కడ ప్రజలు కోరుతున్నారు

19వ సారి రక్తదానం చేయనున్న డా. టి. జనార్దన్

● రక్తదానం ద్వారా ప్రాణదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత



మన ప్రజావాణి పుంగనూరు, నవంబర్ 21: రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని, రక్తదానం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని మాజీ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. టి. జనార్దన్ పేర్కొన్నారు.ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ సోమవారం పుంగనూరులోని శుభారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో తాను కూడా రక్తదానం చేయనున్నట్లు వెల్లడించారు. తన జీవితంలో ఇప్పటివరకు 18 సార్లు రక్తదానం చేయగా, ఈ శిబిరంలో 19వ సారి రక్తదానం చేయడం విశేషమన్నారు.రక్తదానం అనేది కేవలం సేవా కార్యక్రమం మాత్రమే కాదని, అత్యవసర పరిస్థితుల్లో ఎంతోమంది ప్రాణాలను నిలబెట్టే గొప్ప మానవతా కార్యక్రమమని పేర్కొన్నారు. ముఖ్యంగా యువతలో రక్తదానంపై అవగాహన పెంపొందించి, రక్తం అందక ఎవరూ ప్రాణాలు కోల్పోకుండా చూడాలన్నదే ఈ శిబిరం ప్రధాన లక్ష్యమన్నారు.కావున విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్య వాదులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేసి మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని డా. జనార్దన్ పిలుపునిచ్చారు.

హైపర్ సెన్సిటివ్ కొనకంచి గ్రామంలో 50 మంది పోలీసుల భారీ ఫ్లాగ్ మార్చ్ - నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

● పంచాయతీ ఎన్నికల వేళ కొనకంచి గ్రామంలో పోలీసుల కవాతు - ప్రజల్లో భద్రతా భావం

పెనుగంచిప్రోలు నవంబర్ 21 మన ప్రజావాణి గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యంగా ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు హైపర్ సెన్సిటివ్ గ్రామంలో50 మంది పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కొనకంచి గ్రామంలో డీసీపీ రూరల్, నందిగామ ఏసీపీ, జగ్గయ్యపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శాంతిభద్రతలను కాపాడటంతో పాటు ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు



హెచ్చరించారు.అనంతరం మైక్ ద్వారా గ్రామ ప్రజలకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. అనుమతులు లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదని, ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం వంటి చర్యలకు పాల్పడటం చట్టరీత్యా నేరమని వివరించారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, పోలీసులకు, ఎన్నికల అధికారులకు సహకరించాలని సూచించారు. గ్రామాల్లో అనుమానా స్పద కార్యకలాపాలు లేదా అవాంఛనీయ సంఘటనలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పెనుగంచిప్రోలు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని తెలిపారు.

చిన్నతుంబలంలో ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

● మత్స్యకారుల ఐక్యత, సంక్షేమానికి పెద్దపీట



పెద్దకడబూరు: నవంబర్ 22 ప్రజావాణి మండల పరిధిలోని చిన్నతుంబలం గ్రామంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకారుల ఐక్యత, సంక్షేమం, సమాజానికి వారు అందిస్తున్న సేవలను గుర్తుచేసుకున్నారు. చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారుల వృత్తి ఎంతో ప్రాధాన్యతతో కూడుకున్నదని పేర్కొన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి, వారి హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.కార్యక్రమంలో మల్లయ్య, నరసింహ, కొట్టం హనుమంతు, మహాదేవ్, ఈరన్న, పెద్ద వీరేష్, రమేష్, వాసప్ప, చిన్న వీరేష్, నీరుగంటి బసన్న, వెంకటేష్ రాజు, విష్ణు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లిలో సర్పంచ్ బరిలో 80 మంది.. వార్డులకు 290 మంది!

● 19 గ్రామ పంచాయతీల్లో నామినేషన్ల పరిశీలన పూర్తి

మన ప్రజావాణి చౌడేపల్లి: నవంబర్ 21గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో చౌడేపల్లి మండలంలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు దాఖలైన నామినేషన్లను అధికారులు పరిశీలించి అర్హులైన అభ్యర్థుల వివరాలను ఎంపీడీవో లీల మాధవి వెల్లడించారు.

మండలవ్యాప్తంగా సర్పంచ్ స్థానాలకు 102 మంది, వార్డు సభ్యుల స్థానాలకు 303 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వీటిలో పరిశీలన అనంతరం 80 మంది సర్పంచ్ అభ్యర్థులు, 290 మంది వార్డు సభ్యుల అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటైనట్లు అధికారులు ప్రకటించారు.

గ్రామాల వారీగా పరిశీలిస్తే చౌడేపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ స్థానానికి నలుగురు, వార్డు సభ్యుల స్థానాలకు 36 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఏ. కొత్తకోటలో 8 మంది సర్పంచ్, 25 మంది వార్డు సభ్యులు, కాగతిలో 8 మంది సర్పంచ్, 17 మంది వార్డు సభ్యులు, కాటిపేరిలో 8 మంది సర్పంచ్, 15 మంది వార్డు సభ్యులు బరిలో ఉన్నారు.

దిగువపల్లిలో 4 మంది సర్పంచ్, 20 మంది వార్డు సభ్యులు, దుర్గసముద్రంలో 5 మంది సర్పంచ్, 20 మంది వార్డు సభ్యులు, వెంగళపల్లిలో 4 మంది సర్పంచ్, 19 మంది వార్డు సభ్యులు, కొండామర్రిలో 4 మంది సర్పంచ్, 17 మంది వార్డు సభ్యులు అర్హత సాధించారు.

అదేవిధంగా చింతమాకులపల్లిలో 4 మంది సర్పంచ్, 17 మంది వార్డు సభ్యులు, చారాలలో 4 మంది సర్పంచ్, 13 మంది వార్డు సభ్యులు, గడ్డంవారిపల్లిలో 2 మంది సర్పంచ్, 10 మంది వార్డు సభ్యులు, పరికిదోనలో 5 మంది సర్పంచ్, 10 మంది వార్డు సభ్యులు, పూడిపట్లలో 4 మంది సర్పంచ్, 14 మంది వార్డు సభ్యులు, కొండయ్యగారిపల్లిలో 2 మంది సర్పంచ్, 8 మంది వార్డు సభ్యులు, పందిళ్లపల్లిలో 3 మంది సర్పంచ్, 10 మంది వార్డు సభ్యులు, శెట్టిపేటలో 3 మంది సర్పంచ్, 9 మంది వార్డు సభ్యులు, పెద్దయల్లకుంట్లలో 3 మంది సర్పంచ్, 14 మంది వార్డు సభ్యులు, లద్దిగంలో 4 మంది సర్పంచ్, 8 మంది వార్డు సభ్యుల నామినేషన్లు చెల్లుబాటయ్యాయి. అమినిగుంటలో ఒక సర్పంచ్, 8 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు అర్హత సాధించారు.

నామినేషన్ల పరిశీలన పూర్తికావడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. ఉపసంహరణ ప్రక్రియ అనంతరం తుది పోటీలో నిలిచే అభ్యర్థుల సంఖ్యపై స్పష్టత రానుంది.

పెనుగంచిప్రోలు జమ్మి చెట్టు రామాలయంలో ఘనంగా చిలుకు ద్వాదశి వేడుకలు..



పెనుగంచిప్రోలు నవంబర్ 21 మన ప్రజావాణి పెనుగంచిప్రోలు గ్రామంలోని ప్రసిద్ధ జమ్మి చెట్టు శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో శనివారం చిలుకు ద్వాదశి (క్షీరాబ్ధి ద్వాదశి) వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగాయి. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తులసి, ఉసిరి మొక్కలకు శాస్త్రోక్తంగా పూజలు చేసి, క్షీరాబ్ధి ద్వాదశి వ్రత విశిష్టతను అర్చకులు బాలకృష్ణమాచార్యులు భక్తులకు వివరించారు. అనంతరం తులసి, ఉసిరి కళ్యాణం చుంచు బెనర్జీ దంపతులు,గూడూరు శ్రీనివాసరావు దంపతులు చేతుల మీద ఘనంగా నిర్వహించారు. కళ్యాణంలో పాల్గొన్న దంపతులు చెరుకు గడలతో చిలుకు తొక్కారు.మహిళా భక్తులు దీపాలు వెలిగించి స్వామివారికి హారతులు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారువేడుకల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వ్యాఖ్యాన ప్యానెల్ నుంచి వార్నర్, ఖవాజా తొలగింపు

శాండ్‌పేపర్ వివాదం మళ్లీ ముదరడంతో ఫాక్స్ స్పోర్ట్స్ నిర్ణయం.. కొన్ని వారాల పాటు ప్రసారాలకు దూరం



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా క్రికెట్‌లో ఎనిమిదేళ్ల క్రితం సంచలనం సృష్టించిన బాల్ టాంపరింగ్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ వివాదం కారణంగా మాజీ క్రికెటర్లు డేవిడ్ వార్నర్, ఉస్మాన్ ఖవాజాలకు ఎదురుదెబ్బ తగిలింది. వీరిద్దరినీ ఫాక్స్ స్పోర్ట్స్ తన క్రికెట్ వ్యాఖ్యాన ప్యానెల్ నుంచి తాత్కాలికంగా తప్పించింది. ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో వీరు వ్యాఖ్యాతలుగా వ్యవహరించడం లేదు. గతంలో చోటుచేసుకున్న బాల్ టాంపరింగ్ ఘటనపై ఖవాజా తన ఆత్మకథలో చేసిన వ్యాఖ్యలు, వాటికి వార్నర్ మద్దతు తెలపడం తాజా పరిణామాలకు కారణమయ్యాయి. 2018లో దక్షిణాఫ్రికా పర్యటన సందర్భంగా కేప్‌టౌన్ టెస్టులో ఆస్ట్రేలియా ఆటగాళ్లు బంతి ఆకారాన్ని మార్చేందుకు శాండ్‌పేపర్ ఉపయోగించిన ఘటన అప్పట్లో ప్రపంచ క్రికెట్‌ను కుదిపేసింది. ఈ వ్యవహారంలో అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్‌పై చర్యలు తీసుకున్నారు. స్మిత్, వార్నర్‌లపై ఏడాది నిషేధం విధించగా, బాన్‌క్రాఫ్ట్‌పై తొమ్మిది నెలల నిషేధం విధించారు. ఈ ఘటనతో ఆస్ట్రేలియా క్రికెట్ ప్రతిష్ఠ తీవ్రంగా దెబ్బతింది. అనంతరం జట్టు నాయకత్వంలోనూ, నిర్వహణలోనూ పలు మార్పులు చోటుచేసుకున్నాయి. అయితే ఈ ఘటనకు సంబంధించిన అసలు విషయాలు మరోసారి చర్చకు రావడానికి ఉస్మాన్ ఖవాజా రాసిన 'సబ్' ఆత్మకథ కారణమైంది. బంతిని టాంపరింగ్ చేయాలనే ప్రణాళిక గురించి జట్టులోని మరికొందరికి కూడా ముందుగానే తెలుసని, ఈ వ్యవహారం ముగ్గురు ఆటగాళ్లకే పరిమితం కాలేదని ఆయన తన పుస్తకంలో పేర్కొన్నారు. దీంతో అప్పట్లో జరిగిన విచారణ, బాధ్యుల గుర్తింపు, జట్టు సభ్యుల పాత్రపై మళ్లీ ప్రశ్నలు మొదలయ్యాయి.

ఖవాజా చేసిన వ్యాఖ్యలకు డేవిడ్ వార్నర్ మద్దతు ప్రకటించారు. 2018లో జరిగిన విచారణ సక్రమంగా జరగలేదని, వాస్తవాలు పూర్తిస్థాయిలో బయటకు రాలేదని అభిప్రాయపడ్డారు. మరోవైపు అప్పట్లో బంతి టాంపరింగ్‌కు సంబంధించిన విషయాలు మొత్తం జట్టుకు తెలుసనే ఆరోపణలను ప్రస్తుత ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ తీవ్రంగా ఖండించారు. తనకు ఈ వ్యవహారంపై ముందస్తు సమాచారం లేదని స్పష్టం చేశారు. కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ కూడా ఈ వివాదంపై తాజాగా స్పందించడంతో ఆస్ట్రేలియా క్రికెట్‌లో విభేదాలు మరింత పెరిగాయి. ఈ నేపథ్యంలో ఫాక్స్ స్పోర్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ స్టీవ్ క్రాలీ కీలక ప్రకటన చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఉస్మాన్ ఖవాజా, డేవిడ్ వార్నర్‌లను రానున్న కొన్ని వారాల పాటు ప్రసార కార్యక్రమాలకు దూరంగా ఉంచుతున్నట్లు వెల్లడించారు. వ్యాఖ్యాతలందరి అభిప్రాయాలను తాము గౌరవిస్తామని, భిన్నమైన అభిప్రాయాలను స్వాగతిస్తామని పేర్కొన్నారు. అయితే వివాదంపై ప్రతిసారీ స్పందించాల్సిన ఒత్తిడి కారణంగా వారు ఆటపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేని పరిస్థితి ఉందని తెలిపారు. ప్రేక్షకులకు మెరుగైన క్రికెట్ ప్రసారాలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని, పరిస్థితులను గమనిస్తూ తదుపరి నిర్ణయం తీసుకుంటామని వివరించారు. మరోవైపు ఈ వివాదం కొనసాగుతున్న సమయంలో క్రికెట్ ఆస్ట్రేలియా పాట్ కమిన్స్‌కు అండగా నిలిచింది. బోర్డు సమావేశంలో కమిన్స్ నాయకత్వానికి ఏకగ్రీవ మద్దతు లభించింది. టెస్టు, వన్డే జట్ల కెప్టెన్‌గా ఆయన కొనసాగుతారని స్పష్టం చేసింది. 2018 ఘటనకు సంబంధించి ఆటగాళ్లు, సహాయక సిబ్బంది తమ అనుభవాలను వెల్లడించేందుకు స్వతంత్ర వేదిక ఏర్పాటు చేయనున్నట్లు కూడా ప్రకటించింది.

ధోనీ నిర్ణయం ఆశ్చర్యపరిచింది

• మెంటర్‌గా కొత్త బాధ్యతలు..

జహీర్ ఖాన్ ఆసక్తికర వ్యాఖ్యలు



స్పోర్ట్స్ డెస్క్: ఐపీఎల్‌లో ఆటగాడిగా మహేంద్రసింగ్ ధోనీ వీడ్కోలు పలకడంపై చెన్నై సూపర్ కింగ్స్ కోచ్ జహీర్ ఖాన్ స్పందించాడు. ధోనీ రిటైర్మెంట్ నిర్ణయం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని తెలిపాడు. ఆటగాడిగా ధోనీని మైదానంలో చూడలేకపోవడం బాధాకరమైనప్పటికీ, మెంటర్‌గా అతడి అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నాడు.ధోనీ నిర్ణయం గురించి తాను ముందుగా ఊహించలేదని జహీర్ వెల్లడించాడు. జట్టు కూర్పు, ఆటగాళ్ల ఎంపికపై చర్చిస్తున్న సమయంలో ధోనీ తన నిర్ణయాన్ని వెల్లడించాడని చెప్పాడు. వేలంలో జట్టుకు మరింత డబ్బు అందుబాటులో ఉంటుందని ధోనీ సరదాగా వ్యాఖ్యానించినట్లు తెలిపాడు.ప్రధాన కోచ్‌గా తనకు ధోనీ మెంటర్‌గా ఉండటం ఎంతో ప్రయోజనకరమని జహీర్ అభిప్రాయపడ్డాడు. అతడి అనుభవం, నాయకత్వ లక్షణాలు యువ ఆటగాళ్లకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నాడు. కీలక సమయాల్లో తన బాధ్యతలను పంచుకుంటూ జట్టుకు అండగా ఉంటాడని ఆశాభావం వ్యక్తం చేశాడు.ఐపీఎల్‌లో ఐదుసార్లు చెన్నై సూపర్ కింగ్స్‌కు టైటిల్ అందించిన ధోనీ, ఇప్పుడు మెంటర్‌గా కొత్త పాత్ర పోషించనున్నాడు. అతడి అనుభవంతో సీఎస్కే మళ్లీ విజయాల బాట పడుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.

డబ్ల్యూటీసీలో పంత్ అరుదైన రికార్డు

• 3 వేల పరుగుల మైలురాయి..

ఈ ఘనత సాధించిన తొలి వికెట్ కీపర్‌గా చరిత్ర



వెల్లింగ్టన్: భారత వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో అరుదైన ఘనత సాధించాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో అర్ధసెంచరీ సాధించిన పంత్.. డబ్ల్యూటీసీ చరిత్రలో 3 వేల పరుగులు పూర్తి చేసిన తొలి వికెట్ కీపర్ బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు.మూడో రోజు ఆటలో పంత్ 55 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ మ్యాచ్‌కు ముందు అతడి ఖాతాలో 2,948 పరుగులు ఉండగా, మరో 52 పరుగులు చేయాల్సి వచ్చింది. కేవలం 55 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేస్తూ ఈ మైలురాయిని అందుకున్నాడు. ఇప్పటివరకు డబ్ల్యూటీసీలో వికెట్ కీపర్లలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా పంత్ నిలిచాడు.ఇదే మ్యాచ్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా 3 వేల పరుగుల క్లబ్‌లో చేరాడు. 98 పరుగులు చేసిన గిల్ తృటిలో సెంచరీ కోల్పోయాడు. భారత బ్యాటర్ల ధాటికి మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 486/4 పరుగులు చేసి, న్యూజిలాండ్‌పై 118 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.కాగా, గాయం నుంచి కోలుకుని తిరిగి జట్టులోకి వచ్చిన పంత్.. తన అద్భుత బ్యాటింగ్‌తో మరోసారి సత్తా చాటాడు.

సచిన్‌ను కూడా పక్కనపెట్టేవారేమో!

సిరాజ్‌కు చోటివ్వకపోవడంపై కైఫ్ అసంతృప్తి.. టీమ్ మేనేజ్‌మెంట్ తీరుపై విమర్శలు



ఇంటర్నెట్ డెస్క్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు తుది జట్టులో చోటు కల్పించకపోవడంపై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. రెండు మూడు మ్యాచ్‌ల్లో విఫలమైతేనే అనుభవజ్ఞులైన ఆటగాళ్లను పక్కన పెడుతున్నారని విమర్శించాడు. ప్రస్తుత టీమ్ మేనేజ్‌మెంట్ తీరు ఇలాగే ఉంటే సచిన్ టెండూల్కర్‌ను కూడా జట్టు నుంచి తప్పించేవారేమోనని వ్యాఖ్యానించాడు.

తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడిన కైఫ్.. ఇంగ్లండ్ పర్యటనలో అద్భుతంగా బౌలింగ్ చేసిన సిరాజ్‌ను పక్కన పెట్టడం సరికాదన్నాడు. ఒక సిరీస్‌లో వికెట్లు తక్కువగా తీసినంత మాత్రాన ఆటగాడి సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేయకూడదని సూచించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ప్రతి ఆటగాడికి మంచి, చెడు రోజులు ఉంటాయని గుర్తుచేశాడు.సీనియర్ ఆటగాళ్ల అనుభవానికి తగిన గౌరవం ఇవ్వడం లేదని కైఫ్ విమర్శించాడు. సిరాజ్‌తో పాటు రవీంద్ర జడేజాను కూడా పక్కన పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో జడేజా 516 పరుగులు చేసి అద్భుతంగా రాణించాడని గుర్తుచేశాడు.యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వడం అవసరమే అయినప్పటికీ, గతంలో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన సీనియర్ల సేవలను విస్మరించకూడదని కైఫ్ అభిప్రాయపడ్డాడు.

ఆరోపణలతో మానసికంగా కుంగిపోయా: సర్ఫరాజ్

- కష్టకాలంలో గంభీర్ అండగా నిలిచారు.. రెండుసార్లు ఫోన్ చేసి ధైర్యం చెప్పారు



డ్రెస్సింగ్ రూమ్ సమాచారాన్ని బయటకు వెల్లడించానంటూ వచ్చిన ఆరోపణలు తనను తీవ్రంగా బాధించాయని భారత క్రికెటర్ సర్ఫరాజ్ ఖాన్ వెల్లడించాడు. 2024-25లో ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సమయంలో ఈ ఆరోపణలు వచ్చాయని తెలిపాడు.ఈ వివాదంతో తాను మానసికంగా కుంగిపోయానని, కుటుంబ సభ్యులు కూడా తీవ్ర ఆవేదనకు గురయ్యారని చెప్పాడు. ముఖ్యంగా తన తండ్రి బాధపడటం, భార్య ఏడవడం తనను మరింత కలచివేశాయని పేర్కొన్నాడు.ఆ సమయంలో టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ రెండుసార్లు ఫోన్ చేసి ధైర్యం చెప్పారని సర్ఫరాజ్ గుర్తుచేసుకున్నాడు. అనవసరమైన విషయాలను పట్టించుకోకుండా ఆటపై దృష్టి పెట్టాలని సూచించారని తెలిపాడు. తన తండ్రితోనూ మాట్లాడి, సర్ఫరాజ్‌ను క్రికెట్ ఆడనివ్వాలని చెప్పినట్లు వెల్లడించాడు.తాను ఎలాంటి సమాచారాన్ని లీక్ చేయలేదని సర్ఫరాజ్ స్పష్టం చేశాడు. ఆరోపణలు నిజమైతే భారత్-ఏ జట్టుకు, శ్రీలంక సిరీస్‌కు తనను ఎంపిక చేసేవారు కాదని పేర్కొన్నాడు. మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రాతో ఇంటర్వ్యూలో ఈ విషయాలను పంచుకున్నాడు.

‘ఇఫీ‘ వేదికపై ‘భక్త కన్నప్ప‘ ప్రదర్శన

పెదనాన్న సినిమాకు అరుదైన గౌరవం..

భావోద్వేగానికి గురైన ప్రభాస్



ఎన్ని సంవత్సరాలు గడిచినా కొన్ని కథలు ఎప్పటికీ నిలిచిపోతాయని అగ్ర కథానాయకుడు ప్రభాస్ అన్నారు. తన పెదనాన్న కృష్ణంరాజు నటించిన క్లాసిక్ చిత్రం ‘భక్త కన్నప్ప’కు 57వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో (ఇఫీ) అరుదైన గౌరవం దక్కడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. బాపు దర్శకత్వంలో కృష్ణంరాజు, తన తండ్రి ఉప్పలపాటి సూర్యనారాయణ రాజు నిర్మించిన ఈ చిత్రం ‘ఇఫీ‘లో ప్రదర్శితం కావడంపై ప్రభాస్ ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందించారు.“నేను చూస్తూ పెరిగిన సినిమా ఇది. పెదనాన్న నటించి, గోపీకృష్ణ మూవీస్ నిర్మించిన ఈ చిత్రానికి బాపు గారు ప్రాణం పోశారు. ఏళ్లు గడిచినా కొన్ని కథలు నిత్యనూతనంగా ఉంటాయి. ‘భక్త కన్నప్ప’ చిత్రాన్ని ఇఫీలో వేడుకగా జరుపుకుంటున్నందుకు గర్వంగా ఉంది. ఇది ఒక అందమైన వారసత్వం, నిజమైన గౌరవం“ అని ప్రభాస్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ క్లాసిక్ చిత్రం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా దీన్ని ప్రదర్శిస్తున్నారు.ఇక, ప్రభాస్ సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం ఆయన పలు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. వాటిలో హను రాఘవపూడి దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ఫౌజీ‘ ఒకటి. ఈ చిత్రం టీజర్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్, హిట్లర్ మధ్య జరిగిన సంభాషణ ఆసక్తి రేపుతోంది.

భారతీయుల రక్తంలో బానిసత్వం ఉందని హిట్లర్ అనగా, ‘ఫౌజీ‘ అనే భారత గూఢచారి పరాక్రమాన్ని నేతాజీ ఉదాహరణగా చూపుతారు. భగవద్గీత ఆధారంగా అతడు సృష్టించిన కోడ్‌ను ఛేదించడం బ్రిటిష్ వారికి కూడా సాధ్యం కాలేదని వివరిస్తారు. ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

టాలీవుడ్‌లో కొత్త ట్విస్ట్..

‘హను-మాన్’ సీక్వెల్‌లో మెగా హీరో!



టాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన ‘హను-మాన్’ సినిమా సీక్వెల్‌పై ఊహించని పరిణామం చోటుచేసుకుంది. మొదటి భాగాన్ని నిర్మించిన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ, మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా ‘హను-మాన్ 2’ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రానికి ‘హను-మాన్ 2: ది రైజ్ ఆఫ్ వానరాస్’ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ‘ఎక్కడికి పోతావు చిన్నవాడా’, ‘ఊరు పేరు భైరవకోన’ వంటి చిత్రాలతో గుర్తింపు పొందిన వి఼ఐ ఆనంద్ ఈ పాన్-ఇండియా ప్రాజెక్టుకు దర్శకత్వం వహించనున్నారు.ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇందులో కండలు తిరిగిన దేహంతో వైష్ణవ్ తేజ్ వెనక్కి తిరిగి నిలబడి ఉండగా, ఒక భారీ హనుమంతుడి తోక ఆయన్ను ఆకాశంలోకి ఎత్తుతున్నట్లుగా డిజైన్ చేశారు. కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.అయితే, ఈ ప్రకటన ఇప్పుడు సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ‘హను-మాన్’ దర్శకుడు ప్రశాంత్ వర్మ, రిషబ్ శెట్టి హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో ‘జై హనుమాన్’ చిత్రాన్ని ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ‘హను-మాన్’ సీక్వెల్ హక్కులు తమకే ఉన్నాయని భావిస్తున్న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్, ఇప్పుడు మరో హీరో, దర్శకుడితో ‘హను-మాన్ 2’ను ప్రకటించడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుండగా, ఇతర నటీనటుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.



కమల్ హాసన్, జేమ్స్ కామెరాన్‌లకు దాదాసాహెబ్‌ఫాల్కే పురస్కారాలు..

టేలర్ స్విఫ్ట్‌కు గ్లోబల్ అవార్డు



దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డ్స్ (డీపీఐఎఫ్ఎఫ్) 2026 విజేతల జాబితాను నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. నవంబర్ 20న తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా విడుదల చేసిన ఈ జాబితాలో దేశీయ, అంతర్జాతీయ సినీ ప్రముఖులు చోటు దక్కించుకున్నాడు. పాప్ సంచలనం టేలర్ స్విఫ్ట్ అంతర్జాతీయ కళాకారిణిగా నిలవగా, భారతీయ స్టాండప్ కమెడియన్ సమయ్ రైనా ఉత్తమ హాస్యనటుడి అవార్డును కైవసం చేసుకున్నాడు.సినిమా విభాగంలో ‘ధురంధర్‘ ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. అందులో నటనకు గానూ రణ్‌వీర్ సింగ్ ఉత్తమ నటుడిగా అవార్డు గెలుచుకున్నాడు. ఆదిత్య ధర్ ఉత్తమ దర్శకుడి పురస్కారాన్ని దక్కించుకున్నాడు. ‘సైయారా‘ చిత్రంలో నటనకు అనీత్ పడ్డా ఉత్తమ నటిగా నిలిచింది. అదే సినిమాలోని ‘సైయారా‘ పాటకు ఉత్తమ గీతం అవార్డు లభించింది. కమల్ హాసన్ భారతీయ చిత్ర పరిశ్రమకు చేసిన సేవలకు గానూ విశిష్ట పురస్కారాన్ని పొందగా, దిగ్గజ సంగీత దర్శకుడు ఇళయరాజా సంగీత రంగానికి చేసిన విశేష కృషికి అవార్డు అందుకున్నారు.

గ్లోబల్ సినిమాలో అద్భుతమైన కృషికి గాను హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు జేమ్స్ కామెరాన్ పురస్కారం సాధించాడు. ‘అవతార్: ఫైర్ అండ్ యాష్‘ ఉత్తమ అంతర్జాతీయ చిత్రంగా నిలిచింది. ‘సిన్నర్స్‘ చిత్రంలో నటనకు మైఖేల్ బి. జోర్డాన్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యాడు. డిజిటల్ విభాగంలో ‘ది బాడ్స్ ఆఫ్ బాలీవుడ్‘ వెబ్ సిరీస్‌కు ఆర్యన్ ఖాన్ ఉత్తమ దర్శకుడి అవార్డు పొందాడు. సీనియర్ నటి స్మృతి ఇరానీ, అక్షయ్ ఖన్నాలు తమ నటనకు ప్రత్యేక గుర్తింపు పొందారు. భారత చలనచిత్ర పితామహుడు దాదాసాహెబ్ ఫాల్కే పేరిట ఈ అవార్డులను ఏటా ప్రైవేట్ సంస్థ అందజేస్తోంది.

ఒక్క లుక్ తో నిద్ర లేకుండా చేస్తున్న నిధి అగర్వాల్!



అందాల నిధిని ఎప్పటికప్పుడు ఆడియన్స్ కు చూపిస్తూ నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ సెగలు పుట్టిస్తున్న నిధి అగర్వాల్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. భాషతో సంబంధం లేకుండా.. పలు అవకాశాలు అందుకుంటున్న ఈమె.. తన గ్లామర్ ఫోటోలతో యావత్ దేశ అభిమానులను విపరీతంగా అలరిస్తోంది. చీర కట్టులో సాంప్రదాయంగా కనిపిస్తూనే.. అటు అదే చీరకట్టులో గ్లామర్ వలకబోస్తూ కుర్ర కారుకు నిద్ర లేకుండా చేస్తోందని చెప్పవచ్చు. ఈ క్రమంలోనే ఇంస్టాగ్రామ్ వేదికగా మరో లేటెస్ట్ ఫోటోషూట్ తో ఆడియన్స్ ముందుకు వచ్చిన ఈ ముద్దుగుమ్మ.. తాజాగా షేర్ చేసిన ఫోటోలు మాత్రం అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. చీరకట్టులో కూడా ఇంత గ్లామర్ వలకబోయొచ్చా అంటూ కామెంట్లు చేస్తున్నారు. నిధి అగర్వాల్ ఇంస్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోషూట్ విషయానికి వస్తే.. డీప్ పర్పుల్ డిజైనర్ లెహంగా ధరించింది నిధి అగర్వాల్. చీర లాగా కట్టుకునే ఫ్యూజన్ లెహంగా చీర ఇది. కింది భాగంలో లెహంగాకు కుచ్చులు ఉండి, పైన చీర కొంగు స్టైల్ లో వస్తుంది. ఇక ఫ్యాబ్రిక్ విషయానికి వస్తే తేలికపాటి షిఫాన్ ఫ్యాబ్రిక్ తో దీనిని డిజైన్ చేశారు.చీర అంచున మొత్తం గోల్డ్ ,సిల్వర్ రంగుల జరీ సీక్వెన్స్, పూసల వర్క్ తో పాటు అందమైన లేస్ , కట్ వర్క్ డిజైన్ తో డిజైన్ చేశారు. ఇక చీర మధ్య భాగంలో అక్కడక్కడ చిన్న చిన్న బుట్టీలు లెహంగా అందాన్ని రెట్టింపు చేశాయి. ఇక లెహంగా కింది భాగంలో భారీ జర్దోసి, జరీ ఎంబ్రాయిడరీ వర్క్ తో డిజైన్ చేశారు. బ్లౌజ్ విషయానికి వస్తే.. చీరకి మ్యాచింగ్ గా స్వీట్ హార్ట్ నెక్ లైన్ కలిగిన హెవీ ఎంబ్రాయిడరీ బ్లౌజ్ ని ధరించింది. చేతులకు చిన్నచిన్న పూసల హ్యాంగింగ్స్ ను జోడించారు. పెద్దపెద్ద జుంకాలు ధరించిన ఈమె చేతికి బంగారు రంగు గాజులు ధరించి తన అవుట్ ఫిట్ ని ఫుల్ ఫిల్ చేసుకుంది. ఇక ఈ చీర లాంటి లెహంగాలో అందాలు ఆరబోస్తూ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ ఇక ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

వాయిదా పడిన బెల్లంకొండ ‘హైందవ‘..



యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం ‘హైందవ‘ విడుదల వాయిదా పడింది. సంయుక్త కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని తొలుత ఈ నెల 27న విడుదల చేయాలని చిత్ర బృందం నిర్ణయించింది. అయితే, అనివార్య కారణాల వల్ల ఈ సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.మూన్‌షైన్ పిక్చర్స్ పతాకంపై మహేశ్ చందు నిర్మిస్తున్న ఈ చిత్రానికి లుధీర్ బైరెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సినిమా వాయిదాపై నిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. “అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ప్రేక్షకులకు ఒక ఉత్తమ అనుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే ‘హైందవ‘ విడుదలను వాయిదా వేస్తున్నాం. త్వరలోనే నూతన విడుదల తేదీని ప్రకటిస్తాం“ అని మేకర్స్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలుపుతూ ఒక సరికొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు.గత నెలలో విడుదలైన ఈ సినిమా టీజర్ ప్రేక్షకుల్లో విశేష ఆసక్తిని రేకెత్తించింది. రంగపురం అనే గ్రామంలోని పురాతన ఆలయంలో విగ్రహాలు మాయమవడం, ఒక గ్రామస్థుడి హత్య నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఈ కేసును దర్యాప్తు చేసే నాస్తికుడైన పోలీస్ ఆఫీసర్‌గా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటిస్తున్నారు. దైవ విశ్వాసం, హేతువాదం మధ్య జరిగే సంఘర్షణే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. ఈ సినిమాలో మహేశ్ మంజ్రేకర్ ఆలయ పూజారిగా నటిస్తుండగా, జేడీ చక్రవర్తి, శివాజీ రాజా, గెటప్ శ్రీను ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి సామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, హరీశ్ కన్నన్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, peerzadi guda, GHMC, medchal malkaj giri AND PUBLICATIONS, , Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONSContact No : 9440032006. MAIL ID : prajavaani006@gmail.comepaper.prajavaani.net